




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ*

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 239








శనివారం | 14-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 8.48 తదుపరి తదియ; నక్షత్రం: పునర్వసు తె. 5.04 తదుపరి పుష్యమి; వర్జ్యం: సా. 5.27-7.00; దుర్ముహూర్తం: ఉ. 6.41-8.08; అమృతఘడియలు: రా. 2.44-4.17; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 5.39



9

## రాజధాని మార్పుం

అలాంటి ప్రతిపాదన లేదు

టీడీపీ ఎమ్మెల్సీ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం

## 'రివర్స్'లో రాజకీయం!

అధికార పార్టీ నేతల జోక్యం

గ్యారెంటీలు ఇవ్వకుండా అడ్డుకట్ట

రివర్స్ టెండర్‌లో తగ్గుతున్న పోటీ

ఖజానాకు నామమాత్రంగానే ఆదా

నెల్లూరు పనుల్లో జరిగింది ఇదే 10

మలిదేవి, డీఆర్‌డీఎం పనుల్లో స్వల్పం

మరో రెండు పనుల్లో భారీగా లెస్

'ఆంధ్రజ్యోతి' కథనాలపై స్పందన

బీజీల సమర్పణకు మరిన్ని ఆఫీసులు



10

## మాజీ ఎంపీ హర్షకుమార్ అరెస్టు

14 రోజులు రిమాండ్... సెంట్రల్ జైలుకు తరలింపు

## శ్రీవారి ఆలయం ముంగిట ఆత్మహత్య 3

లారీ కిందపడి భక్తుడి బలవన్మరణం

## 10 నుంచి 20 వరకు సంక్రాంతి సెలవులు 10



ఇలా తిడతారా? చంద్రబాబు క్షమాపణ చెప్పాలంటూ సీఎం జగన్.. తనకు జరిగిన అవమానానికి ప్రభుత్వమే క్షమాపణ చెప్పాలంటూ చంద్రబాబు.. పరస్పరం వాదులాడుకున్నారు. మార్షల్స్‌ను బాస్టర్డ్ అని టీడీపీ అధినేత అన్నారని ముఖ్యమంత్రి.. తానా పదమే అనలేదని.. నో క్వశ్చన్, న్యూసెన్స్ అని మాత్రమే అన్నానని టీడీపీ అధినేత స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను ప్రభుత్వం సభలో ప్రదర్శించింది. ఆ పదం అన్నట్లు తేలిందని అధికార పక్షం.. అనలేదని రుజువైందని ప్రతిపక్షం.. వీడియో తర్వాత కూడా వాదించుకున్నాయి.



# విన్నారా.. కన్నారా!



## 'బాస్టర్డ్' పదంపై సభలో కదనం

**చీఫ్ మార్షల్‌ను చంద్రబాబు తిట్టారు.. ఆయనపై చర్యలు తీసుకోవాలి**

**సీఎం సహా అధికారపక్షం దాడి.. 'నో క్వశ్చన్'ను బాస్టర్డ్‌గా మార్చారు**

**అననిది అన్నట్లుగా చిత్రీకరించారు.. విపక్ష తెలుగుదేశం ఎదురు దాడి**

**సభలో, బయటా ఇరుపక్షాల వీడియో.. సీఎంపై సభా హక్కుల నోటీసు**

తొలుత కలవరపడి.. ఆపై ఎదురుదాడి!

స్వయంగా వీడియో చూసినబాబు

తప్పు చేయలేదని నిర్ధారణ 9

ఆపై సీఎం మీద 'హక్కుల' నోటీసు

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మార్షల్స్ తమను సభలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడంపై ప్రతిపక్షం మండిపడింది. గురువారం తమను సభలోకి రానివ్వకుండా గేట్లు మూసి చీఫ్ మార్షల్ అడ్డుకున్నారని ప్రతిపక్షం చేసిన విమర్శలపై శుక్రవారం సభ ప్రారంభం కాగానే చర్చ జరిగింది. సీఎం జగన్, మంత్రులు పేర్ని నాని, కన్నబాబు, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అవంతి, అనిల్‌కుమార్, వైసీపీ ఎమ్మెల్యేలు ఈ అంశంపై మాట్లాడారు. 'అసలు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు రావలసిన గేటు అది కాదు. గేట్-2 నుంచి రావాలి. అలాకాకుండా కాలినడకన ఊరేగింపుగా వచ్చారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ కార్యకర్తలు, బ్లాక్ క్యాట్ కమెండోలు

మిగతా 9వ పేజీలో...

## మహిళలు, బాలికలకు

# కవచం

క్రూరుల విషయంలో కర్కశం

ఏపీ దిశ బిల్లు ఏకగ్రీవం 2

ఆధారాలతో దొరికితే మరణశిక్షే

'ఎన్‌కౌంటర్'పై విచారణ తీరుతో

చట్టాలు, కోర్టులపై అపనమ్మకం

ఇక సోషల్‌మీడియాపైనా చట్టం

అభ్యంతరకర పోస్టులపై వేటు

తొలి తప్పునకు రెండేళ్ల జైలు

ఇంకా చేస్తుంటే నాలుగేళ్ల ఖైదు

పోక్సో కేసుల్లో ఉరికీ వీలు: సీఎం



బిల్లు ప్రవేశపెడుతున్న హోంమంత్రి సుచరిత

'ప్రతీకారం' కారాదన్న సుప్రీం వ్యాఖ్యలూ పరిగణనలోకి

జనంలో అవగాహనపై దృష్టి.. సర్కార్‌కు చంద్రబాబు సూచన

**కేసీఆర్‌కు మళ్లీ హ్యాట్సాఫ్**

"సినిమాల్లో రేపిస్టులను కాల్చిచంపితే చప్పట్లు కొడతాం. అదే పనిచేసిన పోలీసులు, సీఎం కేసీఆర్‌కు మరోసారి అభినందనలు. విచారణ జరుపుతున్న ఎన్‌హెచ్‌ఆర్సీ, సుప్రీంకోర్టు కమిటీలు ఈ ఎన్‌కౌంటర్‌ను రేపు తప్పు బడతాయి. అప్పుడు నేరగాళ్లకు శిక్షలు పడవు. బాధిత కుటుంబం మాత్రం రోదిస్తూనే ఉంటుంది. ఈ స్థితిని మార్చాలని తెచ్చిందే దిశ బిల్లు"

- సీఎం జగన్

## ఐదేళ్ల పాపపై అత్యాచారం

'దిశ' ఆమోదం

రోజే వెలుగులోకి

ఎన్‌కౌంటర్ చేస్తారా

రెడ్డి అని వదిలేస్తారా

మహిళా సంఘాల ప్రశ్న

## నేడు 'ఆయేషా'కు మళ్లీ శవపరీక్ష 2

## ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులా?

ప్రజాస్వామ్య దేశంలో ఇదేం పద్ధతి?

రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు

ఎవరి అనుమతితో చేస్తున్నారని నిలదీత

దీనికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

పది రోజుల్లో నివేదిక సమర్పించండి

గుంటూరు కలెక్టర్‌కు ధర్మాసనం ఆదేశం

చర్యలు తీసుకోవాలని ఈసీకి సూచన

తదుపరి విచారణ ఈనెల 23కు వాయిదా



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలకు అధికార పార్టీ రంగులు పులమడంపై హైకోర్టు మండిపడింది. ప్రజాస్వామ్య దేశంలో ఇదేం పద్ధతని నిలదీసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ భవనాలకు పార్టీ పతాకాల రంగులు వేయరాదని స్పష్టం చేసింది. అసలు ఎవరి అనుమతితో ప్రభుత్వ భవనాలకు అధికార పార్టీ రంగులేస్తున్నారో, ఎవరు వేయిస్తున్నారో, దీనికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో పూర్తి వివరాలు తమ ముందుంచాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఎన్నికలు

మిగతా 9వ పేజీలో...

నెల్లూరులో ముస్లింల భారీ ర్యాలీ



## పౌరసత్వ బిల్లుపై ఆగ్రహజ్వాల 2

జిల్లాల్లో శాంతి ర్యాలీలు, ధర్నాలు

## కడప స్టీల్‌కు 3148.68 ఎకరాలు

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో చేపట్టనున్న సమీకృత స్టీల్ ప్లాంటు కోసం 3148.68 ఎకరాలను కేటాయిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మలమడుగు మండలం పెద్దగండ్లూరు, సున్నపురాళ్లపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ భూమిని ముందస్తుగా స్టీల్‌ప్లాంటుకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా చిత్తూరు జిల్లా యేర్పేడు మండలం పానుగురులో 14ఎకరాల అసైన్డ్‌తో సహా 15 ఎకరాల భూమిని ఏపీఐఐసీ కేటాయించారు.






## బ్రిటన్ ఎన్నికల్లో జాన్సన్ ఘనవిజయం 12

బ్రెగ్జిట్‌కు పచ్చజెండా!

లేబర్ పార్టీకి 'కశ్మీరు' దెబ్బ!

మళ్లీ విపక్షానికే పరిమితం

15 మంది భారతీయుల గెలుపు

## నేడే ట్రంప్‌పై అభిశంసన

ప్రతినిధుల సభలో ఓటింగ్

ఈ సభలో విపక్షానిదే బలం

12









పరంజ్యోతి

## ఆధ్యాత్మికత - లౌకిక జీవనం



ఆధ్యాత్మికత అంటే భగవంతుడికి సంబంధించిన విషయాలని, లౌకిక జీవనం అంటే మనం చేసే ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలని మన అభిప్రాయం. భగవంతుడంటే మనకు జ్ఞాపకం వచ్చేవి దేవాలయాలు, దైవ ప్రతిమలకు జరిగే పూజాపునస్కారాలు, అర్చనలు, అభిషేకాలు, మొక్కులు తీర్చుకోవటం వంటి అంశాలు. ఇళ్లలో జరిగే నిత్య పూజలు, వ్రతాలు, ఉపవాసాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. లౌకిక జీవనమంటే ధనార్జన కొరకు చేసే పనులు, దానికి తోడు బంధుత్వాలు, స్నేహాలు, మమతలు, మమకారాలు వంటి అంశాలతో కూడిన నిత్య జీవన విధానం. ఆధ్యాత్మిక, లౌకిక అంశాలు విభిన్నమైన విషయాలని, జీవన స్రవంతిలో ఆ రెండింటినీ సమన్వయపరచటం కుదరదని, ఒక ఒరలో ఇమడని రెండు కత్తులు వంటివని అనుకుంటాం. కానీ అది సత్యం కాదు. భగవంతుడిని కొన్ని స్థలాలకు, దేవాలయాలకు, పూజగదులకు పరిమితం చేయటం వల్లనే ఈ భావన మనలో బలపడింది. అవి మాత్రమే దేవుని నివాస స్థలాలనే అర్థరహితమైన ఆలోచనా ధోరణి మనలో పేరుకుపోయింది. బాహ్య ప్రపంచంలో ఆలోచించినట్లుగా, ప్రవర్తించినట్లుగా దేవుని సన్నిధిలో చేయటం సాధ్యం కాదని భావిస్తాం. భగవత్ తత్వంపట్ల లోతైన అవగాహన లోపించటమే ఇందుకు కారణం.

అసలైన సత్యమేమంటే దేవుడు కొన్ని స్థలాలకు, కాలాలకు పరిమితంగాడు. దేవాలయాల్లో దేవుడుంటాడు. దైవ సన్నిధిగా మనం వాటిని భావించి విశ్వసించి ఆరాధించవలసిందే. కానీ ఆయన అక్కడికే పరిమితంగాడు. దేవాలయంలో గోత్రనామాలతో అర్చన, అభిషేకాలు చేయించుకొని తిరుగుముఖం పట్టాక, లేక ఇంట్లో పూజ చేసికొని దేవుని గది తలుపులు వేశాక ఆ రోజుకు దేవుని పని పూర్తయ్యిందనే భావన తలెత్తకూడదు. పాలలో వెన్నలా, తిలల్లో తైలంలా, కట్టెలో అగ్నిలా, పానకంలో చక్కెరలా, సముద్రజలంలో ఉప్పులా సకలజగత్తులో, సర్వేసర్వత్రా అణువణువునా, కణకణాన ఆయన ఉన్నాడు. కాల ప్రవాహంలో ప్రతి క్షణం ఆయన అధీనంలోనే ఉంటుంది. స్థలం, కాలం పూర్తిగా భగవంతుని అధీనంలో ఉన్నప్పుడు, శివ ఆజ్ఞ లేనిదే చీమ కూడ కుట్టదని ఒక పక్క వ్యాసిస్తున్నప్పుడు... ఆధ్యాత్మికత, లౌకిక వృత్తులు వేరువేరుగా, విభిన్నంగా ఎలా ఉంటాయి? దేవుడు లేని చోటు, ఆయన చూడని, గమనించని చోటు జగత్తులో లేదు గనుక లౌకికం అంటూ వేరుగా ఉండే ప్రసక్తే లేదు. అంతా ఆధ్యాత్మికమే, అంతా దైవికమే, అంతా సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడైన భగవంతుని ఇచ్ఛానుసారం కొనసాగుతున్న కార్యమే. లౌకికం అనుకుంటూ మనం చేస్తున్న పనులు, ఆలోచనలు, మనం చెప్పే మాటలు ఆయన రూపొందించిన కంప్యూటర్ సిస్టమ్‌లో రికార్డు అవుతూనే ఉంటాయి. ఆయన దృష్టి నుంచి మన జీవన విధానాన్ని తప్పించే అవకాశమే లేదు. సదా జాగ్రత్తగా ఉండవలసిందే. లేకుంటే ఫలితం అనుభవింపక తప్పదు. మన జీవన విధానం భగవంతునకు ఇష్టమైన రీతిలో, సద్భావాలతో సత్ చింతనలో, సత్య నిరతిలో, పరోపకార బుద్ధితో, త్యాగభావంతో కూడుకొని ఉండాలి. అలా ఉంటే మనం ఆధ్యాత్మికం అనుకుంటున్న పూజాపునస్కారాలు, అర్చనలు, అభిషేకాలు చేయకున్నా సర్వాంతర్యామియైన సర్వేశ్వరుని అనుగ్రహానికి పాత్రులమవుతాం. ఆయన ప్రేమకు పాత్రులమవుతాం.

- మాదిరాజు రామచంద్ర రావు, 9393324940

# భరోసా 'దిశ'గా...

## మహిళలు,బాలికలకు కవచం.. క్రూరుల విషయంలో కర్కశం.. ఏపీ దిశ-2019 బిల్లు ఏకగ్రీవం

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులకు రక్షణ, వారిపై అకృత్యాలకు పాల్పడేవారికి మరణదండన విధించేలా రూపొందించిన ఏపీ దిశ-2019 బిల్లుకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు ఈ బిల్లుకు ముక్తకంఠంతో మద్దతు పలికారు. రాష్ట్ర హోం మంత్రి సుచరిత 'దిశ బిల్లు'ను అసెంబ్లీలో ప్రవేశపెట్టగా, సభలో ఉన్న మహిళా సభ్యులందరూ బలపరిచారు. ప్రతిపక్షం తెలుగుదేశం ఈ బిల్లు పట్ల హర్షం వ్యక్తం చేసింది. బిల్లు ఆమోదం పొందిన అనంతరం వైసీపీ మహిళా సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. బిల్లు రూపకల్పనలో ఉన్న ఉత్సాహం, అమల్లో కూడా చూపించాలని ప్రతిపక్షనేత చంద్రబాబు సూచించారు. 'తక్షణ న్యాయం ప్రతీకారానికి దారితీయకూడదు' అన్న సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని, ముఖ్యంగా అత్యాచార ఘటనల విషయంలో సమాజంలో మార్పు తీసుకురావాలనికోరారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడారు.

### కేసీఆర్‌కు మరోసారి..

"దిశ ఘటన తర్వాత తెలంగాణ ప్రభుత్వంపై ప్రజల నుంచి ఒత్తిడి వచ్చింది. సినిమాల్లో అత్యాచారం చేసినవారిని తుపాకీతో కాల్చి చంపితే చప్పట్లు కొడతాం. తెలంగాణలో అదే పనిచేసిన పోలీసులను, సీఎం కేసీఆర్‌ను నేను మరోసారి అభినందిస్తున్నాను. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత ఎన్‌హెచ్ఆర్సీ, సుప్రీంకోర్టు విచారణలు మొదలయ్యాయి. నిందితులు చేసింది తప్పే అయినప్పటికీ వారిని కాల్చడమూ తప్పే అని ఎన్‌హెచ్ఆర్సీ, సుప్రీంకోర్టు వేసిన కమిటీ నిర్ణయిస్తాయి. దీనివల్ల భవిష్యత్‌లో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే.. నిందితులను శిక్షించడానికి ఏ ప్రభుత్వ పెద్దలూ, పోలీసు అధికారులూ ముందుకు రారు. అప్పుడు నేరం చేసిన వాళ్లు మళ్లీ బయటకు వస్తారు. వారికి శిక్షపడదు. బాధితురాలి కుటుంబం మాత్రం రోదిస్తూనే ఉంటుంది. ఈ పరిస్థితిని మార్చాలంటే ఏం చేయాలనే ఆలోచన నుంచే పుట్టింది దిశ బిల్లు" అని సీఎం వివరించారు. 'మనిషి రాక్షసత్వానికి పాల్పడితే త్వరగా న్యాయం కావాలని కోరుకుంటాం. నిర్భయ చట్టం వచ్చి ఏడేళ్లయినా హత్యాచార నిందితులకు ఉరి శిక్ష పడలేదు. చట్టాల్లో మార్పు వస్తేనే ప్రభుత్వాలను ప్రజలు నమ్ముతారు" అని పేర్కొన్నారు. దిశ చట్టం కింద 13 జిల్లాల్లో 13 ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేస్తామని, మహిళలు, చిన్నారుల మీద దాడులు, సోషల్ మీడియాలో వేధింపులు, అత్యాచారాలు జరిగితే ఈ కోర్టుల్లో తక్షణం శిక్ష అమలు చేస్తారన్నారు. సోషల్ మీడియా కారణంగా కూడా ఆడవాళ్లకు భద్రత లేకుండా పోయిందని, దానికీ ఇప్పుడు చట్టం తెస్తున్నామని తెలిపారు.

### పీపీలుగా మహిళలు

ప్రతి జిల్లాలో ఏర్పాటుచేసే ప్రత్యేక కోర్టులకు న్యాయమూర్తులను ఉన్నత న్యాయస్థాన అంగీకారంతో నియమిస్తారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరుగా మహిళా న్యాయ నిపుణులను కోర్టులో నియమించవచ్చు. వీరికి న్యాయవాదిగా ఏడేళ్ల అనుభవం ఉండాలి. మహిళలు , బాలల అపరాధుల రిజిస్టరును పోలీసులు నిర్వహించాలి.

### వైసీపీ ప్రజాప్రతినిధులపై రేప్ కేసులు: చంద్రబాబు

చంద్రబాబు మాట్లాడుతూ, వైసీపీకి చెందిన ఏడుగురు ప్రజాప్రతినిధులపై రేప్ కేసులున్నాయని చెప్పారు. దీనిపై టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకొస్తే బాధితులకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో మాట్లాడానని చంద్రబాబు తెలిపారు. టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, దేవినేని ఉమా మహేశ్వరరావుపై మహిళా వేధింపుల కేసులున్నాయని గతంలో ఏడీఆర్ నివేదిక ఇచ్చిందని, వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని డిప్యూటీ ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి.. చంద్రబాబును ప్రశ్నించారు. అచ్చెన్నాయుడు కౌంటర్ ఇచ్చారు. "నాపై ఎలాంటి కేసులున్నా చర్యలు తీసుకోవచ్చు. పుష్పశ్రీవాణి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆమె అసలు ఎస్టీనే కానప్పటికీ ఆ సర్టిఫికేట్‌తోనే ఎన్నికల్లో పోటీ చేశారు' అని అన్నారు. మంత్రి కొడాలి నాని కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని వ్యాఖ్యానించారు. స్పందించిన కొడాలి నాని.. అచ్చెన్నను వెటర్నరీ ఆస్పత్రిలో చేర్పిస్తే బాగుంటుందని, అమరావతిలో చంద్రబాబు పేరిట మానసిక వైకల్య కేంద్రం ఏర్పాటు చేసి ముందు ఆయనను, ఆ తర్వాత టీడీపీ ఎమ్మెల్యేలందరినీ చేర్చాలంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో అచ్చెన్నాయుడు ఒక మహిళా అధికారిని వేధించారని పలాస ఎమ్మెల్యే అప్పలరాజు ఆరోపించారు. దీనిపై అచ్చెన్న ఆగ్రహించారు. అప్పలరాజు ముందువెనుక చూసుకోకుండా, ఏమీ తెలియకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తనకు ముందూవెనుక జగన్ ఉన్నారని, ఏం తెలుసుకొని సభకు రావాలో చెప్పాలని అప్పలరాజు ఎద్దేవా చేశారు. అచ్చెన్న లాంటి శరీరం, ఆస్తిపాస్తులు తనకు లేకపోయినా.. బ్రెయిన్ సైజ్ మాత్రం సమానంగా ఉందని చెప్పుకొచ్చారు.

"దిశ బిల్లు రూపకల్పనలో ఉన్న ఉత్సాహం, అమల్లో కూడా చూపించాలి. 'తక్షణ న్యాయ భావన ప్రతీకారానికి దారితీయకూడదు' అన్న సుప్రీంకోర్టు చీఫ్‌జస్టిస్ వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలి. ముఖ్యంగా అత్యాచార ఘటనల విషయంలో సమాజంలో మార్పు తీసుకురావాలి. వైసీపీకి చెందిన ఏడుగురు ప్రజాప్రతినిధులపై రేప్ కేసులున్నాయి. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకొస్తే బాధితులకు న్యాయం జరుగుతుందనే నేను ఈ కేసుల ప్రస్తావన తెస్తున్నాను"

- ప్రతిపక్ష నేత చంద్రబాబు

### దిశా..నిర్దేశాలు..

- అత్యాచారానికి పాల్పడ్డ వారికి తప్పనిసరిగా ఉరి
- ఏడు రోజుల్లో దర్యాప్తు, 14రోజుల్లో విచారణ పూర్తిచేసి 3 వారాల్లో న్యాయం చేయాలి.
- చిన్నపిల్లలపై పాల్పడే లైంగిక నేరాలకు జీవిత ఖైదు తప్పదు, తీవ్రతను బట్టి మరణ శిక్ష కూడా.
- సోషల్ మీడియాలో మహిళలను వేధించినా, అసభ్య పోస్టింగులు పెట్టినా, మొదటిసారి రెండేళ్లు.. రెండోసారి చేస్తే నాలుగేళ్లు శిక్ష.
- అత్యాచారం, యాసిడ్ దాడి, పోక్సో, సోషల్ మీడియా ద్వారా వేధింపులు సంబంధిత కేసుల విచారణకు ప్రతి జిల్లాకు శాశ్వత ప్రత్యేక కోర్టు.
- ఇటువంటి నేరాల్లో శిక్షలు పడ్డవారి అప్పీలు గడువు ఆరు నుంచి మూడు నెలలకు కుదింపు.
- మహిళలు, చిన్నారులపై నేరాల్లో సత్వర దర్యాప్తునకు జిల్లా స్థాయిలో డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఉన్నతాధికారి ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కోర్టు నియమిస్తుంది.
- నిందితుల వివరాలను డిజిటలైజేషన్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచి, ఎవరు ఎటువంటి నేరాలు చేసిందీ బహిరంగపరుస్తారు.



### వార్డు సచివాలయాలుగా అన్నక్యాంటీన్లు

ఎమ్మిగనూరు, డిసెంబరు,13. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో అన్న క్యాంటీన్లు వార్డు సచివాలయాలుగా మారాయి. ఏడాది పాటు పేదల ఆకలి తీర్చిన క్యాంటీన్లు వైసీపీ రాగానే మూతపడ్డాయి, అప్పటినుంచి ఖాళీగా ఉన్న అన్నక్యాంటీన్ల భవనాలను ప్రభుత్వం వార్డు సచివాలయాలుగా మార్చేసింది. ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో వున్న అన్నక్యాంటీన్ భవనంలో వార్డు సచివాలయం- 14ను, శ్రీనివాస సర్కిల్‌లో ఉన్న అన్నక్యాంటీన్ భవనంలో వార్డు సచివాలయం- 26ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. బోర్డులు కూడా అమర్చారు.

## ఐదేళ్ల పాపపై అత్యాచారం



గుంటూరు జీజీహెచ్ వద్ద టీడీపీ, బీజేపీ మహిళా నేతల నిరసన

### 'దిశ బిల్లు'ను ఆమోదించిన రోజే గుంటూరులో వెలుగులోకి దారుణం

- కామాంధుడు 19 ఏళ్ల లక్ష్మారెడ్డి
- అతడిని ఎన్‌కౌంటర్ చేస్తారా.. రెడ్డి అని వదిలిపెట్టేస్తారా..?
- సర్కార్‌కు మహిళాసంఘాల ప్రశ్న

గుంటూరు, డిసెంబరు 13: ఐదేళ్ల వయసున్న అభంశుభం తెలియని పాపపై తాడిపత్రి లక్ష్మారెడ్డి అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటువంటి ఉన్మాదులను కఠినంగా శిక్షించేందుకు తెచ్చిన దిశ బిల్లును అసెంబ్లీ ముక్తకంఠంతో ఆమోదించిన రోజే గుంటూరు సిటీలో ఈ ఘటన వెలుగు చూసింది. ఈ ఉదంతంపై మహిళా సంఘాలు తీవ్రస్థాయిలో స్పందించాయి. బాధితురాలు చికిత్స పొందుతున్న జీజీహెచ్ ఆస్పత్రి వద్దకు పెద్దఎత్తున చేరుకొని.. నిరసన తెలిపాయి. 'నిందితుడిని ఎన్‌కౌంటర్ చేస్తారా.. లేక రెడ్డి సామాజికవర్గంవాడని చెప్పి వదిలిపెడతారా" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశాయి. వారితో టీడీపీ, బీజేపీ మహిళా నేతలు కూడా గొంతు కలిపారు. దీంతో జీజీహెచ్ ప్రాంతంలో కొద్దిగంటలపాటు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. నగరంపాలెం పోలీ‌స్‌స్టేషన్ పరిధిలో తల్లి, అమ్మమ్మలతో బాధిత బాలిక కలిసి ఉంటోంది. భర్తకు దూరంగా నర్సుగా పనిచేస్తూ ఆమె తల్లి కుటుంబాన్ని పోషిస్తోంది. వారికి ఇద్దరు పిల్లలు కాగా, బాలిక తల్లి వద్ద, కుమారుడు తండ్రి వద్ద పెరుగుతున్నారు. ఇంటికి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలిక యూకేజీ చదువుతోంది. వారి ఇంటి కింద పోర్షన్‌లో లక్ష్మారెడ్డి (19) ఇంటర్ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజనం చేసి రెండు గంటల సమయంలో తల్లి డ్యూటీకి వెళ్లింది. అమ్మమ్మ గంట తర్వాత రైతు బజారుకు వెళ్లింది. కొద్దిసేపటికి బడి నుంచి బాలిక ఇంటికి వచ్చింది. ఆమె ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని లక్ష్మారెడ్డి అవకాశంగా తీసుకొన్నాడు. బాలికను గట్టిగా పట్టుకొని తన గదిలోకి తీసుకెళ్లాడు. అత్యాచారం చేశాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. రాత్రి డ్యూటీ నుంచి ఇంటి కొచ్చిన తల్లితో తన పొత్తికడుపుతో నొప్పిగా ఉన్నదని చెప్పి బాలిక ఏడ్చింది. ఏం జరిగిందని అడిగిన తల్లికి, జరిగిన విషయమంతా చెప్పింది. ఆ వెంటనే కుమార్తెను వెంటపెట్టుకొని వెళ్లి నగరంపాలెం పోలీ‌స్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. ఐపీసీ 376, పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్టు సమాచారం. మరునాడు ఉదయం విషయం బయటకు రావడంతో మహిళా సంఘాలు ఆస్పత్రి వద్దే ఆందోళన చేపట్టాయి. బాలికను పరామర్శించి, తల్లిని వివరాలు అడిగి తెలుసుకున్నాయి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా రోజుల వ్యవధిలోనే నిందితుడికి కఠినశిక్ష పడేలా చూడాలని గుంటూరు నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు పానకాల వెంకట మహాలక్ష్మి, బీజేపీ మహిళా నేత బొల్లా ప్రగడ శ్రీదేవి, దళిత బీజేపీ నేత దర్శనపు శ్రీనివాస్ పరామర్శించారు. కాగా, నిందితుడు లక్ష్మారెడ్డి ఇంటర్మీడియేట్ చదువుతున్నప్పటికీ పదో తరగతి సర్టిఫికెట్ల ప్రకారం అతని వయసు 19 ఏళ్లుగా పోలీసులు నిర్ధారించారు.

## నేడు 'ఆయేషా'కు మళ్లీ శవపరీక్ష

- సీబీఐ అప్పీలుకు కోర్టు ఆమోదం



తెనాలిలో ఈద్గాలో ఉన్న ఆయేషా సమాధి

తెనాలి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలుగునాట సంచలనం కలిగించిన బీ.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్యకేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఆమె మృతదేహానికి రీ పోస్టుమార్టం చేసేందుకు సీబీఐకి కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే ఈ కార్యక్రమం ప్రొసీజర్ ప్రకారం, కుటుంబసభ్యుల సమక్షంలోనే నిర్వహించాలంటూ షరతులు విధించింది. దీంతో ఈనెల 14న తెనాలిలోని చెంచుపేట శ్మశానవాటికలో ఆయేషా మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు సీబీఐ బృందం సన్నద్ధమవుతోంది. విజయవాడలో 12ఏళ్ల క్రితం అత్యంత దారుణంగా హత్యాచారానికి గురైన ఆయేషా మీరా హత్యకేసులో విచారణ జరిపిన పోలీసులు అప్పట్లో మహిళా కోర్టుకు అందించిన ఆధారాల్లో చూపిన డీఎన్ఏ నిజంగా ఆమెదేనా అనే సందేహం రావటంతో కేసును మొదటినుంచి తవ్వి తీసేందుకు సీబీఐ అధికారులు రీపోస్టుమార్టం కోసం కోర్టును ఆశ్రయించారు. విజయవాడలోని 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఈనెల 7న అంగీకారం తెలిపింది. దీనిపై ఇప్పటి వరకూ గోప్యత పాటించిన సీబీఐ తాజాగా ఈ కేసు వాదిస్తున్న న్యాయవాది శ్రీనివాస్‌ను, ఇతర శాఖల అధికారులను సంప్రదించడంతో విషయం బయటకు వచ్చింది. సీబీఐ అధికారులు ఎవరూ తమను సంప్రదించలేదని, కోర్టు అనుమతి వచ్చిన విషయం కూడా తమ న్యాయవాది ద్వారా తెలుసుకున్నామని ఆయేషా తల్లి శంషాద్‌బేగం పేర్కొన్నారు. తమ మతాచారాలకు విరుద్ధమైనా, కేసు విచారణ ముందుకు సాగి, దోషులకు శిక్ష పడాలనే ఆలోచనతో దీనికి అంగీకరిస్తున్నట్టు చెప్పారు.

## సమత కేసులో 16న చార్జిషీట్

ఆదిలాబాద్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లాలో గత నెలలో దారుణ హత్యాచారానికి గురైన సమత కేసుకు సంబంధించిన చార్జిషీట్‌ను పోలీసులు ఈ నెల 16న ఆదిలాబాద్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో దాఖలు చేయనున్నారు. శుక్రవారమే ఈ పని చేయాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో సోమవారానికి వాయిదా పడినట్లు సమాచారం. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో సోమవారం చార్జిషీట్‌ను అందజేయనున్నారు. కాగా.. నిందితులుగా గుర్తించిన షేక్ బాబు(30), షేక్ షాబొద్దీన్ (40), షేక్ ముక్దుం (30)ల డీఎన్ఏ రిపోర్టు పోలీసుల చేతికి వచ్చింది. విచారణలో ఇది అత్యంత కీలకం కానుంది. నిందితులకు న్యాయ సహాయం చేయకూడదని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ శుక్రవారం నిర్ణయం తీసుకుంది.

## పౌరసత్వ బిల్లుపై ఆగ్రహజ్వాల

- జిల్లాల్లో శాంతి ర్యాలీలు, ధర్నాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పౌరసత్వ చట్ట సవరణ బిల్లు(క్యాబ్)పై ఆగ్రహం పెల్లుబికింది. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, దీన్ని వెంటనే రద్దు చేయాలని పలు ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం కాబ్‌ను ఉపసంహరించుకునే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించాయి. విజయవాడలో పంజాసెంటర్, ఆటోనగర్, ధర్నాచౌక్ వద్ద శక్రవారం నిరసనలు చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఈ బిల్లు దేశ భద్రతకు కూడా పెనుముప్పుగా పరిణమించనుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, జమాతే ఇస్లాం హింద్, జమైయత్ ఉలేమా ఏ హింద్, అవాజ్, ఆలిండియా మిల్లీ కౌన్సిల్, అమన్ తదితర ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా నరసరావుపేటలో మానవహారం నిర్వహించారు. ఎన్‌జీవో కాలనీలోని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇంటిని ముట్టడించారు. ఎన్ఆర్‌సీ క్యాబ్ బిల్లు వ్యతిరేక ఐక్యవేదిక ఆధ్వర్యంలో కడపలో నమాజు తర్వాత వందలాది మంది ముస్లింలు శాంతియుత ర్యాలీగా ఏడురోడ్ల కూడలికి చేరుకొన్నారు. నెల్లూరు నగరంలో జిల్లా ముస్లింల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముస్లింలు భారీర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటరులో కొద్దిసేపు రోడ్డుమీద బైఠాయించి నిరసన తెలిపారు. మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఏలూరులో ధర్నా, రాజమహేంద్రవరం, కాకినాడల్లో శాంతి ర్యాలీలు నిర్వహించారు.



కడప ఏడురోడ్ల కూడలిలో ముస్లింల నిరసన; (ఇన్‌సెట్) ఏలూరులో ఆందోళన చేస్తున్న ముస్లిం మహిళలు

## లోకం తీరు




లోపల విపక్షాలను వణికించాం అనుకుంటే.. బయట మనకు వణుకుపుడుతోంది ఏంటీ !!

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 18.2 | 29.3 |
| హైదరాబాద్ | 18.7 | 30.0 |
| శ్రీకాకుళం | 22.0 | 33.0 |
| కర్నూలు | 19.2 | 32.1 |
| విజయవాడ | 21.4 | 30.6 |
| నెల్లూరు | 31.2 | 30.6 |

### వర్షసూచన

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి కోస్తాపైకి తూర్పుగాలులు వీస్తున్నాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా వుండడంతో పాక్షికంగా మేఘాలు ఆవరించాయి. దీంతో కోస్తా, రాయలసీమల్లో శుక్రవారం అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. వచ్చే రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని, తరువాత క్రమేపీ తగ్గుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా మేఘాలు ఆవరించడంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యాయి. మరో రెండు రోజులు ఇదేమాదిరి వాతావరణం కొనసాగుతుందని, తర్వాత రాత్రిపూట చలి పెరిగే అవకాశం వుందని వాతావరణ శాఖ నిపుణుడు ఒకరు తెలిపారు. ప్రస్తుతం ఉత్తరాది నుంచి పయనిస్తున్న వెస్ట్రన్ డిస్టర్బెన్స్ ప్రభావం తగ్గుతుందని, ఆ తర్వాత చలి పెరుగుతుందని తెలిపారు.



### 500 గుళ్లు నిర్మించినా అది మసీదు ప్రాంతమే

2.77 ఎకరాల వివాదాస్పద భూమిని 'రాముడి'కే అప్పగిస్తూ ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్లను సుప్రీం డిస్మిస్ చేసింది. ఆ నిర్ణయం మమ్మల్ని నిరాశకు గురి చేసింది. అయినప్పటికీ దానిని గౌరవిస్తాం. ఆ స్థలంలో 500 ఆలయాలు నిర్మించినా అది బాబ్రీ మసీదు ఉన్న ప్రాంతమే.

- మౌలానా అర్షద్ మదనీ, జమియత్ ఉలేమా-ఏ-హింద్ అధినేత



### రెస్టారెంట్లలో రేట్లు పెంచక తప్పదు!

ఉల్లిపాయల ధరలు ఇలాగే మండిపోతుంటే హోటళ్లలో ఆహార పదార్థాల రేట్లు పెంచక తప్పదు. ఇప్పుడిప్పుడే ఉల్లి ధర దిగొస్తోంది. ముంబైలో 30 శాతం తగ్గింది. వారం, పది రోజుల వరకు వేచి చూస్తాం. కిలో రూ.60కి దిగిరాకుంటే ఉల్లి ఉన్న ఆహార పదార్థాల రేట్లు పెంచుతాం.

- సంతోష్ శెట్టి, హోటల్‌అసోసియేషన్ అధ్యక్షుడు

### గుండెపోటు చికిత్సకు సరికొత్త ఔషధం

లండన్, డిసెంబరు 13 : బ్రిటన్‌లోని షెఫీల్డ్ వర్సిటీ శాస్త్రవేత్తలు హృద్రోగులకు ఊరట కలిగించే సరికొత్త ఆవిష్కరణ చేశారు. గుండెపోటు వచ్చిన వారి ధమనుల్లో రక్తం గడ్డ కట్టకుండా చేయగల ఔషధాన్ని అభివృద్ధిచేశారు. దానికి 'సెలాటోగ్రెల్' అని పేరుపెట్టారు. ఇది ఇంజక్షన్ ద్వారా హృద్రోగికి అందిస్తారు. శరీరంలోకి ప్రవేశించిన 15 నిమిషాల్లోనే ధమనుల్లో రక్తం గడ్డ కట్టకుండా నిరోధించి, రోగికి ఉపశమనం కలిగించిందని అధ్యయనంలో గుర్తించారు. దాని ప్రభావం దాదాపు 8 గంటలపాటు ఉంటుందని వెల్లడించారు.

### లాలాజల పరీక్షతో నోటి కేన్సర్ గుర్తింపు

న్యూయార్క్, డిసెంబరు 13: లాలాజలాన్ని పరీక్షించడం ద్వారా గొంతు, నోటి కేన్సర్‌ను సులభంగా, ముందుగానే గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కొత్త విధానాన్ని అమెరికాకు చెందిన డ్యూక్ వర్సిటీ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సాధారణంగా గొంతు కేన్సర్ కేసులు అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో గానీ తెలియదు. సాధారణం వైద్య పరీక్షల్లో ఇవి బయటపడవు. శరీర సంక్లిష్ట నిర్మాణమే దీనికి కారణం. కానీ తాజా పరిశోధనలతో కేన్సర్‌ను ముందుగానే పసిగట్టి చికిత్స అందివచ్చని పరిశోధకులు తెలిపారు. మరోవైపు కేన్సర్ కణాలు పెరగడం, వ్యాప్తి చెందకుండా ఇమ్యునోథెరపీ విధానాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

## నిత్యాన్నప్రసాద ట్రస్టుకు రూ.1.91 కోట్ల విరాళాలు

▸▸ ఎన్ఆర్ఐ భక్తుడి రూ.1.05 కోట్ల వితరణ

తిరుమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర నిత్యాన్నప్రసాద ట్రస్టుకు గురు, శుక్రవారాల్లో దాతలు రూ.1.91 కోట్లు విరాళంగా అందచేశారు. అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ అట్లూరి వెంకట్ రూ1,05,06,500లను అందజేశారు. విజయవాడకు చెందిన ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఛైర్మన్ గుమ్మడి వెంకటేశ్వరరావు రూ.10 లక్షలను అందించారు. గురువారం రాత్రి చండీగఢ్‌కు చెందిన నెక్టార్ లైఫ్ సైన్సెస్ కంపెనీ సీఎండీ సంజయ్‌గోయల్ రూ.51 లక్షలు వితరణ చేయగా, డోనార్‌సెల్‌లో పలువురు దాతలు మొత్తం రూ.25.5 లక్షలు అన్నదాన నిధికి అందచేశారు.

### మేల్‌చాట్ వస్త్రాల బహూకరణకు అజ్ఞాత భక్తుడి అంగీకారం

శ్రీ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు ప్రతి శుక్రవారం అలంకరించే మేల్‌చాట్ వస్త్రాలను పెద్దసంఖ్యలో బహూకరించడానికి ఓ అజ్ఞాత భక్తుడు ముందుకొచ్చినట్లు అదనపు ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. మూడు సంవత్సరాలకు దాదాపు 180 మేల్‌చాట్ వస్త్రాలు అవసరమవుతాయని, ఒక్కొక్కటి దాదాపు రూ.67,000 విలువ చేస్తుందని చెప్పారు. ఇందుకయ్యే మొత్తం రూ.1,20,60,000 చెల్లించడానికి సదరు అజ్ఞాత భక్తుడు అంగీకరించినట్టు తెలిపారు.

## 21, 22 తేదీల్లో వీవా-వీవీఐటీ 2019



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీవీఐటీ ఛైర్మన్ విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 13: గుంటూరు సమీపంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి యువజనోత్సవం వీవా-వీవీఐటీ డిసెంబర్ 21, 22 తేదీలలో నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. వీవీఐటీ కార్యాలయంలో వీవా-వీవీఐటీ 2019కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరుగనున్న ఈ యువజనోత్సవాలలో క్రీడా, సాంస్కృతిక, సాంకేతిక విభాగాల్లో 47 వేదికలపై 93 అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీవీఐటీ నిర్వహించే ఈ యువజనోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఈ సంవత్సరం నిర్వహించే వేడుకలకు 'బ్రింగింగ్ బ్యాక్ చైల్డ్ హుడ్' ప్రధానాంశంగా కార్యక్రమాలు రూపొందించనున్నామని చెప్పారు. వీవీఐటీలో కార్యక్రమాలన్ని విద్యార్థులే నిర్వహిస్తారని ఈ కార్యక్రమం కూడా విద్యార్థుల ఆధ్వర్యంలోనే జరుగనుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వీవీఐటీ డాట్.కామ్‌లో డిసెంబరు 19 తేదీ వరకు ఉచితంగా నమోదు చేసుకొనవచ్చని తెలిపారు.

## శ్రీవారి ఆలయం ముంగిట ఆత్మహత్య

▸▸ లారీ కిందపడి భక్తుడి బలవన్మరణం

▸▸ సంప్రోక్షణానంతరం స్వామికి కైంకర్యాలు





1. లారీ కింద పడేందుకు వెళ్తున్న భక్తుడు (సీసీ కెమెరా ఫుటేజీ చిత్రం), 2. ప్రమాద స్థలం వద్ద శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, డిసెంబరు 13: కష్టమో.. మూఢనమ్మకమో.. తిరుమల పుణ్యక్షేత్రానికి చేరుకుని తలనీలాలు సమర్పించిన ఓ భక్తుడు సరిగ్గా ఆలయం ముందు నమస్కరిస్తూ అప్పుడే బయలుదేరిన లారీ కిందపడి తుదిశ్వాస విడిచాడు. శ్రీవారి శుక్రవారపు అభిషేకసేవ కోసం గోశాల నుంచి పాలు తీసుకువచ్చిన లారీ ఉదయం 5.30 గంటలకు వెనుదిరిగింది. ఆ సమయంలో సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి.. లారీ సమీపానికి రాగానే.. వెనుకచక్రాల కింద పడ్డాడు. లారీ అతని శరీరం మీదుగా పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తొలుత ఇది ప్రమాదంగా భావించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి భక్తుడే ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి ఆ మేరకు కేసు నమోదు చేశారు.

### తిరుమలలో ఆత్మహత్యలు మహాపాపం: రమణ దీక్షితులు

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు తిరుమల పవిత్రతను కాపాడాలని టీటీడీ ఆగమ సలహామండలి సభ్యుడు రమణదీక్షితులు కోరారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో దేహత్యాగం చేస్తే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందనే మూఢనమ్మకంతో ఎవ్వరూ ఇలాంటి నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. ప్రమాదవశాత్తూ మృతి చెందితే శ్రీవారి అనుగ్రహంతో వైకుంఠం ప్రాప్తి లభిస్తుందని, ఆత్మహత్యలు చేసుకుంటే మహాపాపమని పేర్కొన్నారు. మాడవీధుల్లో భక్తుడి బలవన్మరణం జరిగిన నేపథ్యంలో.. ఆలయంలో వైఖానస ఆగమబద్ధంగా పుణ్యాహవచనం, సంప్రోక్షణ, శుద్ధి నిర్వహించినట్లు తెలిపారు. తర్వాత యాథావిధిగా కైంకర్యాలు, ఆరాధన నిర్వహించామన్నారు.

▸▸ స్వామి సన్నిధిలో ఇలాంటివి మంచిది కాదు

ఆలయం ముందు భక్తుడు పాల లారీ కింద పడి మృతిచెందడం బాధాకరం. స్వామి సన్నిధిలో ప్రాణాలు వదలాలనే మూఢనమ్మకం సరికాదు. ఇది చాలా పవిత్రమైన ప్రదేశం. ఇక్కడ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడం మంచిది కాదు.

-వైవీ సుబ్బారెడ్డి, ఛైర్మన్ టీటీడీ బోర్డు

## మహిళలపై చెయ్యేస్తే తాటతీయాలి!

ఈ మేరకు ప్రభుత్వం టీవీల్లో ప్రకటన ఇవ్వాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 13: మహిళలపై చెయ్యివేస్తే తాట తీస్తామని ప్రభుత్వమే టీవీల్లో ప్రకటనలు ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. 'మద్యం మత్తులో మహిళలు, చిన్నారులపై మృగాళ్లు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం సంపూర్ణ మద్య నిషేధం ఎందుకు అమలు చేయదు. దీని కోసం మహిళా లోకం సమాయత్తం కావాలి' అని ఆమె పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మహిళల భద్రత-సవాళ్లు-పరిష్కార మార్గాలు' అంశంపై శుక్రవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన ప్రభావతి మీడియాతో మాట్లాడారు. నిందితులను ఎన్‌కౌంటర్లు చేసినంత మాత్రాన మహిళలపై హింస ఆగదన్నారు. జగన్ ప్రభుత్వం మహిళల కోసం కొత్త చట్టం తీసుకురావడం సంతోషమేనని, అయితే చట్టాన్ని అమలు చేయడానికి అవసరమైన వ్యవస్థ, పూర్తిస్థాయి యంత్రాంగం లేకపోతే ఒరిగేదేమీ ఉండదని స్పష్టంచేశారు. నిర్భయ చట్టం దీనికంటే గొప్పదే కానీ, హింస ఆగలేదనే సంగతి గుర్తించాలని ప్రభావతి పేర్కొన్నారు.


ట్రాన్స్‌మిషన్ కార్పోరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
దిగువ తెలిపిన పనుల నిమిత్తం APTRANSCO ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానిస్తున్నది. స్పెసిఫికేషన్ నెం. APT-e-24/2019, పని పేరు: విశాఖపట్నం జిల్లాలో రెండు చివర్ల వద్ద బేస్ మరియు ప్రస్తుతం ఉన్న 132 KV సేవల్ వార్స్ – HSL టవర్స్ మరియు 132 KV UG కేబుల్ - 0.6 కి.మీ.లపై 132 KV సేవల్ వార్స్ నుండి 132/33 KV మల్కాపురం ఎస్ఎస్ కనెక్టివిటీ కొరకు 132 KV DC/SC లైన్ (2.6 కి.మీ.) సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నందు టెండర్లు లభించు తేది మరియు సమయం: 12.12.2019 న 17.00 గంటల నుండి., గమనిక: i) బిడ్డర్లు కోరుతున్న అధికారి పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కన్‌స్ట్రక్షన్. ii) కాంట్రాక్టర్లు / సంస్థలు సమాచారాన్ని ప్రధానంగా PDF ఫార్మెట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయవలెను. iii) తదుపరి వివరాలను వెబ్‌సైట్: www.apeprocurement.gov.in నందు చూడవచ్చును. ఫోన్ / ఫ్యాక్స్ నెం. 0866-2429231.
R.O.No. 40/19 సం/- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కన్‌స్ట్రక్షన్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నోటీసు నం. టి.ఓ/3టు4/2019-20, తేది. 11.12.2019
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 2 రహదారుల నిర్మాణము కొరకు అంచనా విలువ: రూ.185.00 లక్షలతో పనులు చేపట్టుట కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-ప్లాట్ ఫారంలో టెండరు డాక్యుమెంట్ లభ్యత: 16.12.2019 మ.3.00 గం.ల నుండి 30.12.2019 మ.3.00 గం.ల వరకు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 30.12.2019న సా. 3.30 గం.ల వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 30.12.2019న సా. 4.00 గం.లకు. ఆర్థిక బిడ్ తెరుచు తేది: 03.01.2020న సా. 5.00 గం.లకు. వివరాలను ఈ కార్యాలయం నుంచి పొందవచ్చును. ఫోన్: 0861-2331710.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీరాజ్ సర్కిల్, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.
DIPR RO No.1305/CL/ADVT/1/1/2019-20, తేది:13.12.2019


## నకిలీ ఐఆర్ఎస్ మోసానికి 'బ్రేక్'

▸▸ తిరుమలలో వెలుగుచూసిన మరో అక్రమం

▸▸ పోలీసుల అదుపులో నిందితుడు

తిరుమల, డిసెంబరు 13: ఎన్ని చర్యలు తీసుకుంటున్నా తిరుమలలో రోజురోజుకూ కొత్తరకం మోసాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. శ్రీవారి వీఐపీ బ్రేక్ టికెట్లు పొందేందుకు అక్రమార్కులు మార్గాలు అన్వేషిస్తూనే ఉన్నారు. తాజాగా ఓ వ్యక్తి తాను ఐఆర్ఎస్ అధికారినంటూ నకిలీ గుర్తింపుకార్డుతో వీఐపీ బ్రేక్ టికెట్లు పొంది దర్శనానికి వెళుతూ పట్టుబడ్డాడు. ఈ వివరాలను తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి మీడియాకు వివరించారు. గుంటూరుకు చెందిన కె.వెంకటరత్నారెడ్డి గురువారం తొమ్మిదిమందితో కలిసి తిరుమలకు వచ్చాడు. జేఈవో కార్యాలయంలో ఏడుగురికి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌కు పేర్లు నమోదు చేసుకున్నాడు. మహారాష్ట్రలో అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇంటెలిజెన్స్‌గా పనిచేస్తున్నట్టున్న అతని ఐడీ కార్డు చూసిన జేఈవో కార్యాలయ సిబ్బందికి అనుమానం కలిగింది. అయితే టిక్కెట్లు జారీచేసి.. రత్నారెడ్డి నిజంగానే అధికారేనా అని వాకబు చేశారు. ఆ పేరుతో అధికారి ఎవరూలేరని నిర్ధారించుకుని విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం దర్శనం కోసం వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు వచ్చిన రత్నారెడ్డిని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. విచారణ సందర్భంగా రత్నారెడ్డి ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ నకిలీ గుర్తింపు కార్డులతో గతంలో పలు అక్రమాలకు పాల్పడినట్టు తేలింది. దందాలు, వ్యభిచారం, నకిలీ పాస్‌పోర్టుల తయారీ, చీటింగ్ తదితర ఎనిమిది కేసులు రత్నారెడ్డిపై ఉన్నట్టు సీఐ తెలిపారు. ఏడాదిన్నర క్రితం నకిలీ గుర్తింపు కార్డుతో స్నేహితుడితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నట్టు తమ విచారణలో తెలిసిందన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

## 5లక్షలివ్వాలంటూ కానిస్టేబుల్ బెదిరింపులు

▸▸ ఆటోడ్రైవర్లతో కలిసి రక్షకభటుడి నిర్వాకం

▸▸ బాధితుడి ఫిర్యాదు.. పోలీసుల అదుపులో నిందితులు

మంగళగిరి క్రైమ్, డిసెంబరు 13: పౌరులకు రక్షణ కల్పించాల్సిన రక్షకభటుడే బెదిరింపులకు పాల్పడ్డాడు. రూ.5 లక్షలు ఇవ్వాలంటూ ఓ వ్యాపారి కుమారుడిని ఆటోడ్రైవర్లతో కలిసి కానిస్టేబుల్ బెదిరించిన వ్యవహారం మంగళగిరిలో సంచలనం సృష్టించింది. ప్రస్తుతం గుంటూరు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోన్న గోవింద్.. గతంలో మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేశాడు. పట్టణంలోని పార్కురోడ్డులో సాధు సోడా సెంటర్ నిర్వాహకుడు మునాఫ్ ఇంటిపక్కనే ఉంటూ వారి కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో మునాఫ్ కుమారుడు బాషాను రూ.5లక్షలు ఇవ్వాలని కొన్ని రోజులుగా బెదిరిస్తున్నాడు. ఈ మేరకు ఇద్దరు ఆటోడ్రైవర్ల సెల్‌ఫోన్ల నుంచి బాషాకు బెదిరింపు మెసేజ్‌లు పంపేవాడు. అయినా పట్టించుకోవకపోవడంతో రూ.5 లక్షలు ఇవ్వకపోతే యాసిడ్ పోస్తామని, కుటుంబసభ్యులను చంపుతామంటూ బాషాకు మరో మెసేజ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన బాషా.. మునాఫ్‌కు జరిగిన విషయాన్ని తెలియజేయగా ఆయన పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు బాషా సెల్‌ఫోన్ నుంచి రూ.5 లక్షలు ఇవ్వలేనని, రూ.3 లక్షలు ఇస్తానని వాట్సాప్‌లో మెసేజ్ చేయించారు. నిజమేనని నమ్మిన నిందితులు నిడమర్రు రైల్వేగేటు వద్ద ఓ దుకాణంలో నగదు బ్యాగుపెట్టి వెళ్లిపోవాలని బాషాకు గురువారం రాత్రి మెసేజ్ ద్వారా సూచించారు. వారు చెప్పినట్టే బాషా నగదు బ్యాగును దుకాణం వద్ద వదిలివెళ్లాడు. నగదు బ్యాగును తీసుకునేందుకు నిందితులు అక్కడికి రాగానే పోలీసులు గోవింద్‌తో పాటు ఇద్దరు ఆటోడ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ శేషగిరిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)
'e' PROCUREMENT NOTICE
No. Rc. E11-141396/2019 Dt. 12-12-2019

| Sl. No. | Name of Work | Estimate Amount (Rs. In Lakhs) |
| --- | --- | --- |
| 1 | Laying CC Road to Adusumilli Gopalakrishnaiah Street, Construction of Karmal Bhavan on Ryves Canal Bund (2 Works under MP Lads), Raising of Manholes, Repairs Submersible Pumpsets, GI Roof shed, Shed in karmal Bhavan, Dewatering Sump in Bhanu Nagar, Air Valves, Stair-case Construction, MS Grill Gate, Raising the culvert, Compound wall to Christian Burial Ground, PVC Link Mesh (11 Works in VMC General Funds) (Total : 13 Works) | 87.70 |

NOTE : Only online Payment towards EMD will be allowed, DDs/POs/BCs/BGs will not be allowed
Contact for details of works at Office of the Executive Engineer-II, Satyanarayanapuram, Vijayawada, Mobile No. 98665 14179
Further details can be seen @ 'e' procurement market place @ www.apeprocurement.gov.in
Download of bid documents starts : 16-12-2019 @ 10.30 AM
Last date / time for receipt of tenders : 23-12-2019 @ 5.00 PM
Sd/- A.S.N. PRASAD, For Commissioner


## వివేకా హత్య కేసు సీబీఐకి అప్పగించండి

▸▸ హైకోర్టులో బీటెక్ రవి పిటిషన్

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని అభ్యర్థిస్తూ టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి హైకోర్టును ఆశ్రయించారు. వివేకా హత్య కేసులో సిట్ చేపట్టిన దర్యాప్తు చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోర్టును కోరారు. వివేకా హత్య కేసును సీబీఐకి, లేదా రాష్ట్ర హోంశాఖ, డీజీపీతో సంబంధం లేని స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని అన్నా రు. అలాగే వివేకా హత్య కేసు విచారణకు సంబంధించి తనకు సమన్లు జారీ చేయకుండా, లేదా తనను విచారణకు పిలకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేశారు.


సూక్ష్మ, చిన్న & మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ
భారత ప్రభుత్వం

PMEGPతో
మీ కలల పరిశ్రమను నిర్మించండి



PMEGP
ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం
దేశవ్యాప్తంగా ఉత్సాహవంతమైన యువతకు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో **స్వయం ఉపాధి అవకాశాలు** పెంపొందించడం మరియు ప్రజల మధ్య పారిశ్రామికీకరణను వృద్ధి చేయడానికి భారత ప్రభుత్వ ప్రధాన పథకం

అర్హత
- 18 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు
- స్వయం సహాయక గ్రూపులు (SHP)
- రూ.10 లక్షలు (తయారీ సెక్టార్) & రూ.5 లక్షలు (సర్వీస్ సెక్టార్) కన్నా ఎక్కువగల ప్రాజెక్టులకు కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

ప్రయోజనాలు
నూతన సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించబడును.
- కనీస ప్రాజెక్ట్ వ్యయం తయారీ రంగం రూ.25 లక్షలు సర్వీసులు రూ.10 లక్షలు
- సబ్సిడి – ప్రాజెక్ట్ వ్యయంలో 15% నుండి 35%
- లబ్ధిదారు వాటా – ప్రాజెక్ట్ వ్యయంలో 5% నుండి 10%

మీరు పరిశ్రమ ఏర్పాటు కోసం చూస్తున్నట్లయితే http://www.kviconline.gov.in/pmegpeportar/pmegphone/index.jsp వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి లేదా QR కోడ్ ను స్కాన్ చేయండి

నూతన ప్రోత్సాహకాలు
- విస్తరణ/స్థాయి పెంపుదలకు PMEGP & MUDRA క్రింద మంచి పనితీరు కనబరచిన యూనిట్లకు "రెండవ లోన్" ఆర్థిక సహాయం
- 15-20% సబ్సిడీతో సర్వీసులకు రూ.25 లక్షలు & తయారీ రంగానికి రూ.1 కోటి

పథకం మరిన్ని వివరాలకు **www.msme.gov.in**లో లభించే పథక మార్గదర్శకాలను చూడగలరు.

MSME మంత్రిత్వ శాఖను అనుసరించండి
@minmsme

davp 25101/13/0012/1920

# ఎదురులేని బోరిస్!

ఈమారు బ్రిటీషర్లు ఊగిసలాడలేదు. చెప్పదల్చుకున్నది విస్పష్టంగా, గట్టిగా చెప్పారు. అనేక ఏళ్లుగా బ్రిటన్‌ను పట్టిపీడిస్తున్న సమస్యను ఒకే దెబ్బతో పరిష్కరించేశారు. బ్రిటన్ ఎన్నికల్లో బోరిస్ జాన్సన్‌కు కొన్ని సీట్లు ఎక్కువ రావచ్చుననుకున్నారు కానీ, ఆయన ఇలా రికార్డులు బద్దలు కొట్టేస్తారనీ, అప్పుడెప్పుడో మార్గరెట్ థాచర్‌కు కట్టబెట్టిన స్థాయిలో ప్రజలు ఇంతటి ఘన విజయాన్ని అందిస్తారని ఎవరూ అనుకోలేదు. ఈయూనుంచి బ్రిటన్ వేరుపడే 'బ్రెగ్జిట్' విషయంలో పాలకుల విన్యాసాలతో ప్రజలు ఎంతగా విసిగివేసారి ఉన్నారో ఈ ఫలితాలు చెబుతున్నాయి. క్రిస్మస్ నాటికల్లా బ్రెగ్జిట్ కథ ముగిద్దాం, కొత్త ఏడాదిలో కొత్త జీవితాన్ని ఆరంభిద్దామన్న బోరిస్ మాటకు జనం జేకొట్టారు. ఆయనకిప్పుడు అవసరమైనదానికన్నా దాదాపు ఎనభైస్థానాలు ఎక్కువున్నాయి.

బ్రెగ్జిట్ విషయంలో ఇప్పుడు ప్రజాభిప్రాయం మారిపోయిందనీ, అత్యధికశాతం దానిని వద్దనుకుంటున్నారన్న వాదన ఈ తీర్పుతో వీగిపోయింది. బోరిస్‌కు ఓటంటే బ్రెగ్జిట్‌కు సై కనుక, ప్రజలు విస్పష్టమైన సమాధానంతో బోరిస్ ప్రణాళికను ఆమోదించారని అర్థం. లేబర్ పార్టీ వరుస నాలుగు ఎన్నికల్లో మాదిరిగానే ఈమారూ ఓటమిపాలైనప్పటికీ, ఇంతగా ఎన్నడూ చతికిలబడలేదు. జెరిమీ కోర్బిన్ వాదనలకు జేజేలు కొట్టిన ప్రజలు ఓటు విషయానికి వచ్చేసరికి ఇలా వ్యవహరించడం ఊహించనిది. బ్రెగ్జిట్‌కు అడ్డుపడటం వినా ఈయన దగ్గర ఒక సరైన, విశ్వసనీయమైన మార్గాంతరం లేదని ప్రజలు భావించినట్టు ఉంది. మాజీ ప్రధాని తెరీసా మే మాదిరిగానే బ్రెగ్జిట్ ప్రణాళిక ఆమోదానికి బోరిస్ విశ్వప్రయత్నం చేశారు. ప్రధానంగా ఉత్తర ఐర్లాండ్‌తో ముడివడిన సుంకాల విషయంలో కొన్ని మార్పుచేర్పులు చేశారు. ఉత్తర ఐర్లాండ్‌ను ఐర్లాండ్ దేశంలో కలిపేయాలంటూ పోరాడిన ఐరిష్ రిపబ్లిక్ ఆర్మీని దారికి తెచ్చుకొనేందుకు ఉభయప్రాంతాల మధ్యా సరిహద్దులు ఉండవని బ్రిటన్ గతంలో హామీ ఇచ్చింది. బ్రెగ్జిట్ కారణంగా ఈయూనుంచి బ్రిటన్ బయటకు వస్తే ఈ రెండు ప్రాంతాల మధ్యా సుంకాలు వసూలు చేయవలసి వస్తుంది కనుక, ఇది ఉత్తర ఐర్లాండ్‌ను తిరిగి వేర్పాటు ఉద్యమం వైపు మళ్ళిస్తుందన్న భయంతో బ్రిటన్ వేరుపడినా సుంకాల విషయంలో మాత్రం ఈయూ పరిధిలోనే కొనసాగుతుందని తెరీసా మే ప్రణాళిక తయారుచేశారు. ఇది మిగతా ప్రాంతాలవారికి ఆగ్రహం కలిగించినందున, బోరిస్ రెండు ఐర్లాండ్‌ల మధ్యా సుంకాల హద్దులు చెరిపేసి, ఉత్తర ఐర్లాండ్ నుంచి మిగతా బ్రిటన్‌కు పోయే సరుకులమీద మాత్రమే సుంకాలు విధించేట్టుగా ఒప్పందాన్ని మార్చారు. ఈ మార్పుతో తన ఒప్పందానికి ఆమోదముద్రవేయించగలనని నమ్మిన బోరిస్‌కు 'సూపర్ సాటర్ డే' సమావేశం దెబ్బకొట్టింది. కన్సర్వేటివ్ ఎంపీ ఒకరు ప్రవేశపెట్టిన ఒప్పందం లేని బ్రెగ్జిట్‌కు ఏ మాత్రం తావివ్వని ఓ తీర్మానానికి ఎంపీలంతా పెద్ద సంఖ్యలో ఓటేసి, తద్వారా బ్రెగ్జిట్ వాయిదా పడేట్టుగా ప్రధానిపై ఒత్తిడిపెంచారు. ఇలా కిందామీదా పడవలసి రావడంతో బోరిస్ ముందస్తు ఎన్నికలకు పోదామనడం, లేబర్ పార్టీ కూడా అందుకు సిద్ధపడటం జరిగిపోయాయి.

ఏళ్ళతరబడి వేధిస్తున్న బ్రెగ్జిట్ ఈయూ ఇచ్చిన జనవరి 31గడువులోగా ఇక తీరిపోవచ్చును కానీ, ఈ ఫలితాల్లో స్కాట్‌ల్యాండ్ స్వతంత్రతను కోరుతున్న స్కాటిష్ నేషనల్ పార్టీ (ఎస్ఎన్‌పి)కి అత్యధిక స్థానాలు దక్కడంతో బ్రిటన్ మరో కొత్త సమస్య దిశగా అడుగులువేస్తున్నట్టు కనిపిస్తున్నది. ఈయూ నుంచి వేరుపడటానికి వ్యతిరేకంగా, స్కాట్‌ల్యాండ్ స్వతంత్రం కోసం రెండో రెఫరెండమ్ జరపాలన్న వాదనతో ఈ పార్టీ ఎన్నికలకు పోయింది. ఈ ఎన్నికల్లో భారతీయ సంతతికి చెందిన వారు గణనీయమైన సంఖ్యలో చట్టసభలకు ఎన్నికకావడం మరో సానుకూల పరిణామం. బోరిస్ మాజీ భార్య భారత సంతతికి చెందినామె కావడం అటుంచితే, మోదీతో బోరిస్‌కు ఉన్న సత్సంబంధాలు తెలిసినవే. బ్రిటన్ దేవాలయాల్లో లేబర్ పార్టీ మోదీ వ్యతిరేకి అన్న ప్రచారం ఉధృతంగా సాగిందన్న విమర్శలు సైతం వచ్చాయి. తన మంత్రివర్గంలో భారతీయ సంతతికి చెందినవారికి కీలకస్థానాలు ఇచ్చిన బోరిస్ ప్రచారంలో భాగంగా మోదీని 'నరేంద్రభాయ్' అంటూ ప్రవాస భారతీయులను మరింత ఆకట్టుకున్నారు. భారత ప్రగతికి దన్నుగా నిలుస్తాననీ, రెండుదేశాలూ కలసి ఉగ్రవాదంపై పోరాడతాయని హామీలు ఇచ్చారు. బ్రెగ్జిట్ అనంతర బ్రిటన్‌కు భారత్ అన్ని విధాలుగా అవసరం. ఈయూ నుంచి వేరుపడిన బ్రిటన్ మన పారిశ్రామికవేత్తలకు ఎంతో లబ్ధిచేకూరుస్తుంది. బోరిస్ ఇప్పుడు బలమైన ప్రధానిగా అవతరించడంతో రెండు దేశాల మధ్యా ఇచ్చిపుచ్చుకోవడాలకు ఇక హద్దులేమీ ఉండవు.

# బద్ధలైన భారతీయ ఆత్మ


■ పి. చిదంబరం




'పళని' పలుకు

పువ్వులు ముళ్ళు అవుతాయి! ఈ విరోధాభాస కలిగించే విస్మయం వెనుక ఒక చేదు వాస్తవం వున్నది. కొత్త పౌరసత్వ చట్టం మన పురానవ జాతి జీవితంలోకి ప్రవేశిస్తున్న సందర్భమే ఆ వాస్తవం.

భారత గణతంత్ర రాజ్యాన్ని ఒక 'హిందూ రాష్ట్ర'గా రూపొందించే లక్ష్య సాధనా కృషి వేగవంతమయింది. ఈ పురోగమన చోదక శక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఎదురులేని సారథ్యం వహిస్తోంది కేంద్ర హోం మంత్రి అమిత్ షా. సంకల్ప నిర్మాత లేదా లక్ష్య నిర్దేశి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తన మనోరథాన్ని నెరవేరుస్తున్న ఘటనల క్రమాన్ని చాలా ఉత్సాహంగా, అత్యంత ఆసక్తితో వీక్షిస్తోంది.

భారతీయ జనతా పార్టీ వరుసగా రెండో సారి సార్వత్రిక ఎన్నికలలో భారీ విజయం సాధించి అధికారంలోకి వచ్చి ఇంకా ఏడాది పూర్తికాలేదు. అయితేనేం తన ఎజెండాను శీఘ్రగతిన అమలు పరుస్తుండడమే ఎంతైనా ఆశ్చర్యం గొలుపుతోంది. ముస్లిం విడాకుల సంప్రదాయం ట్రిపుల్ తలాక్‌ను నేరపూరిత చర్యగా చేయడం, అసోంలో జాతీయ పౌర జాబితా (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్–ఎన్ఆర్‌సి)ను అమలుపరచడం, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన భారత రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేయడం, మరీ ముఖ్యంగా ఇప్పుడు 'పౌరసత్వ (సవరణ) బిల్లు–కాబ్ పార్లమెంటు ఆమోదం పొందడం హిందూ రాష్ట్ర లక్ష్య సాధనలో పురోగతికి ఉద్దేశించిన ఒక విపుల ప్రణాళికలో భాగమే.

> **కాబ్, ఎన్ఆర్‌సి రెండిటినీ అమలుపరిస్తే ఎన్ఆర్‌సి కింద మినహాయింపబడిన ముస్లిమేతరులను కాబ్ కింద భారతీయ పౌరులలో కలపడం జరుగుతుంది. నికర ఫలితమేమిటంటే ముస్లింలను మాత్రమే అక్రమ వలసదారులుగా గుర్తించడం, జాతీయ పౌర జాబితా నుంచి మినహాయించడం. దీని పర్యవసానాలు చాలా జుగుప్సాకరంగా వుంటాయి. సమానత్వం, రాజ్యాంగ నైతికతను పునరుద్ధరించే బాధ్యత ఇప్పుడు న్యాయవ్యవస్థపై వున్నది.**

మోదీ ప్రభుత్వం వెంటవెంటనే 'విజయవంతంగా' చేపట్టిన ఈ చర్యల వెనుక ఉన్న ఉమ్మడి లక్ష్యం భారతీయ ముస్లింలకు ఒక మొరటు, స్పష్టమైన సందేశాన్ని పంపడమే. ' మీరు ఈ దేశ సమాన పౌరులుకాదు' అన్నదే ఆ సందేశం. అంతేకాదు, 'భారత్ ఒక హిందూ దేశం' అన్న గోల్వాల్కర్ సావర్కార్ సిద్ధాంతాన్ని పునరుద్ఘాటించడం కూడా ఆ లక్ష్యంలో భాగమే.

పౌరసత్వ చట్టం,1955 ఐదు రకాల పౌరసత్వాన్ని గుర్తించింది. భారతదేశంలో పుట్టిన వారికి, భారతీయ సంతతి వారికి, భారతీయ పౌరులుగా నమోదు చేయించుకున్నవారికి, సహజీకరణ (నేచురలైజేషన్) పౌరులు, దేశంలో కలుపుకున్న విదేశీ భూభాగాల ప్రజలకు భారతీయ పౌరసత్వం లభిస్తుంది. వీరు గాక దేశంలో నివశిస్తున్న ఇతర వ్యక్తులు అందరూ 'అక్రమ వలసదారులు'గా పరిగణింపబడతారు. విదేశీయుల చట్టం,1946, పాస్ పోర్ట్(భారత్‌లో ప్రవేశం) చట్టం, 1920 నియమ నిబంధనలు ఆ ఇతర వ్యక్తులకు వర్తింప చేస్తారు. తత్ఫలితంగా వారు దేశం నుంచి బహిష్కరణకు అర్హులవుతారు. 'ఒక వ్యక్తి మతం ఆ వ్యక్తి భారతీయ పౌరుడైనా లేదా అక్రమ వలసదారు అయినా సరే..' అనేది భారతీయ పౌరసత్వ భావనకు పూర్తిగా పరాయి భావన. 'పౌరసత్వ (సవరణ) బిల్లు, 2019'తో పై విషయాలన్నీ మారిపోయాయి. పార్లమెంటు ఆమోదం పొందిన ఈ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైనదని పలువురు న్యాయశాస్త్ర కోవిదులు, విశ్రాంత న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు.

పౌరసత్వ సవరణ బిల్లు చేసిందేమిటి? అది మూడు దేశాలను ఎన్నుకొన్నది. అవి: అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్. ఆరు 'అల్పసంఖ్యాక మత వర్గాల'ను ఎన్నుకొన్నది. ఆ మతస్థులు : హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులు. ప్రస్తావిత మూడు దేశాలకు చెందిన, ప్రస్తావిత ఆరు మతాలలో ఏదో ఒక మతానికి చెందిన ఏ వ్యక్తి అయినా 2014 డిసెంబర్ 31న గానీ, అంతకు ముందుగానీ భారత్‌కు వలసవచ్చి వుంటే సదరు వ్యక్తి తన మాతృ దేశంలో మత పరమైన వేధింపులు, హింసాత్మక పీడనకు గురైన వాడని పౌరసత్వ సవరణ బిల్లు భావించింది. ఈ వాస్తవం దృష్ట్యా ప్రభుత్వ ఆదేశం మేరకు విదేశీయుల చట్టం, పాస్ పోర్ట్ చట్టం నిబంధనల నుంచి మినహాయింపు పొందుతాడని, అలాంటి వ్యక్తి అక్రమ వలసదారు'గా పరిగణింపబడడని పౌరసత్వ సవరణ బిల్లు స్పష్టం చేసింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే భారతీయ పౌర సత్వాన్ని పొందేందుకు ఒక కొత్త మార్గాన్ని ప్రభుత్వ ఆదేశం ప్రవేశపెట్టింది.

పౌరసత్వ సవరణ బిల్లుతో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పార్లమెంటులో వాటిని అడగడం జరిగింది. అయితే ప్రభుత్వం నుంచి వాటికి సమాధానాలు లభించలేదు. అవేమిటో చూద్దాం. (1) మన ఇరుగు పొరుగు దేశాలలో కేవలం మూడింటికి పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ మాత్రమే ఎందుకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. శ్రీలంక, మయన్మార్, భూటాన్, నేపాల్ మొదలైన ఇతర పొరుగు దేశాలను ఎందుకు వదిలివేశారు? (2) తమ మాతృదేశాలలో అధిక సంఖ్యాక మత వర్గానికి చెందని వారు కాదనే కారణంతో మతపరమైన పీడనకు గురైన మతస్థులలో కేవలం ఆరు మైనారిటీ మత వర్గాలకు మాత్రమే ఎందుకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు? అహ్మదియాలు, హజారాలు, బెలూచీలు, రోహింగ్యాలు, యూదులు మొదలైన వారిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? (3) పశ్చిమాసియాలో ఆవిర్భవించి, ప్రపంచమంతటా వ్యాపించిన మూడు మతాల క్రైస్తవం, జుడాయిజం, ఇస్లాంలో కేవలం క్రైస్తవాన్ని మాత్రమే ఎందుకు పరిగణనలోకి తీసుకున్నారు? (4) హిందువులను చేర్చారు సరే.. శ్రీలంక హిందువులను ఎందుకు మినహాయించారు? క్రైస్తవులను చేర్చడం బాగానే వుంది గానీ భూటాన్ క్రైస్తవులను ఏ కారణంతో మినహాయించారు? (5) పౌరసత్వ సవరణ బిల్లుకు ఆధారాంశం మత పరమైన పీడన. అయితే భాషాపరమైన, రాజకీయ, సాంస్కృతిక, కులపరమైన వివక్ష, పీడనను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? అంతర్యుద్ధాల బాధితుల మాటేమిటి? (6) 2014 డిసెంబర్ 1 న గానీ, అంతకుముందుగానీ వలసవచ్చిన వారికే భారత పౌరసత్వానికి అర్హులుగా పరిగణించడానికి కారణమేమిటి? అసోం ఒప్పందంలో ప్రస్తావితమైన 1971 మార్చి 25 గడువుపై ఈ కొత్త నిర్ణీత తేదీ చూపే ప్రభావమేమిటి? 1971 మార్చి 25 తేదీని వదిలివేశారా? (7) పౌరసత్వ సవరణ చట్టం నిబంధనల నుంచి (రాజ్యాంగం ఆరో షెడ్యూల్లో పేర్కొన్న) అసోం, మేఘాలయ, మిజోరం, త్రిపుర గిరిజన ప్రాంతాలను ఎందుకు మినహాయించారు? అలాగే బెంగాల్ ఈస్టర్న్ ఫ్రాంటియర్ రెగ్యులేషన్, 1873 కింద నోటిఫై అయిన 'ది ఇన్నర్ లైన్ పర్మిట్ పరిధిలోకి వచ్చే అరుణాచల్ ప్రదేశ్ మిజోరం, నాగాలాండ్‌లోని ప్రాంతాలనూ ఎందుకు మినహాయించారు? (నిర్దేశిత ప్రాంతంలో భారత పౌరులు భూములు లేదా ఆస్తులు కొనడం, ఉద్యోగాలు చేయడం ద్వారా స్థిరపడడాన్ని ఇన్నర్ లైన్ పర్మిట్ అడ్డు కొంటుంది). ఈ మినహాయింపుల పర్యవసానాలు ఏమిటి? పౌరసత్వ సవరణ బిల్లు, జాతీయ పౌర జాబితా అవిభక్త కవలలు కావా? వీటిలో దేన్ని ముందు అమలుపరుస్తారు? (9) 1971 మార్చి 25 కు ముందు భారత్‌లో జన్మించామని లేదా భారత్‌లోకి ప్రవేశించామని చెప్పుకుంటున్న వారు తమ వృత్తాంతాన్ని మార్చి చెప్పుకోవాలా? తాము మాతృదేశంలో మత పీడనకు గురయ్యామని చెప్పుకోవాలా? వారు చెప్పే విషయాలలో ఏది సత్యం? ఏది అసత్యం?

కాబ్, ఎన్ఆర్‌సి రెండిటినీ అమలుపరిస్తే ఎన్ఆర్‌సి కింద మినహాయింపబడిన ముస్లిమేతరులను కాబ్ కింద భారతీయ పౌరులలో కలపడం జరుగుతుంది. నికర ఫలితమేమిటంటే ముస్లింలను మాత్రమే అక్రమ వలసదారులుగా గుర్తించడం, జాతీయ పౌర జాబితా నుంచి మినహాయించడం. దీని పర్యవసానాలు చాలా జుగుప్సాకరంగా వుంటాయి. అక్రమ వలసదారులుగా గుర్తించిన వ్యక్తులను, వారు నివశిస్తున్న ప్రాంతాలలోని ఇతర ప్రజల నుంచి వేరుచేసి, ప్రత్యేక శిబిరాలలో వుంచుతారు. ఏ దేశమైనా తమ పౌరులుగా అంగీకరించేంతవరకు వారు ఆ శిబిరాలలోనే వుండిపోవల్సివస్తుంది. ఆ శిబిరాలను ఎక్కడ నిర్మిస్తారు? ఎన్ని శిబిరాలు అవసరమవుతాయి? 'అక్రమ వలసదారులు తమ మిగతా జీవితాన్ని అంతా శిబిరాలలోనే గడపాలా? వారి పిల్లల పరిస్థితి ఏమిటి? వారి పౌరసత్వ హోదా ఏమిటి?




లక్షలాది ముస్లింలను నిర్బంధ శిబిరాలలో నిరవధికంగా బంధించడం వల్ల దేశంలోనూ, విదేశాలలోనూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తీవ్ర పర్యవసానాలు ఉత్పన్నమవుతాయి. భారత్‌లో ముస్లింలకు ఎదురవుతున్న ఇటువంటి ప్రతికూల పరిస్థితుల వల్ల శ్రీలంక, మయన్మార్, పాకిసన్‌లలో నివశిస్తున్న హిందువులపై ఒత్తిళ్ళు పెరుగుతాయి. భారత్‌కు వలస వెళ్ళాల్సిన అగత్యం వారికి ఎదురవుతుంది. పౌరసత్వ సవరణ బిల్లు, సమానత్వ హక్కులను కల్పించే రాజ్యాంగ అధికరణలు 14, 21కు, విశ్వమానవ హక్కుల ప్రకటనకు అనుగుణంగా లేదనే అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టుగా కన్పించడం లేదు. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసోం, ఇతర ఈశాన్య భారత రాష్ట్రాలలో తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ప్రజలు పెద్ద ఎత్తున కాబ్‌పై నిరసనలలో పాల్గొంటున్నారు. వారిలో అత్యధికులు హిందువులే. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ప్రజలు తీవ్ర ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఆ రాజ్యాంగ విరుద్ధ బిల్లు ఆమోదం పొందడానికి ప్రభుత్వానికి పార్లమెంటు తోడ్పడింది. సమానత్వం, రాజ్యాంగ నైతికతను పునరుద్ధరించే బాధ్యత ఇప్పుడు న్యాయ వ్యవస్థపై వున్నది.

**(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)**

# ఉపాధికి ఆంగ్ల మాధ్యమమే ఆధారం

విద్య అనేది ప్రధాన ఉపాధి వనరుగా ఉన్న ప్రస్తుత తరుణంలో విద్యా విధానాన్ని సామాజిక కోణంలో చూడాలి. సంక్షేమ పథకాల రూపంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసినా బడుగుల జీవితాలలో రాని మార్పు ఆంగ్ల విద్య, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో వచ్చింది. నేడు ఉపాధి అవకాశాలన్నీ ఆంగ్లవిద్యపై ఆధారపడి వుండటమే అందుకు ప్రధాన కారణం. ఒకవైపు ఇంగ్లీషు మీడియంలో చదివినవారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో లక్షల జీతాలు సంపాదించడం కంటిముందు కనిపిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం తెలుగు మీడియంలోనే బోధించాలనుకోవడం ఎంతవరకు సబబు? సామాన్య కుటుంబాలకు చెందిన యువత విదేశాలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేయగలుగుతున్నారంటే ఇంగ్లీషు మాధ్యమ విద్యే కారణం.

వచ్చే సంవత్సరం నుంచి ఇంగ్లీషు మీడియం అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కేవలం 62,063 వేలు మాత్రమే. అంతేకాకుండా విద్యార్థుల సంఖ్యాపరంగా కూడా ప్రభుత్వ పాఠశాలలతో పోల్చుకొంటే ప్రైవేటు స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్య రెండు రెట్లు ఎక్కువ. మెజారిటీగా వున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో జరుగుతున్న బోధన గురించి మాట్లాడని భాషాభిమానులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం పెడితే మాత్రం భాష, సంస్కృతులు గుర్తుకు రావడం వింతగా వుంది.




> **ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించడం అంటే పేదవర్గాలకు ఇంగ్లీషు భాష అందకుండా ద్రోహం చేయడమని అర్థం.**

ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లీషు మీడియం స్కూల్స్‌గా మార్పు చేస్తున్నారే కాని, తెలుగు సబ్జెక్ట్ లేకుండా చేయడం లేదు. ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలన ప్రారంభించినప్పుడు తొలుత ఇంగ్లీషు నేర్చుకున్నది ఎవరు? ఇంగ్లీషు నేర్చుకొని సివిల్ సర్వెంట్లుగా, ఉన్నతాధికారులుగా అధికారం చెలాయించింది ఎవరు? ఇంకా చెప్పాలంటే ఇంగ్లీషువారి కంటే మొగలాయిలు, తురుష్కులు భారతదేశం వచ్చి పాలన ప్రారంభించినప్పుడు అరబ్బి, ఉర్దూ నేర్చుకొని తహశీల్దార్లుగా, దేశ్‌ముఖ్‌లుగా ప్రయోజనం పొందింది ఎవరు? అందరూ సంపన్నులే కదా!. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇంగ్లీషు నేర్చుకొని, భారతదేశాన్ని మాతృదేశంగా, అమెరికాను పితృదేశంగా మార్చుకొని విదేశాలకు ఎగబాకినప్పుడు మాతృభాషాభిమానం ఏమైంది? విదేశాలకు వెళ్లి డాలర్లు సంపాదిస్తూ ఆస్తులు కూడబెట్టి ఎన్ఆర్ఐ హోదా అనుభవిస్తున్నప్పుడు మాతృభాషాభిమానం ఏమైంది? విద్య అనేది విజ్ఞానం...సంస్కారం కోసం, అందుకోసం మాతృభాషలో చదివితే ఉపయోగం వుంటుందని కొందరు మేధావులు అంటున్నారు. అదే విజ్ఞానం...సంస్కారం ఇప్పటికే ఇంగ్లీషు మీడియంలో చదివే గొప్పవ్యక్తుల పిల్లలకు అవసరం లేదా?

మాతృభాష గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్న వారు ముందుగా మాతృభాషా సంరక్షణకు గానూ కొన్ని అంశాలు ఆచరించాలి. కార్పొరేట్ స్కూల్స్, ప్రైవేటు స్కూల్స్‌లో ఇంగ్లీషు మీడియం రద్దుచేసి తెలుగు మాధ్యమంలోనే బోధన జరిగేలా చూడాలి. వారి పిల్లలను తెలుగుమీడియంలోనే చదివించి, ఇళ్ళలో ఇంగ్లీషుకు బదులుగా తెలుగు మాట్లాడటం ప్రారంభించాలి.

తాజాగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం బోధించే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించడం అంటే పేదవర్గాలకు ఇంగ్లీషు భాష అందకుండా ద్రోహం చేస్తున్నారనే అర్థం. ప్రభుత్వ పరంగా 90 శాతం ఉత్తరప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే జరుగుతున్నాయి. ఇంగ్లీషులో విడుదల చేసే ఉత్తర్వులు అర్థం కాక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటుతున్నప్పటికీ ఇంగ్లీషు ప్రాధాన్యత ఏ మాత్రం తగ్గలేదు. తెలుగు అకాడమీ, సాహిత్య అకాడమీ లంటూ కేబినెట్ హోదాలు పొందిన ప్రముఖులు ప్రభుత్వ కార్లల్లో తిరగడం మినహా ఏమీ చేయలేకపోయారు. అటువంటి వారు, నేడు పేదల పిల్లలకు ఇంగ్లీషు మీడియం అందుబాటులోకి వస్తూంటే మాతృభాష నశించి పోతుందంటూ గగ్గోలు పెట్టడం ఆశ్చర్యం.. అసమంజసం.

■ **అన్నవరపు బ్రహ్మయ్య**

## కరపత్రం

### ఫ్రెడరిక్ ఏంగెల్స్, వర్తమాన సోషలిజంపై సదస్సు

సామాజిక శాస్త్రవేత్త, మార్క్సిస్టు తత్త్వవేత్త, రచయిత ఫ్రెడరిక్ ఏంగెల్స్ ద్విశతజయంతిని పురస్కరించుకొని ఆయన సైద్ధాంతిక అనుదానాన్ని చర్చించాలన్న లక్ష్యంతో విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డిసెంబర్ 15, 16 తేదీల్లో సదస్సు జరుగుతుంది. 15వ తేదీ ఉదయం 10 గంటలకు జె.వి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన ప్రారంభ సమావేశం జరుగుతుంది. కామ్రేడ్ బాలచంద్ర కాంగో ప్రారంభించే ఈ సమావేశంలో సదస్సు లక్ష్యాలను ఆచార్య ఎన్. అంజయ్య వివరిస్తారు. ముఖ్యఅతిథిగా ఆచార్య కె.ఎస్.చలం పాల్గొంటారు. అదే రోజు 11.30కు జరిగే మొదటి సమావేశంలో 'రాజకీయ ఆర్థిక వేత్తగా ఫ్రెడరిక్ ఏంగెల్స్' అన్న అంశంపై వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ ప్రసంగిస్తారు. రెండవ సమావేశంలో భాగంగా జరిగే 'ఫ్రెడరిక్ ఏంగెల్స్ తాత్విక సాహిత్యం, పార్శ్వావలోకన' అంశంపై కె.వి.రావు, 'ఫ్రెడరిక్ ఏంగెల్స్ తాత్విక వారసత్వంపై విమర్శ : ఒక పరామర్శ' అంశంపై ఎన్. అంజయ్య ప్రసంగిస్తారు. రెండవ రోజు డిసెంబర్ 16న ఉదయం 10 గంటలకు మొదలయ్యే మూడవ సమావేశంలో 'సోషలిజం : ఊహాజనితమా, శాస్త్రీయమా : సింహావలోకనం' అంశంపై ఆచార్య ఎ. జగన్నాథరావు, 'ప్రకృతి గతితర్కం : చారిత్రక, సమకాలీన ప్రాధాన్యత' అంశంపై అనిల్ రజింవాలె, 'ప్రకృతి గతితర్కం, వైజ్ఞానిక తత్వం' అంశంపై ఆచార్య సవ్యసాచి ఛటర్జీ ప్రసంగిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే నాలుగవ సమావేశంలో భాగంగా 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం పుట్టుక : పార్శ్వావలోకన' అంశంపై ఆర్.వి. రామారావు, 'ఫ్రెడరిక్ ఏంగెల్స్ : మహిళా సమస్య' అంశంపై కాత్యాయని విద్మహే ప్రసంగిస్తారు.

**– కామ్రేడ్ వై.విజయకుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం**

# క్రాంతదర్శి జ్వాలాముఖి

భూస్వామ్యయుగ భావజాలానికి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద సంస్కృతికి వ్యతిరేకంగా కవి, రచయిత పోరాటం చేయక తప్పదు. సంఘటనలను కళాత్మకంగా ప్రతిబింబించడంతోనే రచయిత బాధ్యత తీరిపోదు. వాటిపై అతని వ్యాఖ్యానం ప్రధానం. ఆ వ్యాఖ్యానమే లేకుంటే ఆ రచన నిరర్థకమవుతుంది. అలా వ్యాఖ్యానించాలంటే ఒక సామాజిక తాత్వికత దృష్టి కావాల్సి వుంటుంది. రచనలో సామాజిక తర్కం స్పష్టం కావలసి వుంటుంది. అవగాహనా పరిమితులు రచయితను తప్పుదారి పట్టించినా, విప్లవ కావ్య వస్తువు నుంచి ఎవరూ తప్పించుకోలేని యథార్థం సాహిత్య ప్రపంచంలో స్థిరపడింది. ఇవి జ్వాలాముఖి సాహిత్య జీవనాన్ని నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలు. అందువల్లనే ఆయన తన కాలం కవులకే కాదు, రానున్న తరాలకు కూడా లక్ష్య నిర్దేశనం చేయగలిగారు.



'అభిరుచులకు వర్గ ప్రయోజనాలుంటాయి. అభివ్యక్తి సోయగాలకు వర్గ ప్రయోజనాలుంటాయి. పద చిత్రాలకు ఖచ్చితంగా వర్గ అభీష్టాలుంటాయి' కనుక ఏ పదాల వెనుక, ఏ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలున్నాయో గమనించి జాగ్రత్త పడమని సాహితీ లోకానికి, ప్రజలకు ఆయన ఒక చక్కని హెచ్చరిక చేశారు. పాలక వర్గ ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా, అధికారంలో వున్నవారి అభిప్రాయాలే సర్వ శిరోధార్యాలుగా పరిణమించిన నేటి సాంఘిక, రాజకీయ వాతావరణంలో ఆయన చూపిన ఎరుక మనకో చరుపు. మన ప్రతిష్ఠ కన్నా మన యుగావసర పరిపూర్తి ముఖ్యం. దేశంలో ఈనాటి పరిస్థితి అనేక రకాలుగా దుర్భరంగా వుంది. 'పునరుద్ధరణ వాదం' రాజ్యాధికారం చెలాయిస్తోంది. 'సంస్కరణ వాదం' అవకాశవాదంలో కూరుకుపోయింది. నిజానికి ఈ రెంటిలో ఏదీ ప్రజాస్వామ్యాన్ని సక్రమంగా నిర్వహించజాలదు. ఇది ఒక వంక ఫ్యూడల్ భావజాలాన్ని, మరో వంక సామ్రాజ్యవాద బానిస భావజాలాన్ని ప్రదర్శిస్తూ నిజమైన ప్రజా సంస్కృతిని నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నాయి. అందుకే రాజకీయ పోరాటాలు ఎంత నిర్దుష్టంగా, ఎంత నిష్ఠూరంగా సాగుతాయో సాంస్కృతిక పోరాటం కూడా అంత నిర్దుష్టంగాను అంత నిష్ఠూరంగాను సాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

'అనుభూతులకు, అభిప్రాయాలకు, ఆవేశాలకు, ఆత్మీయతలకు, ఆర్ద్రతలకు, మానవ సంబంధాలకు, విలువలకు, సంస్కృతీ సభ్యతలకు ఆస్కారం లేని యాంత్రిక ప్రవర్తన, లాభనష్టాల అంచనా, ఎగబడి సంపాదించుకునే (దోచుకునే) నైపుణ్యానికి పట్టం కట్టడం' ఈ నాటి వాస్తవం. ప్రతి వాడూ సరుకు, ప్రతి విషయం లాభం, ప్రతి సందర్భం కొనుగోలు కావడం ఈ పెట్టుబడిదారీ సమాజ వికృత స్వభావం. మనిషిని సమిష్టితత్వం నుంచి విడగొట్టి, ఒంటరిని చేసి, లాభాల మృగంగా మార్చడం, అవసరం తీరిపోగానే పనికిరాకుండా చేయటం గమనించి ఆయన చాలా వ్యాకుల పడ్డాడు. భాషా సంస్కృతులు కూడా ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా మనజాలవు అని చెబుతూ 'ఇంగ్లీషును ఒక భాషగా ఒక సాహిత్యంగా తెలుసుకోవడంలో ఎవరికీ అభ్యంతరం వుండనక్కర లేదు. కానీ దాన్ని మాతృభాషకు ప్రత్యామ్నాయంగా చేపట్టే విద్యా విధానాన్ని ప్రతిఘటించాలి' అని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజలు గమనించవలసిన అంశం ఆయన ఎత్తి చూపారు. విదేశాలకు వెళ్ళే ఇంగ్లీషు చదువులు వేరు. ఈ దేశంలోనే వుంటూ, ఈ మట్టిని నమ్ముకుని బతికే వారి సంగతి ఏమిటి? అని ప్రశ్నిస్తూ ప్రజలు తమ నైసర్గికత నుండి తుంచివేయబడి, భాషా పరంగా పరాయీకరణ చెందితే, సంస్కృతి పరంగా తనదైన దానికి దూరమయితే ఈ దేశమే మిగలదు. అదే సామ్రాజ్యవాదులకు కావాలి' అని రానున్న ప్రమాదాల్ని పసిగట్టారు.

'ప్రజల మధ్య చైతన్యం, సమిష్టితత్వం లేకుండా చేయడం సామ్రాజ్యవాద సంస్కృతి'. విరుచుకుపడుతున్న ఈ సాంస్కృతిక దాడిని ఎదుర్కోవడం నేటి సాహితీ, సాంస్కృతిక రంగాల, ప్రధాన ప్రాథమిక కర్తవ్యంగా మారిపోయింది.

ఉద్యమాలకు సంఘం జన్మస్థానం అయితే విప్లవం గమ్యస్థానం కావాలి. సంఘటిత శక్తితో, రాజకీయ విజ్ఞతతో, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. ఉద్యమిస్తున్న ప్రజలతో భావైక్యం చెందాలి! సాహితీ, సాంస్కృతిక రంగానికి ఇంతకు మించిన మార్గం మరొకటి లేదు. కళా సాహిత్యాల పరమప్రయోజనం అశాంత జీవితాలు కోరుకునే విస్తృత మార్పులకు ప్రోది చేయటమే పీడిత జనతా ఉద్యమాలకు తోడుగా, తోడ్పాటుగా నడవటమే అన్న సాహితీ సందేశాన్నందిన విప్లవ కవి జ్వాలాముఖి సందేశం మనకు మార్గదర్శకం కావాలి.


■ **డా. యస్. జతిన్ కుమార్**
'నవోదయ' సాంస్కృతిక సమాఖ్య


*(నేడు జ్వాలాముఖి వర్ధంతి)*

# ఊరంతా ఉల్లి చింత

దేశ వ్యాప్తంగా ఉల్లిపాయ ధరలు ఆకాశాన్నంటాయి. కనీవినీ ఎరగని రీతిలో భగ్గుమంటున్నాయి. ఈ ఘాటుకి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సబ్సిడీలో ప్రభుత్వం అందిస్తున్న ఉల్లి పాయల కోసం ప్రజలు గంటలతరబడి క్యూల్లో నిలబడాల్సి వస్తున్నది. అయినా కేజీ ఉల్లిపాయలు పొందటం గగనమౌతున్నది.

ఉల్లి ధరలను తగ్గించటానికి మోదీ ప్రభుత్వం కొన్ని చర్యలను ప్రకటించింది. ఉల్లి ఎగుమతులను కూడా నిషేధించింది. చిల్లర వ్యాపారులు 100 క్వింటాళ్ళు, టోకు వర్తకులు 500 క్వింటాళ్ళు వరకు మాత్రమే ఉల్లిపాయలు నిల్వ ఉంచుకోవాలని ఆంక్షలు విధించింది. లక్ష టన్నుల ఉల్లి పాయలు ఇతర దేశాల నుండి దిగుమతికి అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నది. కాని ఉల్లి కొరత, ధరలు తగ్గలేదు. పై పెచ్చు రోజురోజుకి ఈ సమస్య తీవ్రతరమౌతున్నది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రైతుబజార్లు, వివిధ ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా వినియోగదార్లకు ప్రకటించిన కిలో రూ 25/లకు (కిలో మాత్రమే) ఉల్లిపాయ సరఫరా ఏమాత్రం ప్రభావం చూపటం లేదు. గ్రామీణప్రాంతాలకు ఉల్లిపాయ సరఫరా పూర్తిగా స్తంభించింది.

ఉల్లి ధర పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలు ప్రభుత్వం చెప్తున్నది. ఈ ఏడాది ఆలస్యంగా ఉల్లి సాగు మొదలు పెట్టడం వల్ల ఉత్పత్తి మార్కెట్‌లోకి రావడం ఆలస్యమైంది. అధిక వర్షాల వల్ల ప్రధాన రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉల్లి ఉత్పత్తి దెబ్బతినటం వలన ఉత్పత్తి తగ్గిందని రెండో కారణంగా ప్రభుత్వం చెప్తున్నది. వాస్తవంగా ప్రభుత్వం ఈ పరిస్థితిని నివారించగలిగిన అవకాశాలు పుష్కలంగానే వున్నాయి. కాని ప్రభుత్వం ముందు చూపుతో ఏ చర్యా తీసుకోకపోవటం వల్లనే ఈ దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు తీసుకున్న చర్యల వల్ల కూడా ఉల్లి ధరలు తగ్గటం లేదు. అలాగే ప్రతి ఏడాది సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు ఉల్లి ధరలు ఎందుకు ఎక్కువగా పెరుగుతున్నాయి. రబీ సీజన్‌లో 65 శాతం పైబడి ఉల్లి ఉత్పత్తి అవుతుంది. ఈ సమయంలో ప్రభుత్వం పెద్దఎత్తున బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి గిడ్డంగుల్లో ఉంచాలి. కాని ఈ పని చేయడం లేదు. మొత్తం సరఫరాను మార్కెట్ శక్తులకు వదిలివేస్తున్నది. ఈ ఏడాది ఎంత ఉల్లి ఉత్పత్తి అవుతది? దేశ ప్రజలకు ఎంత అవసరం? ఎంత ఎగుమతికి అవకాశం ఇవ్వొచ్చు లేదా కొరతగా ఉంటే ఎంత పరిమాణంలో దిగుమతి చేసుకోవాలి? అనే వాటిపై కేంద్ర ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించటం లేదు. దీని వల్ల ఉల్లి పై పూర్తి కంట్రోలు బ్లాక్ మార్కెట్ దార్లు, బడా వ్యాపారుల పరమయ్యింది. అందువల్లే 2018 లో 19.90 లక్షల టన్నుల ఉల్లి ఎగుమతి చేశారు. ఈ ఏడాది జనవరి నుండి జూలై వరకు 12.35 లక్షల టన్నులు ఎగుమతి జరిగింది. ఈ ఏడాది జులై వరకూ ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోయారు. గత ఏడాది ఉల్లిపాయలు పారపోసి రైతులు నిరసనలు తెలియజేసిన సంఘటనలు చూసాం.

ఉల్లి పాయలను రైతుల నుండి సేకరించి గిడ్డంగులలో నిల్వ ఉంచటానికి ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) పనిచేస్తుంది. కాని ఉల్లిని రైతుల నుండి సేకరించడంలో వైఫల్యం చెందుతున్నాయి. ఈ కార్యకలాపాలు నిర్వహించటానికి అవసరమైన నిధుల్లో కేంద్ర ప్రభుత్వం కోత పెడుతున్నది. 2019–20లో 50 వేల టన్నులు సేకరించాలని లక్ష్యం పెట్టుకొని సేకరించడంలో నిర్లక్ష్యం వహించింది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో మార్కెట్‌లోకి ఉల్లి సరఫరా చేయటానికి ప్రభుత్వం దగ్గర ఉల్లిపాయలు నిల్వలు ఉండటం లేదు. దీంతో ఉల్లిపాయ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

మోదీ ప్రభుత్వ వ్యవసాయక తిరోగమన విధానాలవల్ల దేశంలో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత 4 ఏళ్ళ నుండీ గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రభుత్వం పెద్ద ఎత్తున కొనకపోవడంతో బాగా దెబ్బతిన్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో



రైతులకు క్వింటా ఉల్లిపాయలకు రైతులకి వస్తున్నది మహా అయితే రూ.300ల నుండి రూ.500 మధ్య ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రూ రూ.150కి లోపే అమ్ముకోవాల్సి వస్తుంది. వాస్తవంగా ఒక ఎకరా ఉల్లి సాగుకు కనీసం రూ 60 వేలు ఖర్చు అవుతుంది. కనీసం క్వింటా రూ 900లకు అమ్మితేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. అందుకే కనీస మద్దతు ధర కిలో రూ 8.50లుగా ప్రకటించమని రైతులు ప్రభుత్వానికి గగ్గోలు పెడుతున్నారు. కాని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర బహిరంగ మార్కెట్ ధర కంటే చాలా తక్కువగా ఉంటున్నది. ఉల్లి రైతులు నష్టపోవడమే గాని లాభపడుతున్నది కనిపించడం లేదు. ఇప్పుడుగా భారీగా పెరిగిన ఉల్లి ధరల వల్ల లాభపడుతున్నది బ్లాక్ మార్కెట్‌దార్లు, బడా వ్యాపారస్తులే.

పంటల ధరల క్రమబద్ధీకరించటానికి, రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధరలు నిర్ణయించటానికి కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న జాతీయ వ్యవసాయ ధరల నిర్ధారణ సంఘ కార్యకలాపాలు కూడా మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఈ సంస్థ ప్రతిపాదిస్తున్న పంటల దీర్ఘకాలిక వ్యూహాలను పెడచెవిన పెడుతున్నది. వివిధ పంటల సాగు పెంపుదలకు రైతులకు ప్రోత్సాహకాలు, మద్దతు ధర వంటి ముఖ్యమైన వాటిని నిర్లక్ష్యం చేస్తున్నది.

ప్రపంచ ఉల్లి ఉత్పత్తిలో చైనా తరువాత భారత్‌ది రెండవ స్థానం. ఈ రెండు దేశాలే ప్రపంచ ఉల్లి ఉత్పత్తిలో 50శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రస్తుతం మనదేశంలో 13.15 లక్షల హెక్టార్ల భూమిలో ఉల్లిపాయ సాగౌతున్నది. 2017–18లో 22.07 మిలియన్ టన్నులు, 2016–17లో 23.42 మిలియన్ టన్నుల, 2015–16లో 20.93 మిలియన్ టన్నుల ఉల్లిపాయల ఉత్పత్తి జరిగింది. 2018–19లో కూడా 33.28 మిలియన్ టన్నులు ఉత్పత్తి జరిగింది. 2007–08 నుండి మన దేశంలో ఉల్లి సాగు భూమి విస్తీర్ణంతో పాటు ఉత్పత్తి కూడా గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ పదేళ్ళ కాలంలో ఉల్లి ఉత్పత్తి దేశం రెట్టింపు అయ్యింది. ఉల్లి వినియోగం కూడా దేశంలో బాగా పెరిగి నెలకి 13లక్షల టన్నులు అవసరమౌతున్నది.

దేశంలో ఉల్లి పండించే భూమిలోను, ఉత్పత్తిలోను మహారాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. ఆ తరువాత మధ్య ప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, బీహార్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ వరుసగా 2 నుంచి 7 స్థానాల్లో ఉన్నాయి. ఈ 7 ప్రధాన రాష్ట్రాలే 80 శాతం ఉల్లి ఉత్పత్తికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మోదీ హయాంలో వ్యవసాయ ఎగుమతులు క్షీణిస్తున్నాయి. దిగుమతులు మాత్రం బాగా పెరుగుతున్నాయి.

కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా ఉల్లి ధరలు అరికట్టే చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా విధానపరమైన చర్యలు చేపట్టాలి. రైతులకు అందుతున్న ధరలకు వినియోగదారులు చెల్లిస్తున్న ధరలకు మధ్య వ్యత్యాసాన్ని తగ్గించటానికి హేతుబద్ధ విధానాన్ని అనుసరించాలి. ఉల్లి పంటకు కనీస మద్దతు ధరను స్వామినాథన్ సిఫార్సులననుసరించి నిర్ణయించాలి. బహిరంగ మార్కెట్‌లో ఎంతకు అమ్మాలనేది ప్రభుత్వం నిర్ణయించాలి. ప్రభుత్వ ధర నిర్ణయం ప్రకారం రైతుబజార్లు, రేషన్ డిపోల ద్వారా ఉల్లి సరఫరా జరగాలి. బ్లాక్ మార్కెట్‌దార్లపైన చర్యలు తీసుకోవాలి. టోకు వ్యాపారులు విచ్చలవిడిగా ఉల్లి నిల్వలు చేసుకోవటంపై పరిమితి విధించటంతో పాటు నిల్వలపై తనిఖీలు, నిఘా వుండాలి.

ఉల్లి సాగు పెంపునకు ప్రభుత్వం ప్రోత్సాహకాలతో పాటు పంటలు నష్టపోయినప్పుడు నష్ట పరిహారం చెల్లించే విధంగా కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. రైతులు తమ పంటలను నిల్వ ఉంచుకోవటానికి, రుణాలు పొందటానికి అవసరమైన గిడ్డంగులు ప్రభుత్వం నిర్మించి నిర్వహించాలి. ఈ చర్యలు చేపడితే ఉల్లి రైతులు నష్టపోరు. వినియోగదారులు కూడా చౌక ధరకు ఉల్లి పొందగలుగుతారు.

■ **డా. బి. గంగారావ్**

ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం





# గుమ్మడి గుబాళింపు!

రెగ్యులర్ కూరగాయల భోజనంతో బోర్ కొడుతుంటే, అప్పుడప్పుడు వెరైటీగా వంటింట్లో గుమ్మడికాయ గుబాళింపులకు చోటివ్వాలి. సాధారణంగా కూరగాయల మార్కెట్లో కనిపించే గుమ్మడికాయలను చాలామంది పెద్దగా పట్టించుకోరు గానీ దానితో ఎన్నో రుచులు చేసుకోవచ్చు. పులుసు, వడియాలు, కూటు, పచ్చడి, హల్వా... ఇలా ఏదైనా సరే నోరూరాల్సిందే!

వంటిల్లు

## గుమ్మడికాయ కూటు

**కావలసినవి**

గుమ్మడికాయ ముక్కలు - అర కప్పు, పెసరపప్పు - పావుకప్పు, నూనె - సరిపడా, ఆవాలు - పావు టీస్పూన్, జీలకర్ర - అర టీస్పూన్, కరివేపాకు - కొద్దిగా, ఎండుమిర్చి - రెండు, సెనగ పప్పు - అర టీస్పూన్, మినపప్పు - అర టీస్పూన్, ఉల్లిపాయలు - రెండు, అల్లం - చిన్నముక్క, టొమాటో - రెండు, పసుపు - చిటికెడు, కారం - ఒక టీస్పూన్, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర - ఒక కట్ట.

**తయారీ**

- గుమ్మడికాయ పొట్టు తీసి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- కుక్కర్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి వేసి వేగించాలి.
- తరువాత సెనగపప్పు, మినప్పప్పు వేసి మరికాసేపు వేగనివ్వాలి.
- ఉల్లిపాయలు వేయాలి. ఉల్లిపాయలు బాగా వేగాక టొమాటో ముక్కలు వేయాలి.
- మరికాసేపు చిన్నమంటపై వేగిన తరువాత గుమ్మడికాయ ముక్కలు వేసి కలపాలి.
- ఇప్పుడు పెసరపప్పు, పసుపు, ధనియాలపొడి, కారం, తగినంత ఉప్పు, కొద్దిగా నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టాలి.
- నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఆవిరి పోయాక మూత తీసి కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని తింటే 'వావ్' అనాల్సిందే.



## గుమ్మడికాయ పులుసు

**కావలసినవి**

గుమ్మడికాయ ముక్కలు - ఒకటిన్నర కప్పు, పచ్చిమిర్చి - ఒకటి, ఉల్లిపాయలు - రెండు, కరివేపాకు - కొద్దిగా, ఆవాలు - అర టీస్పూన్, జీలకర్ర - అర టీస్పూన్, మెంతులు - చిటికెడు, చింతపండు - రెండు టేబుల్‌స్పూన్లు, కారం - ఒక టీస్పూన్, ధనియాలపొడి - ఒక టీస్పూన్, బెల్లం - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర - ఒక కట్ట, నూనె - సరిపడా.

**తయారీ**

- చింతపండును నీటిలో శుభ్రంగా కడిగి పులుసు సిద్ధం చేసి పెట్టుకోవాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక ఆవాలు, జీలకర్ర, మెంతులు వేసి వేగించాలి.
- కరివేపాకు, పచ్చిమిర్చి వేసి మరి కాసేపు వేగనివ్వాలి.
- ఇప్పుడు ఉల్లిపాయలు వేసి కాస్త ఉప్పు చల్లాలి.
- ఉల్లిపాయలు వేగిన తరువాత గుమ్మడికాయ ముక్కలు వేసి వేగించాలి.
- పసుపు, కారం వేసి మరో రెండు నిమిషాల పాటు వేగనివ్వాలి.
- ఇప్పుడు బెల్లం, చింతపండు రసం పోసి కలియబెట్టాలి. చిన్న మంటపై మరగనివ్వాలి.
- పులుసు మరుగుతున్న సమయంలో ధనియాల పొడి వేయాలి. రుచి చూసి తగినంత ఉప్పు వేసుకోవాలి.
- చివరగా కొత్తిమీర చల్లి దింపుకొంటే ఘుమఘుమలాడే గుమ్మడికాయ పులుసు రెడీ.



## గుమ్మడికాయ వడియాలు

**కావలసినవి**

బూడిద గుమ్మడికాయ - మూడు కేజీలు, మినప్పప్పు - 400గ్రాములు, పచ్చిమిర్చి - 50 గ్రాములు, పసుపు - రెండు టీస్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత.

**తయారీ**

- మినప్పప్పును శుభ్రంగా కడిగి నీళ్లు పోసి కనీసం నాలుగు గంటలపాటు నానబెట్టుకోవాలి.
- పచ్చిమిర్చిని శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవాలి.
- మినప్పప్పులో నీళ్లు తీసేసి మిక్సీలో వేసి పట్టుకోవాలి.
- గుమ్మడికాయను శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పైపొట్టు తీయాల్సిన అవసరం లేదు.
- గుమ్మడికాయ ముక్కలను ఒక పాత్రలోకి తీసుకుని ఉప్పు వేసి కలియబెట్టి అరగంటపాటు పక్కన పెట్టాలి.
- ఉప్పు కలపడంతో గుమ్మడి ముక్కల మీద నీళ్లు ఊరతాయి. ఆ నీళ్లు తీసేయాలి. ముక్కలను చేతుల్లోకి తీసుకుంటూ నీళ్లు కొంచెం కూడా లేకుండా పిండేయాలి.
- ఒక తెల్లటి వస్త్రంలో గుమ్మడికాయ ముక్కలు వేసి ఆరనివ్వాలి.
- తరువాత వాటిలో మినప్పప్పు, పచ్చిమిర్చి పేస్టు, కొద్దిగా ఉప్పు, పసుపు వేసి కలపాలి.
- ఎండలో కాటన్ వస్త్రం పరిచి గుమ్మడి ముక్కల్ని చేతుల్లోకి తీసుకుంటూ వడియాలు వేయాలి.
- వడియాలను కనీసం నాలుగు రోజులపాటు ఎండనివ్వాలి. దాంతో వడియాలు ఎండిన తరువాత చిన్నగా అవుతాయి.
- వీటిని ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు నూనెలో ఫ్రై చేసుకొని తినొచ్చు.

## గుమ్మడికాయ హల్వా

**కావలసినవి**

గుమ్మడికాయ - ఒకకేజీ, దాల్చినచెక్క - కొద్దిగా, పంచదార - 150 గ్రాములు, నూనె లేక నెయ్యి - నాలుగు టేబుల్‌స్పూన్లు, ఎండుద్రాక్ష - 50గ్రాములు, కొబ్బరితురుము - రెండు టేబుల్ స్పూన్లు, బాదం - రెండు టేబుల్‌స్పూన్లు.

**తయారీ**

- గుమ్మడికాయ పొట్టు తీయాలి. కొబ్బరి, బాదం వేగించి పొడి చేసుకోవాలి.
- ఒక పాత్రలో గుమ్మడికాయ, దాల్చిన చెక్క తీసుకొని కొద్దిగా నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి.
- తరువాత నీళ్లన్నీ తీసేసి గుమ్మడికాయను గుజ్జుగా చేయాలి.
- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక గుమ్మడికాయ గుజ్జు వేసి పదినిమిషాల పాటు వేగించాలి.
- ఇప్పుడు సరిపడా పంచదార వేయాలి. మిశ్రమం చిక్కగా అయ్యే వరకు ఉంచాలి.
- కొబ్బరి తురుము, బాదం వేయాలి. ఎండుద్రాక్ష వేసి సర్వ్ చేసుకోవాలి.



## పచ్చడి

**కావలసినవి**

గుమ్మడికాయ - 300గ్రాములు, పసుపు - అర టీస్పూన్, బెల్లం - రెండు టీస్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, కొబ్బరి తురుము - అర కప్పు, పచ్చిమిర్చి - ఒకటి, అల్లం - చిన్నముక్క, కరివేపాకు - కొద్దిగా, నూనె - ఒక టీస్పూన్, ఆవాలు - అర టీస్పూన్, మినప్పప్పు - అరటీస్పూన్.

**తయారీ**

- ముందుగా గుమ్మడికాయను ముక్కలుగా కట్ చేసి కొద్దిగా ఉప్పు చల్లి, పసుపు వేసి, కొన్ని నీళ్లు పోసి ఒక విజిల్ వచ్చే వరకు కుక్కర్‌లో ఉడికించాలి.
- ఆవిరిపోయిన తరువాత గుమ్మడికాయ ముక్కలు తీసి, బెల్లం, పచ్చిమిర్చి, అల్లం వేసి గ్రైండ్ చేయాలి.
- ఈ మిశ్రమానికి కొబ్బరి తురుము, తగినంత ఉప్పు కలిపి పక్కన పెట్టాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి ఆవాలు, మినప్పప్పు, కరివేపాకు వేసి వేగించాలి. ఈ పోపును గుమ్మడికాయ మిశ్రమంపై పోసి కలియబెట్టుకొని సర్వ్ చేసుకోవాలి.



వినూత్నం

# గ్యాస్‌తో ఇస్త్రీ!

**కర్ర బొగ్గుతో దుస్తులు ఇస్త్రీ చేసే ఐరన్ బాక్స్‌లకు బదులు, పర్యావరణహితమైన ఎల్‌పీజీ ఇస్త్రీ బాక్స్‌లను అందుబాటులోకి తేవాలనుకున్నారు ఆమె. ఆ దిశగా అడుగులు వేసి 'ఉదయం లెర్నింగ్ ఫౌండేషన్' అనే సంస్థ ద్వారా ఎంతో మంది జీవితాల్లో మార్పును తీసుకొచ్చారు బెంగళూరుకు చెందిన మెకిన్ మహేశ్వరి. ఆమె వినూత్న ప్రయత్నం విశేషాలివి...**

"బెంగళూరులో చిన్న వ్యాపారుల మీద మేము ఒక సర్వే చేశాం. అందులో టీకొట్టు, ఫుడ్‌స్టాళ్లు నడిపేవారు, ఇస్త్రీ పనిచేసేవాళ్లు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి చిన్న వ్యాపారులు ఆదాయం పెంచుకోవడంలో సాయపడడం మా లక్ష్యం" అన్నారు మహేశ్వరి. రెండు నెలల పాటు ఇస్త్రీ కార్మికుల సమస్యలను అధ్యయనం చేశారామె. బెంగుళూరులో 40 వేల మంది ఇస్త్రీ కార్మికులు ఉన్నారని ఓ అంచనా. వీళ్లంతా బొగ్గు ఇస్త్రీ పెట్టెలు వాడుతున్నారు. ఇవి కాలుష్యాన్ని వెదజల్లడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతోంది. బొగ్గును రాజేసి ఇస్త్రీపెట్టెను వేడి చేయడానికే విడతకు 30 నిమిషాలు పడుతుంది. ఇలా రోజుకు నాలుగైదుసార్లు చేస్తే రోజుకు 3 గంటలు ఇస్త్రీపెట్టెను వేడిచేయడానికే సరిపోతుంది.. ఇంకో సమస్య ఏమిటంటే కర్ర బొగ్గు అంత సులువుగా లభించదు. బొగ్గుతో పనిచేసే ఇస్త్రీపెట్టెల వల్ల కలిగే అధిక వేడికి కొన్నిసార్లు దుస్తులు అంటుకుపోతాయి. అనుకోకుండా బూడిద పడడం వల్ల దుస్తులు పాడవుతాయి. దీనివల్ల ఇస్త్రీ చేసేవాళ్లు నష్టపోతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం కనుక్కోవడానికి ప్రయత్నించారు మహేశ్వరి.

**మీరట్ నుంచి తెప్పించారు...**

"టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా గడచిన 50 ఏళ్లుగా ఇప్పటివరకూ ఇస్త్రీ రంగంలో పెద్దగా ఆవిష్కరణలు జరగలేదు. కరెంట్ ఐరన్ బాక్స్‌లకు విద్యుత్ ఖర్చు ఎక్కువ కావడం, విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడంతో చాలామంది వాటిని వాడడం లేదు. ఇస్త్రీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించినప్పుడు ఢిల్లీలో కొందరు ఎల్‌పీజీతో పనిచేసే ఇస్త్రీ పెట్టెను వాడుతున్నారని విన్నాం. వాకబు చేస్తే మీరట్‌లో ఎల్‌పీజీ ఇస్త్రీ పెట్టెల తయారీ యూనిట్ ఉందని తెలిసింది. రెండు ఎల్‌పీజీ ఐరన్ బాక్స్‌లు తెచ్చి ఇద్దరు ఇస్త్రీ వ్యాపారులకు ఇచ్చాం. అయితే అవి బరువు ఎక్కువగా ఉండడంతో తయారీదారుతో మాట్లాడి తేలిగ్గా ఉండేలా తయారుచేయించాం. ఈ ఇస్త్రీ పెట్టెలను పట్టుకోవడానికి చెక్క పిడికిలికి బదులు ప్లాస్టిక్ పిడికిలి ఉంటుంది. ఈ ఐరన్ బాక్స్‌తో రిపేరు కిట్ కూడా వస్తుంది. ఇస్త్రీ కార్మికులే సులభంగా రిపేరు చేసుకోవచ్చు" అంటారు మహేశ్వరి. బొగ్గుతో పనిచేసే ఇస్త్రీ పెట్టె ధర 2 వేల రూపాయలు మాత్రమే. ఎల్‌పీజీ ఇస్త్రీపెట్టె ధర మాత్రం 8 వేల రూపాయలు. ధర ఎక్కువగా ఉండడంతో తమ సంస్థ ద్వారా ఇస్త్రీ కార్మికులకు రుణాలు కూడా ఇప్పించారు ఆమె.

**ఖర్చు తక్కువ... ఆదాయం ఎక్కువ...**

గ్యాస్ స్టవ్‌లోలాగానే సిలిండర్ నుంచి గ్యాస్ ట్యూబ్ సాయంతో ఇస్త్రీ పెట్టెకు కలుపుతారు. ఇస్త్రీ చేసే దుస్తులను బట్టి రెగ్యులేటర్ ద్వారా వేడిని పెంచుకునే, తగ్గించుకునే అవకాశం ఉంది. ఎల్‌పీజీ ఇస్త్రీపెట్టెతో కార్మికుల ఆదాయం పెరిగింది. "ఎల్‌పీజీ ఇస్త్రీపెట్టె ఐదు నిమిషాల్లో వేడవుతుంది. గతంలో రోజుకు 50 జతలు దుస్తులను ఇస్త్రీ చేసేవాణ్ణి. ఇప్పుడు రోజూ అవలీలగా 80 జతల దుస్తులు ఇస్త్రీ చేయగలుగుతున్నాను" అంటున్నాడు సత్య అనే ఇస్త్రీ కార్మికుడు. ఎల్‌పీజీ ఇస్త్రీపెట్టె వల్ల రోజూ రెండు నుంచి మూడు గంటల సమయం ఆదా అవడమేగాక వారికి నెలకు ఆరువేల రూపాయలు అదనపు ఆదాయం వస్తోంది. 5 కిలోలో గ్యాస్ సిలెండర్ 350 రూపాయలకు లభిస్తోంది. ఒక్క సిలెండర్ గ్యాస్‌తో ఐదు వందల నుంచి వెయ్యి జతల దుస్తులను ఇస్త్రీ చేయవచ్చు. జత దుస్తుల ఇస్త్రీకి రూపాయి ఖర్చు అవుతోంది. అదే బొగ్గుతో ఇస్త్రీ చేస్తే జతకు రెండు రూపాయలు, కరెంట్‌తో చేస్తే జతకు ఆరు రూపాయల ఖర్చు అయ్యేది. వీటివల్ల డస్ట్ ఎలర్జీలుండవు. కాలుష్యం లేదు. దుస్తుల ఫినిషింగ్ కూడా బావుంటోంది. దాంతో వినియోగదారులు కూడా ఎల్‌పీజీ ఇస్త్రీ ఉన్నచోటే తమ దుస్తులు ఇవ్వడానికి ఇష్టపడుతున్నారు.





ఆహారం-ఆరోగ్యం

# హిమోగ్లోబిన్ పెరగాలంటే...

*ఈ మధ్య అలసటగా ఉంటోందని మాస్టర్ హెల్త్ చెకప్ చేయించుకున్నాను. అన్ని రిపోర్ట్స్ నార్మల్‌గా ఉన్నాయి. కానీ రక్తం మాత్రం తక్కువగా ఉంది. ఐరన్ ఉన్న ఆహారం తినమని డాక్టర్ చెప్పారు. నేను ఎలాంటి ఆహారం తినాలో చెప్పండి. నాకు డైలీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫీసు పని ఉంటుంది.*

**- కీర్తన**

రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటం వల్ల మీకు అలసట, నీరసం ఉంటోంది. జుట్టు రాలడం, సరిగా నిద్రపట్టకపోవడం, మలబద్ధకం కూడా ఉండే అవకాశం ఉంది. హిమోగ్లోబిన్ పెరగడానికి ప్రొటీన్, ఐరన్, విటమిన్ సి అవసరం. మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటంటే...

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఒక గుడ్డు, గ్లాస్ ఆరెంజ్ జ్యూస్ తీసుకోవాలి.
- ఒక పూట తప్పనిసరిగా ఆకు కూర తినాలి.
- రోజుకు 5 నల్ల ఖర్జూరాలు తీసుకోవాలి.
- వారానికి రెండుసార్లు బోన్ సూప్ తాగాలి.
- రోజువారి ఆహారంలో కందిపప్పు బదులుగా మైసూరు పప్పు (ఎర్రపప్పు) వాడాలి. ఇందులో ఐరన్ శాతం ఎక్కువ ఉంటుంది.
- స్నాక్స్‌లో అటుకుల ఉప్మా లేదంటే అటుకుల మిక్చర్ లేదా అటుకులు, అరటిపండు, బెల్లం, పాలు కలుపుకొని తీసుకోవాలి.

ఇలా చెయ్యడం వల్ల మూడు నెలల్లో మీ హిమోగ్లోబిన్ శాతం నార్మల్‌కు వచ్చేస్తుంది.





• డాక్టర్ బి.జానకి, న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

# ముత్యాల ముగ్గు



ఎన్.అనూరాధ
చైతన్యపురి, హైదరాబాద్
21 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు



ఎమ్.దేవి
తెనాలి
21 చుక్కలు
సందు
11 వచ్చే వరకు



టి.సరిత
మంచిర్యాల
15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకు



బి. దీప, తిరుపతి
18 చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు

మీ ముత్యాల ముగ్గులతో పాటు మీ పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.
**మా చిరునామా...** నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

నవ్య ఆంధ్రజ్యోతి యంగ్
శనివారం ● 14 డిసెంబర్ 2019
6



# ఈ యాప్స్‌తో సేఫ్

**ఎప్పుడు ప్రమాదం వచ్చిపడుతుందో తెలియని ఈ రోజుల్లో ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండటమే శ్రేయస్కరం. ముఖ్యంగా మహిళలు తమ స్మార్ట్‌ఫోన్లలో కొన్ని యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా తమ ప్రతి కదలికను ఆప్తులకు చేరవేయవచ్చు. అత్యవసర సమయాల్లో సహాయం అందుకోవచ్చు. అలాంటి కొన్ని యాప్స్ వివరాలు..**

ఆపత్కర పరిస్థితుల్లో కొన్ని క్షణాల వ్యవధి మాత్రమే లభించవచ్చు. అలాంటి సమయంలో ఆప్తులకు ఒక్క సందేశం పంపించగలిగితే ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఇందుకోసం 'ఐ వాచ్ ఎస్ఓఎస్ ఫర్ ఉమన్' యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్‌లో ఒక్క బటన్‌ను ప్రెస్ చేస్తే చాలు. మీ చుట్టుపక్కల పరిసరాలను వీడియో తీసి రిజిస్టర్ చేసుకున్న ఫోన్ నెంబర్లకు అత్యవసర సందేశం వెళుతుంది. ఆడియో సైతం రికార్డు అవుతుంది. మీరు ఎక్కడున్నారు? ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో స్నేహితులకు తెలియజేస్తుంది. మీరు సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకున్నాక 'ఐయామ్ సేఫ్ బటన్'ను ఎంచుకుంటే చాలు.

### అత్యవసర సందేశం పంపాలంటే..!

అత్యవసర సమయాల్లో ఫోన్ చేసి మాట్లాడే అవకాశం రాకపోవచ్చు. అలాంటప్పుడు ఫోన్‌ను షేక్ చేస్తే చాలు. లేదా మీ హెడ్‌ఫోన్స్‌ను తీసేసినా చాలు. 'ఐ గో సేఫ్లీ' యాప్‌లో సీక్రెట్ కోడ్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్ నంబర్లకు సందేశంతో పాటు మీ జీపీఎస్ పొజిషన్ చేరిపోతుంది. సీక్రెట్ కోడ్ సహాయంతో అలారంను ఆఫ్ చేసే వరకు ప్రతి నిమిషం అలా సందేశం వెళుతూనే ఉంటుంది. అంతే కాకుండా ఫోన్‌లో ఉన్న మైక్రోఫోన్ సహాయంతో ఆడియో రికార్డింగ్‌ను క్యాప్చర్ చేస్తుంది. ఆ రికార్డింగ్‌ను ఎమర్జెన్సీ నంబర్లకు పంపిస్తుంది.

### సేఫ్టీ పిన్

ముఖ్యమైన పనుంది కానీ, ఆ దారి గుండా వెళ్లాలంటే సంకోచం. అసలు వెళ్లాలా వద్దా! ముఖ్యంగా రాత్రి సమయాల్లో వెళ్లాల్సివచ్చినపుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సి వస్తుంది. అలాంటి సమయాల్లో 'మై సేఫ్టీపిన్' యాప్ మీకు ఉపయోగపడుతుంది. మీరు వెళ్లాలనుకుంటున్న మార్గంలో ట్రాఫిక్, సెక్యూరిటీ, లైటింగ్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వసతి వంటి రకరకాల అంశాలను క్రోడీకరించి, సేఫ్ లోకేషన్‌ను మీకు మార్గనిర్దేశం చేస్తుంది. ఒకవేళ మీరు సురక్షితం కాని లోకేషన్‌లోకి వెళ్లినట్లయితే బ్యాక్‌గ్రౌండ్ యాప్ యాక్టివేట్ అయి అలర్ట్స్ పంపిస్తుంది. అంతేకాకుండా ఈ యాప్ సహాయంతో అత్యవసర నంబర్లకు లైవ్ లోకేషన్‌ను షేర్ చేయవచ్చు. ట్రాక్ చేయమని కోరవచ్చు. ఆ ప్రదేశం నుంచి బయటపడటానికి ఉన్న ఇతర దారులను చూడొచ్చు.

### ఫోన్ షేక్ చేస్తే చాలు

ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మహిళలకు అండగా ఉపయోగపడే యాప్ 'షేక్‌టుసేఫ్టీ'. మొబైల్‌ను షేక్ చేయడం ద్వారా లేదా పవర్ బటన్‌ను నాలుగు సార్లు ప్రెస్ చేయడం ద్వారా రిజిస్టర్ చేసుకున్న ఎమర్జెన్సీ నంబర్లకు అత్యవసర సందేశాలు పంపొచ్చు. ఫోన్ స్క్రీన్ లాక్ చేసి ఉన్నా యాప్ పనిచేస్తుంది. ఇంటర్నెట్ కనెక్షన్‌తో పనిలేదు. ఫొటోలు, లైవ్ లోకేషన్‌ను షేర్ చేసే వీలుంది.

### లైఫ్ 360 ఫ్యామిలీ లొకేటర్

మహిళలు తమ వ్యక్తిగత సేఫ్టీ కోసం ఉపయోగించుకోదగిన యాప్ ఇది. అత్యవసర సమయాల్లో కుటుంబసభ్యులతో కనెక్ట్ కావడానికి 'ఫ్యామిలీ లొకేటర్' సాయపడుతుంది. జీపీఎస్ లొకేషన్ టెక్నాలజీ సహాయంతో రియల్ టైమ్ లొకేషన్‌ను కుటుంబసభ్యులు ట్రాక్ చేసి చూసే వీలుంది. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి సర్కిల్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకసారి యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని సర్కిల్ ఏర్పాటు చేసుకుంటే మీ లైవ్ లొకేషన్‌ను సభ్యులందరికీ షేర్ చేయవచ్చు.

### 112

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ఇది. అత్యవసర సమయాల్లో సహాయం కోసం దీన్ని ఉపయోగించవచ్చు. పోలీస్, వైద్య, అగ్నిమాపక సేవలను పొందవచ్చు. వాలంటీర్ సేవలు అందుబాటులో ఉంటాయి. అయితే ఫోన్‌లో లొకేషన్‌ను ఎనేబుల్‌లో పెట్టుకోవాల్సి ఉంటుంది. ఒక్కసారి రిజస్టర్ అయితే చాలు. మీరు పానిక్ బటన్ ఎంచుకుంటే జీపీఎస్ సహాయంతో మీరున్న ప్రదేశానికి ఎంచుకున్న సేవలు అందుతాయి. .

### హాక్ ఐ

తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టిన యాప్ ఇది. సురక్షితమైన ప్రయాణం కోసం ఈ యాప్ బాగా ఉపకరిస్తుంది. యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నాక మీరు ప్రయాణిస్తున్న మార్గాన్ని పోలీసులకు షేర్ చేస్తే మీరు సురక్షితంగా గమ్యం చేరుకునే వరకు నిఘా ఉంచుతారు. నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే దారిలోకి వెళితే వెంటనే పోలీసులు అప్రమత్తమవుతారు. అత్యవసర సమయాల్లో ఎస్ఓఎస్ బటన్ ఎంచుకోవచ్చు.

---

### టెక్ సందేహాలు

## ఫోన్‌లో టెక్ట్స్ పొందవచ్చా?

**కంప్యూటర్లో క్లిప్‌బోర్డ్‌లో కాపీ చేసే టెక్ట్స్‌ని నేరుగా ఫోన్లో పొందడానికి అవకాశం ఉందా?**

- రాజేంద్ర

గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడే వారి కోసం ప్రత్యేకంగా అనేక ఎక్స్‌టెన్షన్స్ లభిస్తున్నాయి. అలాంటి వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది క్లిప్‌క్లౌడ్ అనే ఎక్స్‌టెన్షన్. దీన్ని గూగుల్ క్రోమ్ వెబ్‌స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. అలాగే గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీనికి సంబంధించిన ఎక్స్‌టెన్షన్ ఇన్‌స్టాల్



చేసుకుంటే.. ఇకమీదట మీ పీసీలో కాపీ చేసుకున్న టెక్ట్స్ నేరుగా మీ ఫోన్‌లో పేస్ట్ చేసుకోవడానికి సిద్ధంగా లభిస్తుంది. అంతేకాదు మీ ఫోన్‌లో కాపీ చేసుకున్న డేటా కూడా, నేరుగా మీ పీసీలో ఉపయోగించుకోవటానికి లభిస్తుంది. అయితే దీన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవటానికి నామమాత్రంగా కొంత డబ్బు చెల్లించవలసి ఉంటుంది.

## అప్‌డేట్స్ కచ్చితంగా ఇన్‌స్టాల్ చేసుకోవాలా?

**విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ వాడుతున్నాను. చీటికిమాటికి అనేక అప్‌డేట్స్ వస్తున్నాయి. వాటిని ఇన్‌స్టాల్ చేసుకోకపోతే ఏదైనా ఇబ్బంది ఉంటుందా?**

- సునీల్




మైక్రోసాఫ్ట్ సంస్థ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ కోసం ఎప్పటికప్పుడు అనేక అప్‌డేట్స్ విడుదల చేస్తూ ఉంటుంది. అవి ప్రధానంగా కొత్త ఫీచర్ ప్రవేశపెట్టడంతో పాటు, ఇప్పటికే ఉన్న లోపాలను సరి చేయడం కోసం రిలీజ్ అవుతుంటాయి. ఈ నేపథ్యంలో అన్ని విండోస్ అప్‌డేట్స్ ఇన్‌స్టాల్ చేసుకోవడం మంచిది. అప్పుడు మాత్రమే మీ కంప్యూటర్‌కి పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఆపరేటింగ్ సిస్టమ్‌లలో భద్రతా లోపాలు అనేకం వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో లేటెస్ట్ అప్‌డేట్స్ ఇన్‌స్టాల్ చేసుకోవడం చాలా అవసరం.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com

---

### టెక్‌గురు

# ఇంట్లో టెక్ విప్లవం

**టెలికామ్ రంగంలో జియో రాక ఓ విప్లవంగా చెప్పుకోవచ్చు. ఫోన్ కాల్స్ కన్నా మొబైల్ డేటాను కీలకం చేసిన ఘనత జియోది. భవిష్యత్తులో అనేక విప్లవాత్మక టెక్నాలజీలను జియో అందుబాటులోకి తీసుకురానుంది. ఆ విశేషాలు ఇవి...**



ఇటీవల రిలయన్స్ జియో ఆహ్వానం మేరకు ముంబయిలోని ఆ సంస్థ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ని నేను స్వయంగా సందర్శించాను. అక్కడ ఉన్న అనేక మంది కమ్యూనికేషన్ హెడ్‌లతో సుదీర్ఘంగా చర్చించాను. 'రిలయన్స్ జియో సమీప భవిష్యత్తులో ఏం చేయబోతోంది?' ఇదీ ప్రాథమికంగా నేను వారిని అడిగిన ప్రశ్న. దానికి వారి నుంచి ఆసక్తికరమైన సమాధానం లభించింది. "కేవలం మొబైల్ డేటా అందించినంత మాత్రాన మా బాధ్యత తీరిపోయినట్లు కాదు. ఆ డేటాను మరింత శక్తివంతంగా ఉపయోగించుకోగలిగే విధంగా అనేక కొత్త టెక్నాలజీలు భారతీయ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం" అని వారు వెల్లడించారు. సమీప భవిష్యత్తులో జియో నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రాబోతున్న అనేక కొత్త టెక్నాలజీలకు సంబంధించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్మార్ట్‌హోమ్స్‌ని మన దేశంలో ప్రతి ఇంటికి అందుబాటులోకి తీసుకురావడానికి జియో ప్రయత్నాలు చేస్తోంది. హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో ఉన్నప్పుడు, దాని ద్వారా మనం నిజ జీవితంలో అన్ని రకాల సేవలు పొందాలన్నదే ఈ ప్రయత్నాల ఉద్దేశం.

### గ్యాస్ లీక్ నుంచి కార్ల వరకూ...

మీ ఇంట్లో గ్యాస్ లీక్ అవుతుంటే, మీరు ఆఫీసులో ఉన్నా కూడా వెంటనే మీ ఫోన్ స్క్రీన్ మీద సమాచారం కనిపిస్తుంది. అంతేకాదు, సింక్‌లో వాటర్ ఓవర్ ఫ్లో అవుతుంటే, ఆ విషయం కూడా మీకు మీ ఫోన్ ద్వారా రిపోర్ట్ చేయబడుతుంది. అలాగే మీ కారులో ఒక చిన్న డివైజ్ అమర్చుకుంటే చాలు, ఎప్పటికప్పుడు మీ కారు ఎక్కడ ఉందో రియల్ టైమ్ లొకేషన్ తెసుకోవడంతో పాటు, కారు ఎంత వేగంతో ప్రయాణిస్తోంది? ఏసి, విండోల కండిషన్ వంటి పూర్తి స్థాయి సమాచారం మీకు అందుబాటులో ఉంటుంది. అలాగే మీ ఇంటి గుమ్మం దగ్గర అమర్చుకున్న ఒక ప్రత్యేకమైన కెమెరా సహాయంతో డోర్ దగ్గర నిలుచుని ఉన్న వారి లైవ్ వీడియో ఫోన్ స్క్రీన్ మీద చూడొచ్చు. వారి మాటలు కూడా వినొచ్చు. అలాగే ప్రత్యేకంగా వాట్సాప్ కాల్స్ అవసరం లేకుండా, నేరుగా మీ ఇంట్లో ఉండే టీవీ ద్వారా మీ బంధువులు లేదా స్నేహితులతో వీడియో కాలింగ్ ద్వారా మాట్లాడుకోవచ్చు. రిలయన్స్ జియో సంస్థ కంటెంట్ స్ట్రీమింగ్ విషయంలో అనేక రకాల స్ట్రీమింగ్ సర్వీసులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా భారీ మొత్తంలో కంటెంట్‌ను వినియోగదారులకు అందించబోతుంది. టీవీ ముందు కూర్చుంటే మీకు కావలసినంత కంటెంట్ లభిస్తుంది.

### అంతా ఆటోమేషన్



సినిమా చూద్దామని హాల్లో టీవీ ముందు కూర్చున్నారనుకుందాం. సినిమా చూసేటప్పుడు థియేటర్ అనుభూతి కలగడం కోసం లైట్లు ఆర్పేయడం, అవసరాన్ని బట్టి ఏసీ, టెంపరేచర్ మార్చుకోవడం.. ఇలా మీకు నచ్చినట్టు సెట్ చేసుకుంటారు కదా! వీటన్నిటి కోసం ఇప్పటివరకు ప్రత్యేకంగా విడివిడిగా పనిచేయాల్సి ఉంటుంది. కానీ జియో ఆఫీస్‌లో టీవీ ఆన్ చేసి ఒక సినిమాను ఎంపిక చేసుకున్న వెంటనే ఆటోమేటిక్‌గా రూమ్‌లో లైట్లు ఆగిపోయాయి. ఏసీ, టెంపరేచర్ మారిపోయింది. ఇంకా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. నిజంగా సినిమా థియేటర్‌లో కూర్చున్న అనుభూతి పొందాను. ఒకదానితో మరొకటి కనెక్ట్ అయిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డివైజెస్ కారణంగా ఇదంతా సాధ్యపడుతోంది. మరో రెండు మూడేళ్లలో ఇదే రకమైన అనుభూతి ప్రతి భారతీయ వినియోగదారుడు తమ ఇంట్లో పొందగలుగుతారు. సినిమాలు చూసేటప్పుడు మాత్రమే కాదు, పడుకునేటప్పుడు గది వాతావరణం ఎలా ఉండాలి, ఎవరైనా గెస్టులు వచ్చినప్పుడు ఎలా ఉండాలి వంటి అనేక రకాల సెట్టింగ్స్ ప్రొఫైల్స్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. ఆయా సందర్భాల్లో ఒకే ఒక బటన్‌తో ప్రొఫైల్ సెలెక్ట్ చేసుకుంటే వాతావరణం మొత్తం మారిపోతుంది.

### కిరాణా స్టోర్‌ల విషయంలో

కిరాణా స్టోర్‌లకి మరింత బిజినెస్ జరిగే విధంగా రిలయన్స్ జియో కొత్త టెక్నాలజీ తీసుకురానుంది. 'న్యూ కామర్స్' పేరుతో దీన్ని అందుబాటులోకి తేనుంది. మొదట జియో ప్రతినిధులు దేశ వ్యాప్తంగా ఉన్న అనేక కిరాణా స్టోర్లని సందర్శించి, అక్కడ ఉండే స్టాక్ మొత్తాన్ని ఒక ప్రత్యేకమైన ఈ-స్టోర్‌లో పొందుపరుస్తారు. వినియోగదారులు తమకు కావాల్సిన సరుకులను రిలయన్స్ జియో విడుదల చేసే ఒక మొబైల్ అప్లికేషన్‌లో ఆర్డర్ చేస్తే చాలు.. ఆ వినియోగదారుడికి అతి సమీపంలో ఉన్న కిరాణా స్టోర్‌కి ఆ ఆర్డర్ వివరాలు వెళతాయి. వారు దాన్ని స్వీకరించి కస్టమర్లకు వస్తువులు డెలివరీ చేస్తారు. ఒకవేళ వినియోగదారుడికి కావలసిన అన్ని వస్తువులు ఆ స్టోర్‌లో లేకపోతే వారి వద్ద లేని వస్తువులు, ప్రతీ నగరంలో రిలయన్స్ ప్రత్యేకంగా నెలకొల్పే గోడౌన్ ద్వారా పంపించడం జరుగుతుంది.

టెలికామ్ వ్యవస్థలో ఒక బలమైన ఎకో సిస్టం నిర్మించడం కోసం రిలయన్స్ జియో అందుబాటులోకి తీసుకువస్తున్న కొత్త టెక్నాలజీలు ఇవి. ఇంకా అనేక కొత్త ఆవిష్కరణలు మున్ముందు వచ్చే అవకాశం ఉంది. మిగతా టెలికామ్ సంస్థలు కూడా పోటాపోటీగా ఇలాంటి కొత్త ఆవిష్కరణలు వినియోగదారులకు అందించడం కోసం ప్రయత్నాలు చేసినప్పుడు మాత్రమే ఇంటర్నెట్ వినియోగం మరింత ప్రయోజనకరంగా మారుతుంది.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

---

### చేసేయండి!



ఇంట్లో పాత గాజులుంటే బయట పడేస్తాం. కానీ వాటితో పెన్నులు, పెన్సిళ్లు పెట్టుకోవడానికి స్టాండ్ తయారుచేసుకోవచ్చు.

**కావలసినవి**

- పాతగాజులు
- జిగురు
- దళసరి అట్ట
- కత్తెర
- పెన్సిల్

## గాజులతో స్టాండ్

- ఒక గాజును తీసుకొని దళసరి అట్టపై ఉంచండి. దానిచుట్టూ పెన్సిల్‌తో గీత గీయండి.
- గీత గీసిన మేరకు కత్తెరతో అట్టను కత్తిరించండి.
- తరువాత ఆ అట్ట ముక్కను జిగురుతో గాజుకు అతికించండి.
- ఆ గాజుపై మరో గాజు... ఇలా వరుసగా నాలుగైదు గాజులు ఒకదానిపై మరొకటి అతికించండి.
- జిగురు ఆరేంత వరకు గాజులు కదలకుండా చూసుకోవాలి.
- రకరకాల రంగుల్లో, డిజైన్లలో ఉన్న గాజులు ఎంచుకుంటే స్టాండ్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
- గాజులు పాతవైతే వాటికి రంగులు వేయవచ్చు. పూసలు, చమ్కీలు అద్ది ఆకట్టుకునే స్టాండ్ తయారు చేసుకోవచ్చు.




### బొమ్మ గీయండి



### పదాలు సరిచేయండి



utryke
owc
rafgife
eykomn
grof

### సరైన నీడను గుర్తించండి



### పదాలను పట్టికలో కనిపెట్టండి




| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| A | H | S | O | R | D | I | P | N | E | E |
| F | O | O | T | B | A | L | L | E | R | G |
| F | I | X | P | P | S | O | F | E | S | Y |
| I | R | B | O | X | I | N | G | I | F | M |
| R | D | I | L | I | D | R | R | Y | L | N |
| B | A | D | M | I | N | T | O | N | U | A |
| M | E | N | C | E | R | I | L | O | T | S |
| A | S | H | O | C | K | E | Y | O | E | T |
| K | A | R | A | T | E | T | P | K | O | I |
| T | E | M | A | O | U | R | I | N | E | C |
| M | B | A | S | C | E | T | B | A | L | L |

### డైలీ సుడోకు -223

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | | | 6 | 9 | | | 1 | |
| | 5 | | | | | 2 | | |
| | | | | | 1 | 6 | | |
| 8 | 1 | 7 | 3 | | | | | |
| | | | 5 | | 4 | | | |
| | | | | | 7 | 8 | 9 | 3 |
| | | 3 | 7 | | | | | |
| | | 9 | | | | | 8 | |
| | 6 | | | 5 | 8 | | | 4 |

**సుడోకు - 222 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 6 | 2 | 4 | 8 | 3 | 1 | 7 | 9 |
| 8 | 3 | 1 | 2 | 9 | 7 | 6 | 4 | 5 |
| 9 | 7 | 4 | 6 | 1 | 5 | 8 | 2 | 3 |
| 7 | 9 | 6 | 1 | 3 | 4 | 5 | 8 | 2 |
| 3 | 2 | 5 | 7 | 6 | 8 | 9 | 1 | 4 |
| 4 | 1 | 8 | 9 | 5 | 2 | 3 | 6 | 7 |
| 2 | 8 | 9 | 3 | 4 | 6 | 7 | 5 | 1 |
| 6 | 4 | 3 | 5 | 7 | 1 | 2 | 9 | 8 |
| 1 | 5 | 7 | 8 | 2 | 9 | 4 | 3 | 6 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
'DIL' RAJU PRODUCTION
ADITYA MUSIC
JUKEBOX OUT NOW
U r my heart beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
Enjoy Full Songs on
YouTube /adityamusic


COMING SOON..
రూలర్
సి. కళ్యాణ్ కె. యస్. రవికుమార్
ఈ రోజు
14-12-2019


FINAL LAP
OF SHOOTING...
A 'MAESTRO' ఇళయరాజా MUSICAL
క్లాప్
THE SOUND OF SUCCESS
రచన & దర్శకత్వం
పృథ్వీ ఆదిత్య


VIACOM 18 STUDIOS
Parallel Minds
RELEASING
20TH
DECEMBER
KARTHI JYOTIKA SATHYARAJ
దొంగ
A JEETHU JOSEPH FILM
RAVURI. V .SRINIVAS
U/A


SKF
RELEASING ON
DEC 20TH
ఆటకైనా వేటకైనా రెడీ
దబంగ్ 3
దర్శకత్వం: ప్రభుదేవా


BIGGEST FAMILY ENTERTAINER
SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
వెంకీ మామ


RANA DAGGUBATI SAI PALLAVI
D.SURESH BABU PRESENTS
విరాటపర్వం
[VIRAATAPARVAM]
WRITTEN & DIRECTED BY VENU UDUGULA PRODUCED BY SUDHAKAR CHERUKURI
REVOLUTION IS AN ACT OF LOVE

| సెన్సెక్స్ (428.00 ↑) | నిఫ్టీ (114.90 ↑) | బంగారం (103 ↓) | వెండి (కిలో) (150 ↑) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 41,009.71 | 12,086.70 | 37,827 | 43,880 | 70.83 | 64.92 |

బంగారం: ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

## ‘శక్తి’ మహిళ

# నిర్మలా సీతారామన్



## ఫోర్బ్స్ జాబితాలో 34వ స్థానం

### రోష్నీ నాడార్, కిరణ్ మజుందార్ షాకూ చోటు

న్యూయార్క్: ఫోర్బ్స్ అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో భారత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు చోటు లభించింది. 2019 సంవత్సరానికిగాను ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది అత్యంత శక్తిమంతమైన మహిళలతో కూడిన జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది. ఇందులో నిర్మలా సీతారామన్‌కు 34వ స్థానం లభించింది. 60 ఏళ్ల వయసున్న నిర్మలా ఈ జాబితాలో మొదటిసారిగా స్థానం దక్కించుకున్నారు. అంతేకాకుండా ఈ జాబితాలో స్థానం పొందిన తొలి భారత మహిళా ఆర్థిక మంత్రిగా కూడా నిర్మలా సీతారామన్ నిలిచారు. ఈమె ఇంతకు ముందు రక్షణ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కూడా కొంత కాలం ఈ బాధ్యతలు నిర్వర్తించారు. కాగా తొలి పూర్తి స్థాయి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొనసాగుతున్నారు.

- ఈ జాబితాలో జర్మన్ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ (65 ఏళ్లు) వరుసగా తొమ్మిదో ఏడాది కూడా అగ్రస్థానంలో నిలువడం విశేషం. రెండో స్థానంలో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రెసిడెంట్ క్రిస్టినా లగార్డే నిలిచారు. మూడో స్థానాన్ని యూఎస్ ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ దక్కించుకున్నారు.
- బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా 29వ స్థానంలో ఉన్నారు.
- బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కో చైర్‌పర్సన్ మెలిండా గేట్స్ ఆరో స్థానంలో ఉన్నారు.
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు, ఆయన సలహాదారు ఇవాంకా 42వ స్థానంలో నిలిచారు.
- టెన్నిస్ స్టార్ సెరీనా విలియమ్స్ 81వ స్థానంలో ఉన్నారు.
- ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, వ్యాపారం, ధాతృత్వం, మీడియా వంటి వంటిలో నాయకత్వ స్థానాల్లో ఉన్న వారిని ఫోర్బ్స్ తన జాబితాలో చోటు కల్పించింది.



హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఫోర్బ్స్ జాబితాలో 54వ స్థానంలో నిలిచారు. ఈమె వయసు 38 ఏళ్లు. 890 కోట్ల డాలర్ల విలువైన టెక్నాలజీ కంపెనీలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే బాధ్యత ఈమె చేతిలో ఉంది. కంపెనీ సీఎస్ఆర్ కమిటీ చైర్మన్‌గా కూడా మల్హోత్రా ఉన్నారు. శివ్ నాడార్ ఫౌండేషన్ ట్రస్టీగా కూడా ఉన్నారు.



బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా (66 ఏళ్లు)కు 65వ స్థానం లభించింది. ఈమె భారత్‌లో స్వతహాగా అత్యంత సంపన్నురాలిగా ఎదిగింది. 1978 సంవత్సరంలో దేశంలోనే అతిపెద్ద బయోఫార్మాసూటికల్ కంపెనీ బయోకాన్‌ను స్థాపించింది. ఈ కంపెనీ క్రమంగా విస్తరిస్తూ మనుషుల ప్రాణాలను కాపాడే అనేక బయోసిమిలర్స్‌ను అందుబాటులోకి తెస్తోంది.

## ఆల్‌టైమ్ గరిష్ఠానికి విదేశీ మారక నిల్వలు

ముంబై: భారత్ విదేశీ మారక నిల్వలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. డిసెంబరు 6తో ముగిసిన వారంలో ఈ నిల్వలు 234.2 కోట్ల డాలర్లు పెరిగి 45,342.2 కోట్ల డాలర్లకు చేరాయి. సమీక్షా వారంలో బంగారం నిల్వలు 43 కోట్ల డాలర్లు పెరిగి 2,707.8 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు 50 లక్షల డాలర్లు పెరిగి 144.1 కోట్ల డాలర్లకు చేరాయి. అదే విధంగా ఐఎంఎఫ్ వద్ద భారత్ నిల్వలు 1.5 కోట్ల డాలర్లు పెరిగి 364.4 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని భారత రిజర్వు బ్యాంకు తెలిపింది.

## నవంబరు ఎగుమతులు 2,598 కోట్ల డాలర్లు

» వరుసగా నాలుగో నెలలోనూ క్షీణతే

న్యూఢిల్లీ: గత నవంబరు నెలలో భారత్ ఎగుమతులు 0.34 శాతం మేర క్షీణించి 2,598 కోట్ల డాలర్లకు చేరాయి. దిగుమతులు 12.71 శాతం క్షీణించి 3,811 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. ఫలితంగా వాణిజ్య లోటు 1,212 కోట్ల డాలర్లుగా నమోదైంది. వరుసగా నాలుగో నెలలోనూ దేశ ఎగుమతులు క్షీణించాయి. పెట్రోలియం, జెమ్స్ అండ్ జువెలరీ, లెదర్ ఉత్పత్తులు ఇందుకు కారణమని గణాంకాల ద్వారా తెలుస్తోంది. గత ఏడాది నవంబరులో ఎగుమతులు 2,607 కోట్ల డాలర్లు ఉండగా.. దిగుమతులు 4,366 కోట్ల డాలర్లుగా ఉన్నాయి. 2018 నవంబరులో వాణిజ్య లోటు 1,758 కోట్ల డాలర్లు ఉంది. ఈ ఏడాది నవంబరులో ఆయిల్ దిగుమతులు 18.17 శాతం తగ్గి 1,106 కోట్ల డాలర్లకు చేరుకోగా.. బంగారం దిగుమతులు 6.59 శాతం పెరిగి 276 కోట్ల డాలర్ల నుంచి 294 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. 30 కీలక రంగాల్లో 17 రంగాల ఎగుమతులు తిరోగమించాయి. పెట్రోలియం ఉత్పత్తులు, జెమ్స్ అండ్ జువెలరీ, పళ్లు, కూరగాయలు, లెదర్, లెదర్ ఉత్పత్తులు, రెడీమేడ్ గార్మెంట్స్ ఎగుమతులు వరుసగా 13.12 శాతం, 8.14 శాతం, 15.10 శాతం, 5.29 శాతం, 6.52 శాతం క్షీణించాయి.

## ఎన్‌బీఎఫ్‌సీలతో బ్యాంకులకు చిక్కే: మూడీస్

న్యూఢిల్లీ: బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల లిక్విడిటీ సమస్య కొనసాగడం వల్ల వాటికి రుణాలందించిన బ్యాంకుల మొండి బకాయిలు మరింతగా పెరుగుతాయని మూడీస్ అంచనా వేసింది. అలాగే ఎన్‌బీఎఫ్‌సీలపై ఆధారపడిన కంపెనీల్లో కూడా నిధుల కొరత ఏర్పడి బ్యాంకులకు గడ్డు కాలంగానే ఉంటుందని పేర్కొంది. సూక్ష్మంగా చెప్పాలంటే ఎన్‌బీఎఫ్‌సీల నుంచి కంపెనీలకు, కంపెనీల నుంచి బ్యాంకులకు ఒత్తిడి బదిలీ అవుతుందని, ఫలితంగా బ్యాంకుల ఆస్తుల నాణ్యత, లాభదాయకత, మూలధనం అన్నీ దెబ్బతిని వాటి రేటింగ్‌లపై ప్రభావం పడుతుందని వివరించింది. 2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం ఏర్పడిన నాటి నుంచి ఎన్‌బీఎఫ్‌సీలు లిక్విడిటీ కొరత ఎదుర్కొంటున్నాయి.

### ఈ ఏడాది వృద్ధి 5.6 శాతం దాటదు

ఈ ఏడాది జీడీపీ వృద్ధి రేటు 5.6 శాతం దాటకపోవచ్చని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ తాజా అంచనాలో తెలిపింది. ఉపాధి రంగంలో నెలకొన్న మందగమనం తద్వారా దేశీయ వినియోగం క్షీణించడం ఇందుకు కారణమని పేర్కొంది. వృద్ధిరేటు 2020లో 6.6 శాతానికి, 2021లో 6.7 శాతానికి చేరగలదని కూడా అంచనా వేసింది. ప్రభుత్వం ఇటీవల పలు విడతలుగా ఎన్నో సంస్కరణలు ప్రకటించినప్పటికీ అవి దేశీయ వినియోగాన్ని పెంచలేవని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ వరుసగా ఐదుసార్లు రెపోరేటును తగ్గించినా బ్యాంకులు ఆ స్థాయిలో వడ్డీరేట్లు తగ్గించకపోవడం కూడా వినియోగవ్యయం పెరగడాన్ని నిరోధిస్తున్నదని తేల్చి చెప్పింది. ఆటో రుణాల్లో ఎగవేతలు రానున్న త్రైమాసికాల్లో మరింతగా పెరిగే ఆస్కారం ఉన్నట్టు తెలిపింది.

### మార్చి నాటికి ఆర్థిక సెన్సస్ నివేదిక

దేశంలో ప్రస్తుతం నడుస్తున్న 7వ ఆర్థిక సెన్సస్ నివేదిక వచ్చే మార్చి నాటికి ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు సిఎస్‌ఇ ఇ-గవర్నెన్స్ సర్వీస్ ఇండియా తెలిపింది. ఈ సెన్సస్ నిర్వహణ కోసం కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిసారిగా సెన్సస్‌ను డిజిటల్ అప్లికేషన్ సహాయంతో నిర్వహిస్తున్నారు.

## వారాంతంలో జోష్



వారాంతం చివరి రోజు దేశీయ స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. బుల్ ఆపరేటర్ల కొనుగోళ్ల మద్దతుతో 428 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 41,009.71 వద్ద, 114.90 పాయింట్ల లాభంతో నిఫ్టీ 12,086.70 వద్ద ముగిశాయి. ఈ వారం సెన్సెక్స్ 564.56 పాయింట్లు, నిఫ్టీ 165.20 పాయింట్లు లాభపడ్డాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి తాత్కాలికంగా తెరపడబోతోందన్న వార్తలు, బ్రిటన్ ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించడం శుక్రవారం మార్కెట్‌ను పరుగులు పెట్టించాయి. ప్రతికూల ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపీ)లను మార్కెట్ ఏ మాత్రం పట్టించుకోలేదు. ఆసియా మార్కెట్లు లాభాల్లో ట్రేడవడమూ భారత మార్కెట్‌కు కలిసొచ్చింది.

# ఏపీలో 971 డొల్ల కంపెనీలు రద్దు

## 5,000 మంది డైరెక్టర్లపై వేటు

### ‘స్ట్రయిక్ ఆఫ్ డ్రైవ్’ మూడో విడత చర్యలు

### తెలంగాణలో వార్షిక నివేదికలు సమర్పించని కంపెనీలు 3,410!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 1,000 డొల్ల కంపెనీలను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) రద్దు చేసింది. నిబంధనలకు అనుగుణంగా వరుసగా రెండేళ్లపాటు వార్షిక నివేదికలు, రిటర్న్‌లను దాఖలు చేయని కంపెనీలను రద్దు చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ‘స్ట్రయిక్ ఆఫ్ డ్రైవ్’ పేరుతో 2017 నుంచి రిటర్న్‌లు, వార్షిక నివేదికలు సమర్పించని కంపెనీలను కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) రద్దు చేస్తోంది. డొల్ల కంపెనీలకు నోటీసులు ఇచ్చి రద్దు చేయడం ఇది (2019) మూడోసారి. ఆంధ్రప్రదేశ్‌లో 971 కంపెనీలను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

2016-17, 2017-18 సంవత్సరాలకు రిటర్న్‌లు, వార్షిక నివేదికలు సమర్పించని కంపెనీలకు ఆగస్టులో నోటీసులు ఇచ్చి, సమర్పణకు నెల రోజులు గడువు ఇచ్చారు. ఆ తర్వాత నోటీసులు జారీ చేశారు. రిటర్న్‌లు దాఖలు చేయని కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో 1,305 వరకూ ఉన్నట్లు అంచనా వేశారు. వీటిలో తాజాగా 971 కంపెనీలను రద్దు చేశారు. తెలంగాణలో దాదాపు 3,410 కంపెనీలు రిటర్న్‌లు, వార్షిక నివేదికలను సమర్పించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. రద్దయిన కంపెనీల వివరాలు తెలియడం లేదు. దేశ వ్యాప్తంగా 80 వేల నుంచి లక్ష కంపెనీలు ఉన్నట్లు భావిస్తున్నారు. కంపెనీల చట్టం సెక్షన్ 248 కింద కార్పొరేట్ వ్యవహారాల శాఖ కంపెనీల గుర్తింపును రద్దు చేస్తోంది.

### ఐదేళ్ల వరకూ అనర్హులు..

వరుసగా రెండేళ్లపాటు రిటర్న్‌లు, వార్షిక నివేదికలు సమర్పించని కంపెనీలను రద్దు చేస్తే.. 2015-16 నుంచి వరుసగా మూడేళ్లపాటు వీటిని సమర్పించని కంపెనీల్లోని డైరెక్టర్లపై ఆర్ఓసీ వేటు వేసింది. కంపెనీల చట్టంలోని 164 సెక్షన్ ప్రకారం వీరిని అనర్హులుగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 5,000 మంది డైరెక్టర్లను తొలగించింది. ఈ విధంగా తొలగించిన డైరెక్టర్లు ఆ కంపెనీలోనేకాక ఏ కంపెనీలో కూడా డైరెక్టర్లుగా పని చేయడానికి వీలు లేదు. ఐదేళ్ల వరకూ డైరెక్టర్లుగా పని చేయడానికి వీలు లేకుండా అనర్హత వేటు వేసింది. ఇది నవంబరు 2019 నుంచి అమలులోకి వచ్చింది. ఒకవేళ ఏదైనా కంపెనీలో డైరెక్టర్‌గా కొనసాగితే.. ఏడాదిపాటు జైలు శిక్ష లేదా రూ.5 లక్షల వరకూ జరిమానా లేదా రెండూ విధించవచ్చు. రద్దయిన డైరెక్టర్లలో అక్షయ గోల్డ్ కంపెనీ, అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీలు, బిట్ కాయిన్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ తదితర కంపెనీలకు చెందిన డైరెక్టర్లు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 30,000 కంపెనీలు నమోదై ఉండగా.. 20,000 కంపెనీలు చురుగ్గా పని చేస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో ‘స్ట్రయిక్ ఆఫ్ డ్రైవ్’ మూడో విడత ప్రారంభమైనప్పుడు దేశ వ్యాప్తంగా 4-5 లక్షల మంది డైరెక్టర్ల గుర్తింపు రద్దు కాగలదని అంచనా వేశారు. అంతకు ముందు జరిగిన రెండు విడతల్లో దాదాపు 10 లక్షల డైరెక్టర్లపై వేటు పడింది. మూడో విడతలో తెలుగు రాష్ట్రాల్లో 10 వేల డైరెక్టర్ల గుర్తింపు రద్దు కాగలదని భావించారు.

### బ్యాంకు ఖాతాలు బంద్

గత రెండు విడతల్లో నిబంధనలకు అనుగుణంగా లేని కంపెనీలను రద్దు చేసినప్పటికీ.. ఆయా కంపెనీల బ్యాంకు ఖాతాల జోలికి వెళ్లలేదు. తాజాగా తొలిసారి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)ల సహకారం, సమన్వయంతో రద్దు చేసిన కంపెనీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు. ఏపీలో రద్దయిన 971 కంపెనీల బ్యాంకు ఖాతాలను ఒకేసారి సీజ్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన న్యాయపరమైన ఇబ్బందులు, ఎన్‌సీఎల్‌టీ వివాదాలకు తావు లేకుండా.. రద్దు చేసే కంపెనీల జాబితాను ఎన్‌సీఎల్‌టీకి పంపారు. ఆదాయపు పన్ను, జీఎస్‌టీ అధికారులకు కూడా సమాచారం అందించి, వారు పచ్చజెండా ఊపిన తర్వాత డొల్ల కంపెనీలను ఆర్ఓసీ రద్దు చేసింది.

## హైదరాబాద్‌లో స్విస్ కంపెనీ పరిశోధన కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్విట్జర్లాండ్‌కు చెందిన ఎండ్రెస్ ప్లస్ హౌసర్ కంపెనీ హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇండస్ట్రియల్ ప్రాసెస్ ఇంజినీరింగ్ రంగంలో ఉత్పత్తులు, సొల్యూషన్లను అందిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై ఈ కేంద్రం దృష్టిసారిస్తుందని ఎండ్రెస్ ప్లస్ హౌసర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కైలాశ్ దేశాయ్ తెలిపారు. తెలంగాణలో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు ఎండ్రెస్ సేవలు అందించింది. కంపెనీ ముంబై కేంద్రంగా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం 250 మంది ఉద్యోగులు ఉన్నారని.. భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా పెంచుతామని కైలాశ్ వివరించారు. గ్లోబల్ తయారీ యూనిట్లు ఔరంగబాద్‌లో ఉన్నాయి.



## 6 సెకన్లలో 100 కిలో మీటర్ల వేగం

» మార్కెట్లోకి పోర్షే ‘కయానే కూపే’

లగ్జరీ స్పోర్ట్స్ కార్ల దిగ్గజం పోర్షే శుక్రవారం మార్కెట్లోకి కొత్త కయానే కూపే మోడల్‌ను విడుదల చేసింది. ఇందులో కయానే కూపే ధర రూ.1.32 కోట్లు ఉండగా.. కయానే టర్బో కూపే వేరియంట్ ధర రూ.1.98 కోట్లుగా ఉంది. మూడు లీటర్ల వీ6 టర్బో ఇంజన్ 340 హార్స్‌పవర్‌ను కలిగి ఉంది. ఈ కారు 0 నుంచి 100 కిలో మీటర్ల వేగాన్ని 6 సెకన్లలోనే అందుకుంటుంది.

ధర రూ.1.32 కోట్లు



## సుజుకీ హయబుసా 2020 ఎడిషన్

సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తన ప్రీమియం బైక్ హయబుసాలో 2020 ఎడిషన్‌ను శుక్రవారంనాడు విడుదల చేసింది. మెటాలిక్ థండర్ గ్రే, క్యాండీ డేరింగ్ రెడ్ రంగుల్లో లభించే ఈ బైక్ ధర రూ. 13,74,941 (ఎక్స్‌షోరూమ్). ఫోర్ స్ట్రోక్ ఫ్యూయల్ ఇంజక్షన్, లిక్విడ్ కూల్డ్ డీఓహెచ్‌సీ కలిగిన పవర్ ఫుల్ ఇంజన్ ఉండటం వల్ల ఈ బైక్ మరింత ఎక్కువ మంది వినియోగదారులను ఆకట్టుకునే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది.

ధర రూ.13.74 లక్షలు



## వోల్వో నుంచి ఎక్స్‌సీ40 టీ4 ఎస్‌యూవీ

స్వీడన్ లగ్జరీ కార్ల కంపెనీ వోల్వో కార్స్.. ఎక్స్‌సీ40 టీ4 ఆర్-డిజైన్ పేరుతో శుక్రవారం నాడు ఎస్‌యూవీ మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.39.9 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఈ మోడల్ బీఎస్-6లో కూడా లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఇందులో 2 లీటర్ ఇంజన్ ఉంది. టూ జోన్ క్లైమేట్ కంట్రోల్, స్మార్ట్‌ఫోన్లకు వైర్‌లెస్ చార్జింగ్, పవర్ టెయిల్ గేట్, ఆండ్రాయిట్ ఆటో, యాపిల్ కార్‌ప్లేతో కూడిన 12.3 అంగుళాల క్లస్టర్, ముందు వెనుకలకు పార్కింగ్ అసిస్ట్ వంటి అధునాతన ఫీచర్లను ఈ ఎస్‌యూవీలో సమకూర్చినట్టు వోల్వో వెల్లడించింది.

ధర రూ. 39.9 లక్షలు

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 13వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 425 | విశాఖపట్నం | 470 |
| 14వ తేదీకి.. | | వరంగల్ | 428 |
| చిత్తూరు | 458 | డజను గుడ్లు రూ. 66 | |
| గోదావరి | 452 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 85 | విజయవాడ | 94 |
| వరంగల్ | 87 | గుంటూరు | 94 |
| మహబూబ్‌నగర్ | 85 | ఒంగోలు | 96 |
| కరీంనగర్ | 85 | చిత్తూరు | 88 |
| కర్నూలు | 85 | నెల్లూరు | 88 |
| విశాఖపట్నం | 95 | అనంతపురం | 79 |
| గోదావరి | 92 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 37,940 | 38,750 | 38,900 | 38,800 | 37,880 |
| క్రితం ముగింపు | 37,790 | 38,800 | 39,110 | 38,800 | 37,820 |
| 22 క్యారెట్లు | 36,110 | 35,900 | 35,700 | 36,010 | 36,000 |
| క్రితం ముగింపు | 35,960 | 36,000 | 35,980 | 35,960 | 36,020 |
| వెండి (కిలో) | 44,100 | 45,000 | 45,000 | 45,000 | 47,300 |
| క్రితం ముగింపు | 43,900 | 44,600 | 45,000 | 44,900 | 46,900 |

# మరిన్ని ఉద్దీపన చర్యలు

» జీఎస్‌టీ రేట్ల పెంపుపై ఇంకా చర్చించనేలేదు
» నా ఆఫీసులో తప్ప అంతటా అదే చర్చ
» కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు, పరిశ్రమ సమస్యల పరిష్కారానికి అవసరమైతే మరిన్ని ఉద్దీపన చర్యలు చేపడతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. రాష్ట్రాలకు పెండింగ్‌లో ఉన్న జీఎస్‌టీ పరిహారం చెల్లింపుల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జీఎస్‌టీ రేట్లు పెంచవచ్చన్న ఊహాగానాలపైనా మంత్రి స్పందించారు. నా ఆఫీసులో తప్ప అంతటా ఇదే మాట వినబడుతోందన్నారు. అయితే, రేట్లు పెంచడం లేదని మాత్రం ఆమె చెప్పలేదు. ఈ విషయంలో తన మంత్రిత్వ శాఖ ఇంకా ఆలోచన చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 18న జరగబోయే జీఎస్‌టీ మండలి సమావేశంలో పన్ను రేట్లను పెంచవచ్చన్న ఊహాగానాలు నెలకొన్నాయి. 5 శాతం శ్లాబ్ రేటును 6-8 శాతానికి పెంచవచ్చని, 12 శాతం పన్ను రేటును 15 శాతానికి పెంచవచ్చని తెలుస్తోంది. 12 శాతాన్ని 18 శాతం శ్లాబులో విలీనం చేయవచ్చన్న వాదన కూడా వినవస్తోంది.

ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత స్థితిగతులపై వివరించేందుకు ఢిల్లీలోని జాతీయ మీడియా కేంద్రంలో శుక్రవారం ఆర్థిక మంత్రిత్వ శాఖ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఆర్థిక మంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కేవీ సుబ్రమణియన్, రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే, తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో మంత్రి ఇంకా ఏమన్నారంటే..

- ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ స్టాగ్‌ఫ్లేషన్ దశలోకి ప్రవేశించిందా అన్న ఊహాగానాలపై వ్యాఖ్యానించదలుచుకోలేదు.
- ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఏ దశలో ఉందన్న విషయంపై చర్చించదలుచుకోలేదు. నా దృష్టంతా పరిస్థితులను మెరుగుపర్చడంపైనే.
- దివాలా కోడ్‌పై ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోంది.
- సోమవారం నుంచి బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు ప్రారంభమవుతాయి.
- ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై వస్తున్న ఊహాగానాలను పట్టించుకోదలుచుకోలేదు.
- ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయన్న వార్తలొస్తున్నాయి. ప్రభుత్వం కూడా దిగుమతి చేసుకుంటోంది.

### కార్పొరేట్ పన్ను తగ్గింపు ఫలితాలపై 15న స్పష్టత

- కార్పొరేట్ పన్ను తగ్గింపు ప్రభావంపై ఈ నెల 15న స్పష్టత రానుందని రెవెన్యూ కార్యదర్శి పాండే అన్నారు. ఎందుకంటే, కంపెనీలు ముందస్తు పన్ను చెల్లింపులు జరిపేందుకు అదే ఆఖరి రోజు. ఇక ఆదాయ పన్ను డిపార్ట్‌మెంట్ నుంచి డాక్యుమెంట్ ఐడెంటిఫికేషన్ నంబరు(డిన్) లేకుండా వచ్చే ఏ డాక్యుమెంట్‌కూ చట్టబద్ధత ఉండదని, దానికి స్పందించాల్సిన అవసరం లేదన్నారు.

### వినియోగం పెంపుపై ఫోకస్: సీఈఏ

మార్కెట్లో వినియోగం పెంచడం ద్వారా మందగమనంలోకి జారుకున్న వృద్ధికి ఊతమివ్వడంపై ప్రభుత్వం దృష్టిసారించిందని సీఈఏ సుబ్రమణియన్ తెలిపారు. వృద్ధికి మద్దతివ్వడంతోపాటు ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చేందుకు ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. పాక్షిక రుణ హామీ పథకం కింద ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్‌ఎఫ్‌సీలకు ప్రభుత్వం మద్దతుగా నిలిచిందని తెలిపారు. రిటైల్ రుణాల వితరణ పెంచేందుకు వీలుగా ఈ రెండు విభాగాల సంస్థలకు రూ.4.47 లక్షల కోట్లు జారీ చేయడం జరిగిందన్నారు. పాక్షిక రుణ హామీ పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపిన రెండ్రోజులకే రూ.7,000 కోట్లకు పైగా విలువ చేసే 17 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామని, రూ.20 వేల కోట్ల ప్రతిపాదనలకు త్వరలో ఆమోదం లభించనుందన్నారు.




## రాజధాని మార్పు ప్రతిపాదన లేదు: బొత్స

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): "అమరావతి నుంచి రాష్ట్ర రాజధానిని మార్చడానికి ఎలాంటి ప్రతిపాదన లేదు" అని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. శుక్రవారం టీడీపీ ఎమ్మెల్సీలు పమిడి శమంతకమణి, గునపాటి దీపక్‌కుమార్, పరుచూరి అశోక్ బాబు రాష్ట్ర రాజధాని మార్పుపై ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు సంధించారు. "అమరావతి నుంచి రాష్ట్ర రాజధానిని మార్చడానికి ప్రతిపాదన ఏదైనా ఉందా?, ఇప్పటి వరకూ అమరావతి అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధుల వివరాలేమిటి?, రాష్ట్ర రాజధానిని మార్చడం వల్ల రాష్ట్ర ఖజానా ఆర్థిక పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి బొత్స సమాధానం చెప్పాల్సి ఉంది. కానీ మార్షల్స్ దురుసుదనం అంశంపైనే మధ్యాహ్నం వరకూ చర్చ జరిగింది. దీంతో మరే కార్యకలాపమూ సాగలేదు. చైర్మన్ ప్రశ్నలన్నింటికీ (డీమ్డ్ టూ బీ) ఆమోదం తెలిపారు. ఈ క్రమంలోనే రాజధానిని మార్చే ప్రతిపాదనలు లేవని ప్రభుత్వం చెప్పింది..

# విన్నారా.. కన్నారా!



(మొదటి పేజీ తరువాయి)

అందరితో ర్యాలీగా వచ్చారు. అలా ర్యాలీగా వచ్చినప్పుడు ఎవరు ఎవరో చూసుకోవాలి. మార్షల్స్ వారి ఉద్యోగాలు వారు చేశారు. మొత్తం వీడియో క్లిప్పింగ్ చూస్తే ఎవరేమన్నారో అర్థమవుతుంది. మార్షల్‌ను బాస్టర్డ్ అన్నారు. ఒక ఉద్యోగిని అలా అంటారా' అని జగన్ ధ్వజమెత్తారు. దీనిపై చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాస్టర్డ్ అన్న పదమే తాననలేదన్నారు. తాను అంత పరుషంగా ఎప్పుడూ మాట్లాడలేదని చెప్పారు. 'నడిరోడ్డుపై నన్ను ఉరితీయాలన్నారు.. చెప్పుతో కొట్టాలన్నారు.. ఒక మంత్రి నీ అమ్మ మొగుడు కట్టారా అన్నారు.. ఎన్ని విధాలుగా అవమానించినా, సభలో మైక్ ఇవ్వకున్నా.. ప్రజల సమస్యపై ర్యాలీ చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామనుకున్నాం. కానీ శాసనసభలోకి రావడానికి వీల్లేదంటూ గేట్లు వేసేశారు. మమ్మల్ని అవమానించి ఆనందపడాలని ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. పరిపాలనంటే ప్రతిపక్షాన్ని కూడా గౌరవించేదిగా ఉండాలి. ఎంత కోపం వచ్చినా అలాంటి మాటలు నేను మాట్లాడను. అలా మాట్లాడడం నాకు చేతకాదు. నేరాలు చేయడం కూడా నాకు చేతకాదు. గట్టిగా మాట్లాడింది వాస్తవం. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని ఇలా గేటు మూసి ఆపేసి అవమానించినందుకు ఎవరు క్షమాపణ చెబుతారు? దానిపై చెబితే నేను కూడా విచారం వ్యక్తం చేయడానికి సిద్ధం' అని పేర్కొన్నారు.

### చర్యలపై సభాపతికి అధికారం

ముఖ్యమంత్రిని ఉన్మాది, మార్షల్‌ను బాస్టర్డ్ అనడమే కాకుండా.. మళ్లీ అదే పదాన్ని వాడుతున్నారని, రికార్డుల్లోంచి ఆ పదాలు తీసేయాలని మంత్రి కన్నబాబు సభాపతిని కోరారు. ఆ పదాలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు సభాపతి ప్రకటించారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. 'మార్షల్స్ ఉన్నది మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రక్షణ కోసమే. వారిని అలా తిట్టినందుకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి' అని సూచించారు. జరిగిన సంఘటనపై సభ గౌరవం కాపాడేలా నిర్ణయం తీసుకునే అధికారాన్ని స్పీకర్‌కు అప్పగిస్తూ ఆయన ఓ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీన్ని అధికారపక్ష సభ్యులు బలపరిచారు. ప్రతిపక్ష సభ్యులు కూడా మాట్లాడతామని, వివరణ ఇస్తామని కోరినా వారికి అవకాశం ఇవ్వలేదు.

### సారీ చెబితే గౌరవం: సీతారాం

'మొత్తం వీడియోలు చూశాం. ప్రతిపక్ష నేత మాట్లాడినదానిలో అన్‌పార్లమెంటరీ పదాలున్నాయి. ఒక పదానికి ప్రూఫ్ ఉంది. రెండోది.. మీరు అనలేదంటున్నారు. అదీ అన్నారని సభ అంటోంది. మూడుసార్లు సీఎంగా, ప్రతిపక్ష నేతగా పనిచేశారు. ఎంతో అనుభవం ఉంది. ఒక్కోసారి భావోద్వేగంలో స్లిప్ అవుతుంది. మనలాంటి ఉన్నత స్థానాల్లో ఉన్నవారు పొరపాటున అన్నా.. సారీ అంటే మన వ్యక్తిత్వమే పెరుగుతుంది. కాదంటే సభ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడాల్సి ఉంటుంది' అని స్పీకర్ పేర్కొన్నారు. గురువారం తమకు జరిగిన అవమానానికి ఏం చెబుతారని.. తమ మాట కూడా వినాలని ఈ సందర్భంగా తెలుగుదేశం సభ్యులు అడిగారు. 'మార్షల్స్ వ్యవహారశైలిపై వారినీ నివేదిక అడిగాను. మన హక్కులు, మన రక్షణకే మార్షల్స్ ఉన్నారు. ఈ వ్యవహారాన్ని ఇంతటితో గౌరవప్రదంగా ముగించాలి. విచారం వ్యక్తం చేస్తే హుందాగా ఉంటుంది. లేకుంటే సభ నిర్ణయానికి కట్టుబడాలి' అని తమ్మినేని స్పష్టం చేశారు. చంద్రబాబు స్పందిస్తూ.. 'సభ బయట జరిగినదానికి విచారం వ్యక్తం చేయమన్నారు. మరి నాకు జరిగిన అవమానానికి ఎవరు సమాధానం చెబుతారు. మీరన్నట్లు మూడు సార్లు సీఎంగా పనిచేశాను. అలాంటి నాకే అవమానం జరిగింది. నాకు జరిగిన అవమానానికి ఎవరు విచారం వ్యక్తం చేస్తారో చెప్పండి. తర్వాత నేనూ విచారం వ్యక్తం చేస్తా' అని పేర్కొన్నారు.

### బాబు అబద్ధాలు లెక్కించమంటే..

చంద్రబాబు, విపక్ష సభ్యులపై చర్యలు తీసుకునే అధికారాన్ని సభాపతికి అప్పగిస్తూ బుగ్గన ప్రవేశపెట్టిన తీర్మానంపై అధికారపక్ష సభ్యులు జక్కంపూడి రాజా, గొల్ల బాబూరావు, అంబటి రాంబాబు, సీదిరి అప్పలరాజు, వరప్రసాద్ తదితరులు మాట్లాడారు. జక్కంపూడి రాజా చిన్న పిట్ట కథ చెప్పారు. 'ఒక రాక్షసుడు ఈశ్వరుడి కోసం తపస్సు చేస్తే ఆయన ప్రత్యక్షమయ్యాడు. ఏం కావాలో కోరుకోమంటే.. ఆలోచించేందుకు ఐదునిమిషాలు సమయం ఇవ్వాలన్నాడు. ఆ ఐదునిమిషాల్లో ఈశ్వరుడి దగ్గరకు దేవతలు వెళ్లి.. ఆ ఘోర రాక్షసుడికి వరం ఇస్తే అందరికీ ఇబ్బంది.. ఏదో ఒకటి చేయండన్నారు. ఇంతలో ఐదునిమిషాలైంది. రాక్షసుడు వచ్చాడు. సముద్రం ఒడ్డున ఇసుక రేణువులు ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టి చెప్పు.. నువ్వు కోరుకున్న వరమిస్తానని ఈశ్వరుడు అన్నాడు. అలా వెళ్లి ఇలా లెక్కపెట్టుకుని రాక్షసుడు వచ్చేశాడు. దీంతో ఈశ్వరుడు ఆలోచించి చంద్రబాబు ఆడిన అబద్ధాలను లెక్కపెట్టి చెప్పమన్నాడు. ఆ రాక్షసుడు మళ్లీ రాలేదు. అబద్ధాలను ఇంకా లెక్కపెడుతూనే ఉన్నాడు' అని ముగించారు.

## తొలుత కలవరపడి.. ఆపై ఎదురుదాడి!

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'చీఫ్ మార్షల్‌ను ఉద్దేశించి చంద్రబాబు అంత మాట అన్నారా!'... శుక్రవారం అసెంబ్లీలో ప్రభుత్వం దాడి మొదలుపెట్టగానే విపక్షంలో ఒకరకమైన షాక్! 'ఇదెలా జరిగింది...ఎప్పుడు జరిగింది' అని తత్తరపడ్డారు. కొద్దిసేపటికి తమవైపు నుంచి తప్పు జరగలేదని నిర్ధారించుకున్నారు. ఆ వెంటనే ఎదురు దాడికి దిగారు. సభ మొదలుకాగానే... చీఫ్ మార్షల్‌ను ఉద్దేశించి చంద్రబాబు 'బాస్టర్డ్' అన్నారని, ఆయనపై చర్య తీసుకోవాలని వైసీపీ నేతలుడిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి మరీ ఈ చర్చ చేపట్టారు. సీఎం స్వయంగా నిలబడి చర్యకు డిమాండ్ చేయడంతో సభ వేడెక్కింది. ఈ పరిణామాన్ని టీడీపీ ఊహించలేదు. ప్రభుత్వపక్షం చూపించిన వీడియో వారి వద్ద ఆ సమయానికి లేదు. ఆ తర్వాత ఆ పార్టీ బ్యాక్ ఆఫీస్ బృందం ఆ వీడియోను తెప్పించుకొని పరిశీలించింది. ఆ మాట చంద్రబాబు అనలేదని సభ లోపలికి సమాచారం పంపింది. దీంతో తేరుకొన్న టీడీపీ సభ్యులు.. ప్రతిస్పందించడానికి సిద్ధమయ్యేలోపే వేరే అంశంపై చర్చ మొదలయింది.

# నేనన్నది 'నో క్వశ్చన్'

- వక్రీకరించి బాస్టర్డ్ అన్నానన్నారు
- సభాహక్కుల నోటీసిచ్చాం: చంద్రబాబు ఆగ్రహం



అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీ గేటు నుంచి లోపలకు రానివ్వకుండా చీఫ్ మార్షల్ నన్ను ఆపినపుడు.. నన్ను ఆపడానికి ఆయనెవరు..? నో క్వశ్చన్ అని నేను అన్నాను. దానిని వక్రీకరించి బాస్టర్డ్ అన్నానని పచ్చి అబద్ధపు ఆరోపణ చేసి అసెంబ్లీలో నన్ను భయంకరంగా తిట్టారు. ఈ వక్రీకరణకు ముఖ్యమంత్రి జగన్ తానే నాంది పలకడం మరీ ఘోరం' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనపై వీడియోను విలేకరుల సమావేశంలో ప్రదర్శించి చూపారు. అసెంబ్లీ చీఫ్ మార్షల్‌ను ఉద్దేశించి ఆయన 'నో క్వశ్చన్' అని అన్నట్లుగా అందులో ఉంది. 'అసెంబ్లీ సమావేశాలు పెట్టిందే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనడానికి. అందులో పాల్గొనడానికి మేం వస్తుంటే మమ్మల్ని ఆపడం ఏమిటి? గేటు మూసి చీఫ్ మార్షల్ నాతో సహా మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకున్నారు. దానికి ముందు మీడియాపై విధించిన ఆంక్షలపై అసెంబ్లీ గేటు సమీపంలో నిరసన ప్రదర్శన నిర్వహించాం. అది మా హక్కు.. ఆ ప్రదర్శన అయిపోయిన తర్వాత అసెంబ్లీ లోపలకు వస్తుంటే ఆపారు. ఆపినప్పుడు జరిగిన వాగ్వివాదానికి సంబంధించిన వీడియోను సభలో ప్రదర్శించి చూపించారు. ఇదే వీడియోను నేను ఇక్కడ చూపించాను. అందులో ఎక్కడా నేను బాస్టర్డ్ అన్నట్లుగా లేనే లేదు. నో క్వశ్చన్ అని నేనన్న మాట స్పష్టంగా వినిపిస్తోంది. దానిని వక్రీకరించి బాస్టర్డ్ అన్నానని పుట్టించి అసెంబ్లీలో అధికార పక్ష సభ్యులు నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఎస్సీలకు వ్యతిరేకమని, అధికారులకు వ్యతిరేకమని నానా మాటలు అన్నారు. అలాంటి మాటలు నా నోట్లో నుంచి రావు. దీనిపై ఏకంగా అసెంబ్లీలో తీర్మానమే చేశారు. సాధారణంగా ఇటువంటి సందర్భాలు వచ్చినప్పుడు స్పీకర్ తన చాంబర్లో అన్ని పార్టీల నేతల సమావేశం ఏర్పాటు చేసి ఏం జరిగిందో చర్చిస్తారు. వీడియోలు ఏమైనా ఉంటే అక్కడే చూస్తారు. సమస్యను అక్కడే పరిష్కరించడమో లేదా తర్వాత సభలో పరిష్కరించడమో చేస్తారు. ఇది కొన్ని దశాబ్దాలుగా అమల్లో ఉన్న సంప్రదాయం. కానీ ఈ స్పీకర్ అటువంటి ప్రయత్నమేదీ చేయలేదు. అధికార పక్షం ఆరోపణలకు ఆయన కూడా లోబడిపోయి వ్యవహరించారు. వాళ్లు చేసిన ఆరోపణ నిజమా కాదా అన్నది నిర్ధారించుకోకపోవడం సరికాదు' అని అన్నారు. అబద్ధం చెప్పి సభను తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై సభా హక్కుల నోటీసు ఇచ్చామని తెలిపారు.

### ఆ మాట పది సార్లంటా..

ఈ సంఘటన జరగడానికి ముందు రోజు ఇలాగే అసెంబ్లీ భద్రతా సిబ్బంది అడ్డుకుంటే ఉన్మాద ప్రభుత్వమని తాను వ్యాఖ్యానించిన మాట వాస్తవమని, ఈ మాటను ఎన్నిసార్లయినా అనడానికి తాను సిద్ధంగా ఉన్నానని చంద్రబాబు చెప్పారు. 'అనని మాటను పుట్టించి సభలో నన్ను తిట్టించడం ఉన్మాదం కాక మరేమిటి? మొత్తం సభంతా నా చుట్టూనే తిప్పుతున్నారు. రోజుకు పది మందికి మైక్ ఇచ్చి నన్ను నోటికి వచ్చినట్లు తిట్టించడం.. చంద్ర జపం చేయడం ఒకటే వాళ్ల చేస్తున్న పని. ఉన్మాద ప్రభుత్వమని నేను అన్నందుకు తెగ బాధపడుతున్నారు. గతంలో నన్ను పట్టుకుని చెప్పుతో కొట్టాలని, నడిరోడ్డుపై కాల్చాలని ఇదే జగన్మోహన్‌రెడ్డి మాట్లాడలేదా? ఈ ముఖ్యమంత్రికి అనుభవం లేదు. అహంకారం... ఒళ్లంతా కొవ్వు మాత్రం ఉంది. ఆయనకు తెలియకపోతే స్పీకర్‌కు తెలియదా? ఉద్యోగ సంఘాలనేతలు కూడా వాస్తవం తెలుసుకుని ప్రతిస్పందించాలి. నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడవద్దని వారికి విజ్ఞప్తి' అని చంద్రబాబు అన్నారు.

### వీరిపై ఏం చర్య తీసుకుంటారు?

స్వచ్ఛంద సంస్థ ఏడీఆర్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. వైసీపీకి చెందిన ముగ్గురు లోక్‌సభ సభ్యులు, నలుగురు ఎమ్మెల్యేలపై మహిళలపై వేధింపులు, అత్యాచారాల కేసులు నమోదై ఉన్నాయని, వారిపై జగన్ ఏం చర్య తీసుకుంటారని చంద్రబాబు ప్రశ్నించారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌పై రేప్ కేసు, రాజమండ్రి ఎంపీ భరత్‌పై భార్య పట్ల క్రూరత్వం, వరకట్నం కోసం వేధింపుల కేసు.. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌పై అత్యాచార యత్నం కేసు నమోదై ఉన్నాయని.. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డిపై కూడా ఇటువంటి కేసులే నమోదై ఉన్నాయని, ఈ ప్రజా ప్రతినిధులు తాము దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్లలోని వివరాల ఆధారంగానే ఏడీఆర్ సంస్థ తన నివేదిక విడుదల చేసిందని ఆయన తెలిపారు. అసెంబ్లీలో దీనిపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రికి కోపం వస్తోందన్నారు.



గేట్లు మూసేయడంతో మార్షల్స్‌ను నిలదీస్తున్న చంద్రబాబు, లోకేశ్



## పోలవరం రివర్స్‌తో 7500 కోట్లు నష్టం

- ఇసుక కోసం డబ్బులంటూ మేఘా లేఖ
- నాడు ఎల్2... నేడు 800 కోట్లు తక్కువకే టెండర్! : నిమ్మల విమర్శ
- నాటి లంచాలు నేడు లేవు
- అందుకే తక్కువకే టెండర్లు: మంత్రి అనిల్

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): "పోలవరం రివర్స్ టెండరింగ్‌తో రాష్ట్రానికి రూ.7,500 కోట్ల నష్టం వాటిల్లింది. రివర్స్‌కి వెళ్లకుండా ఉంటే 2022కి జల విద్యుత్ కేంద్రం పూర్తయ్యేది. ఇప్పుడు 2024కి పూర్తవుతుంది. దీనివల్ల రెండేళ్లపాటు 15000 యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోతుంది. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.5 చొప్పున లెక్కవేస్తే పై మొత్తం ఖజానాకు నష్టం వాటిల్లినట్లే" అని టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వివరించారు. శుక్రవారం అసెంబ్లీలో రివర్స్ టెండరింగ్, పారదర్శకత, అవినీతి నిర్మూలనపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడారు. పోలవరం రివర్స్ టెండరింగ్ పూర్తయ్యాక ఇసుక కోసం రూ.500 కోట్లు కేటాయించాలని మేఘా ప్రభుత్వానికి లేఖ రాసిన మాట వాస్తవమా? కాదా? అని ఆయన ప్రశ్నించారు. గతంలో పోలవరం టెండర్లలో ఎల్ 2గా నిలిచిన మేఘా ఇప్పుడెలా రివర్స్ టెండరింగ్‌లో ప్రాజెక్టును దక్కించుకుందని అడిగారు. గతం కంటే రూ.800 కోట్లు తక్కువకే ఎలా ఒప్పుకుందని రామానాయుడు నిలదీశారు. మంత్రి అనిల్ కుమార్ బదులిస్తూ... గత ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితం కాబట్టి ఈ సమస్య తలెత్తలేదన్నారు. ఇప్పుడు ఇసుకకు తమ ప్రభుత్వం ధర నిర్ణయించినందును మేఘా తమను నిధులు అడిగిందన్నారు. ఆ సొమ్ము తిరిగి ప్రభుత్వానికే వస్తుందన్నారు. మేఘా ఇప్పుడు మిగిల్చిన రూ.800 కోట్లు గతంలో పెద్ద బాబు, చిన్న బాబు, ఓడిపోయి బయట కూర్చున్న బాబుకు లంచంగా ఇవ్వాల్సి ఉండేదని అన్నారు. తమ ప్రభుత్వంలో ఆ ఊసు లేదు కాబట్టి, రివర్స్ టెండరింగ్‌లో మేఘ ప్రాజెక్టు దక్కించుకుందని అన్నారు. మొత్తం రివర్స్ టెండరింగ్‌లో ఇప్పటి వరకూ రూ.1400 కోట్లు ఆదా చేశామన్నారు.

### టూరిజం సవరణ బిల్లుకు ఆమోదం

ఏపీ పర్యాటక, సంస్కృతి, వారసత్వపు బోర్డు చట్టం-2017 బిల్లును అసెంబ్లీలో సవరించారు. దీంతో, సృజనాత్మక, సంస్కృతి కమిషన్‌కు అనధికారిక చైర్‌పర్సన్ నియామకానికి అవకాశం వచ్చింది.



ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న సీఎం జగన్

# ఉపాధి లభించేలా విద్య

- నాలుగేళ్ల డిగ్రీ, ఐదేళ్ల ఇంజనీరింగ్‌కు కసరత్తు : సీఎం

విశాఖపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువత ఏ డిగ్రీ చదివినా వెంటనే ఉపాధి లభించేలా విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురాబోతున్నామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఆంధ్ర వర్సిటీ పూర్వ విద్యార్థుల ఐదో సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఏ కోర్సు చేసినా ఉద్యోగం వచ్చేలా సిలబస్ మారుస్తామని, అందుకోసమే డిగ్రీ నాలుగేళ్లు, ఇంజనీరింగ్ ఐదేళ్లు కోర్సులుగా చేయాలని నిర్ణయించామని చెప్పారు. విద్యావ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక మార్పులు చేయాలని కలలు ఉన్నాయని, తొలి అడుగు పాఠశాలలతోనే మొదలు పెడుతున్నట్లు వివరించారు. ఎందరో మేధావులను, గొప్ప వ్యక్తులను ప్రపంచానికి అందించిన ఈ వర్సిటీ దేశంలోని విశ్వవిద్యాలయాల్లో 14వ ర్యాంకులో ఉందని, వాస్తవానికి టాప్-5లో ఉండే అర్హత ఉందన్నారు. ఆ స్థాయికి చేరుకునేలా ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని జగన్ భరోసా ఇచ్చారు. ఏయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కార్పస్ ఫండ్ రూ.50 కోట్లు సమకూర్చుకొని వస్తే... నెల రోజుల్లో మిగిలిన రూ.50 కోట్లు ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించారు. టెక్ మహీంద్రా సీఈవో గుర్నాని మాట్లాడుతూ... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీపై ఏయూతో కలిసి పనిచేయడానికి ఒప్పందం కుదుర్చుకుంటామని, ఎక్సలెన్స్ సెంటర్ పెడతామన్నారు.

# ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులా?

(మొదటి పేజీ తరువాయి)

సమీపిస్తున్నందున ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పల్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వైసీపీ పతాక రంగులు వేయడాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం ముందు శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తమ గ్రామ పంచాయతీ కార్యాలయానికి అధికార పార్టీ పతాక రంగులు వేస్తున్నారని, దానిని అడ్డుకోవాలని అభ్యర్థించారు. స్పందించిన ధర్మాసనం 'దీనిపై మీకెందుకు అభ్యంతరం? ఇందులో మీకేం నష్టం' అని ప్రశ్నించింది. త్వరలో స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, ఇలా ప్రభుత్వ భవనాలపై అధికార పార్టీ రంగులు వేయడం వల్ల ఓటర్లపై ఆ ప్రభావం పడుతుందని పిటిషనర్ తరపు న్యాయవాది వివరించారు. 'ఎన్నికలు సమీపిస్తే ఆ రంగులు ఎవరు వేశారో, వారితోనే తీసేయిస్తాం. వారితో ఎలా తీయించాలో మాకు తెలుసు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గత ప్రభుత్వ హయాంలోనూ అన్న క్యాంటీన్లకు పసుపు రంగు వేశారని అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వివరణ ఇవ్వడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ భవనాలకు అధికార పార్టీ పతాక రంగులెలా వేస్తారని ప్రశ్నించింది. ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేసింది. అన్ని వివరాలతో పది రోజుల్లోగా నివేదికను తమ ముందుంచాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రభుత్వ భవనాలపై రంగులు వేయడం ఓటర్లపై ప్రభావం చూపుతుందని, దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని పిటిషనర్‌కు సూచించింది. ప్రభుత్వ భవనాలకు రంగులు వేయకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది.

# మండలిలో మళ్లీ 'మార్షల్స్' రచ్చ!

- టీడీపీ సభ్యుల అడ్డగింత
- ఇంకోసారి చైర్మన్‌కు ఫిర్యాదు
- వీడియోల ప్రదర్శనకు టీడీపీ పట్టు
- మంత్రులు, వైసీపీ సభ్యుల అభ్యంతరం

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మార్షల్స్ అంశం శాసనమండలిని వరుసగా రెండోరోజూ స్తంభింపజేసింది. మండలి చైర్మన్ షరీఫ్ రూలింగ్ ఇచ్చినా వారు శుక్రవారం కూడా తమను ఇబ్బందులకు గురి చేశారని టీడీపీ సభ్యులు సభలో మండిపడ్డారు. మార్షల్స్ తమను అడ్డుకున్న వీడియోలను ప్రదర్శించాలని పట్టుబట్టారు. దీనిపై మంత్రులు, అధికార పక్షం అభ్యంతరం చెప్పారు. ఉదయం సభ ప్రారంభం కాగానే.. తమ సభ్యులను ఇబ్బందులకు గురి చేయడంపైన, ఉపాధి పెండింగ్ నిధులపైన టీడీపీ వాయిదా తీర్మానాలు ఇవ్వగా.. విశాఖ ఉక్కు కర్మాగారం భూములను పోస్కోకు ఇవ్వడంపై పీడీఎఫ్ సభ్యులు ఇచ్చారు. ఈ మూడింటినీ చైర్మన్ తిరస్కరించారు. అనంతరం మార్షల్స్ తీరుపై టీడీపీ ఎమ్మెల్సీ లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా సభ్యుల హక్కులకు భంగం కలిగేలా మార్షల్స్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 'మేము లోపలకు వస్తుంటే గేటు వద్దే మార్షల్స్ అడ్డుకుంటున్నారు. మేమేమీ జైలు నుంచి రావడం లేదు. మాకు 6093 ఖైదీ నంబరు లేదు. చైర్మన్ రూలింగ్‌కు విలువ లేదా..' అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై సభా నాయకుడు సుభాస్ చంద్రబోస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు తమపై అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు.

### సభ్యులకు హక్కుల్లేవా..? యనమల

మండలిలో సభ్యులకు హక్కులు లేవా అని ప్రతిపక్ష నేత యనమల ప్రశ్నించారు. హక్కులు లేనప్పుడు ఇక్కడకు వచ్చి ఏం చర్చిస్తామన్నారు. ఉదయం జరిగిన సమావేశంలో స్పీకర్ సభ్యుల హక్కుల గురించి మాట్లాడకుండా, మార్షల్స్ తప్పులేదన్నట్లు మాట్లాడారని.. ఈ సభలో సభ్యులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తామిచ్చిన వీడియోలు ప్లే చేస్తే విషయం మీకే అర్థమవుతుందని చైర్మన్‌కు చెప్పారు. ఆయనకు బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్, పీడీఎఫ్ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం మద్దతు తెలిపారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు చైర్మన్ షరీఫ్ ఇందుకు అనుమతించినా.. మంత్రులు అభ్యంతరం తెలిపారు. స్వయంగా స్పీకర్ తెప్పించుకున్న వీడియోలు మాత్రమే ప్లే చేయాలని.. ఇక్కడ టీడీపీ తారుమారుచేసి తెచ్చిన వీడియోలు ఎలా ప్రదర్శిస్తారని ప్రశ్నించారు. దీనికి స్పందించిన యనమల.. చైర్మన్ స్పీకర్ రూలింగ్ ఇచ్చిన తర్వాత అడ్డుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. ఈ వ్యవహారంపై తాను సీరియస్‌గా ఉన్నట్లు చైర్మన్ చెప్పారు. తాను ఆపొద్దని చెప్పినా మార్షల్స్ అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వీడియోలు కూడా ప్రదర్శిస్తామని స్పష్టం చేసి, సభను వాయిదా వేశారు. తిరిగి ఒంటిగంటకు ప్రారంభమైంది. ప్రభుత్వం నుంచి సీసీ ఫుటేజ్ రావలసి ఉందని, వచ్చాక రెండు వీడియోలూ ఒకేసారి ప్రదర్శిస్తామని చైర్మన్ చెప్పారు. దీనిపై టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నినాదాలు చేయడంతో చైర్మన్ సభను మళ్లీ వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైంది. ఈ సందర్భంగా వీడియో ప్రదర్శనలపై అధికార, ప్రతిపక్షాలు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో డిప్యూటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం సభను సోమవారానికి వాయిదా వేశారు. అనంతరం ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడుతూ మార్షల్స్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సభలో సై... మండలిలో ఢీ!

- అధికార పక్షానికి విపక్ష ప్రతివ్యూహం
- కలిసి వస్తున్న మండలిలో మెజారిటీ
- పోటాపోటీగా వాదనలు, ప్రతివాదనలు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో అధికారపక్షం వైసీపీ వ్యూహాలకు... మండలిలో విపక్ష టీడీపీ ప్రతివ్యూహాలు రచించి అమలు చేస్తోంది. ఒకవైపు శాసనసభలో సర్కారు చర్యలను గట్టిగా ఎదుర్కొంటూనే... మండలిలో దూకుడుగా ముందుకు వెళుతోంది. శాసన మండలిలో టీడీపీకి మెజారిటీ ఉండటం కలిసి వస్తోంది. గురువారం తమను మార్షల్స్ అడ్డుకోవడంపై టీడీపీ ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన అసెంబ్లీ చీఫ్ మార్షల్‌ను పిలిపించి విచారణ నిర్వహించారు. మరోసారి ఈ తప్పు పునరావృతం కానివ్వరాదని, ఎమ్మెల్సీల విషయంలో మర్యాదగా వ్యవహరించాలని చీఫ్ మార్షల్‌కు మండలి చైర్మన్ షరీఫ్ హెచ్చరిక జారీ చేశారు. వైసీపీకి చెందిన మంత్రులు అక్కడే ఉన్నప్పటికీ దీనిని అడ్డుకోలేకపోయారు. ఆ తర్వాత టీడీపీ ఎమ్మెల్సీల వినతితో చైర్మన్ ఒక రూలింగ్ కూడా ఇచ్చారు. ఎమ్మెల్సీలను అసెంబ్లీ భద్రతా సిబ్బంది ఆపరాదని, వారు తమ వెంట కాగితాలు వంటివి తెచ్చుకొంటున్నా స్వాధీనం చేసుకోవడం వంటివి చేయరాదని అందులో పేర్కొన్నారు. దీనిపై అధికార పక్షం అప్రమత్తమైంది. శుక్రవారం ఉదయం దీనిపై అసెంబ్లీ స్పీకర్ చాంబర్లో ఒక సమావేశం నిర్వహించి టీడీపీ ఎమ్మెల్సీలను పిలిపించారు. దీనికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి కూడా హాజరయ్యారు. భద్రతాపరమైన సమస్యలు ఉన్నందువల్ల సెక్యూరిటీ సిబ్బందికి సహకరించాలని, తనిఖీలను అడ్డుకోవద్దని స్పీకర్ వారిని కోరారు. తాము దానికి అడ్డుపడటం లేదని... అసెంబ్లీ లోపలికి రాకుండా అడ్డుకోవడం, తాము తెచ్చుకున్న పత్రాలను స్వాధీనం చేసుకుంటామనడాన్ని మాత్రం ఒప్పుకొనేది లేదని ఎమ్మెల్సీలు అన్నారు. ఈ రకంగా వ్యవహరిస్తే ఎమ్మెల్సీలపై కేసులు పెట్టాల్సి వస్తుందని మంత్రి బుగ్గన వ్యాఖ్యానించడం ఈ సమావేశంలో వేడి పెంచింది. ఇలా మాట్లాడితే ఇక సమావేశానికి అర్థం లేదని, ఎన్ని కేసులైనా పెట్టుకోండని ఎమ్మెల్సీలు కూడా తీవ్ర స్వరంతో మాట్లాడారు. స్పీకర్ వారిని సర్దుబాటు చేసి పంపారు. ఇక... శుక్రవారం అసెంబ్లీలో చంద్రబాబుపై చర్య తీసుకోవాలని అక్కడ అధికార పక్షం చర్చ మొదలు పెట్టగానే... మండలిలో టీడీపీ పక్ష నేతలు మరో వాదన లేవనెత్తారు. చైర్మన్ రూలింగ్ ఇచ్చినా శుక్రవారం అసెంబ్లీ భద్రతా సిబ్బంది తమను అడ్డుకొని అవమానపర్చారని, దానిపై చర్యలు తీసుకోవాలని వారు పట్టుబట్టారు. దీనితో మండలి రెండు మూడుసార్లు వాయిదా పడింది. ఆ తర్వాత చైర్మన్ చాంబర్లో వైసీపీ మంత్రులు, టీడీపీ పక్ష నేతల మధ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్సీలు భద్రతా సిబ్బందితో అమర్యాదకరంగా ప్రవర్తించారని, ఆ వీడియోలు మండలిలో ప్రదర్శిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. తాము కూడా తమ వద్ద ఉన్న వీడియోలు ప్రదర్శిస్తామని టీడీపీ ఎమ్మెల్సీలు చెప్పారు. దీనిపై కొంతసేపు వాదన జరిగింది. మధ్యేమార్గంగా అసెంబ్లీ తరపున ఏర్పాటు చేసిన కెమెరాల్లోని ఫుటేజీని ప్రదర్శించాలని టీడీపీ ఎమ్మెల్సీలు గట్టిగా పట్టుబట్టారు. దానిని తెప్పిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. కానీ, అది రాలేదు. దీనితో ఎటూ తేలకుండానే మండలి వాయిదా పడింది.

## మార్కెట్ కమిటీల పునర్వ్యవస్థీకరణ

- నోటిఫికేషన్ జారీ.. అభ్యంతరాలకు 7 రోజులు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తూ, ఆయా కమిటీల పరిధిలోని గ్రామాలు, మండలాలను మార్పు చేర్పులు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలను నియంత్రించే ఉద్దేశంతో గ్రామాలు, మండలాలను ఆయా కమిటీల పరిధిలో సర్దుబాటు చేసేందుకు ఈ నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిపై అభ్యంతరాలు, సూచనలను మార్కెటింగ్ కమిషనర్ ద్వారా 7 రోజుల్లో మార్కెటింగ్‌శాఖ కార్యదర్శికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతి యార్డు పరిధిలో సమీప గ్రామాలు, మండలాలను చేర్చి, దూరంగా ఉన్న వాటిని పక్క యార్డుల పరిధిలోకి చేర్చేలా 162 మార్కెటింగ్ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలు ఇందులో చేసింది.

## మాజీ ఎంపీ హర్షకుమార్ అరెస్టు


హర్షకుమార్‌ను అరెస్టు చేసి జిల్లా న్యాయమూర్తి నివాసానికి తీసుకెళ్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 13: అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌ను రాజమహేంద్రవరం త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. సెప్టెంబరు 28న రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ శాఖ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని, మహిళా ఉద్యోగులను కించపరుస్తూ మాట్లాడారన్న ఫిర్యాదు మేరకు హర్షకుమార్‌పై కేసు నమోదు చేశారు. కాగా హర్షకుమార్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ్ చక్రవర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

## సంక్రాంతి సెలవులు.. 10 నుంచి 20 వరకు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలకు జనవరి 10 నుంచి 20 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. మిషనరీ పాఠశాలలకు డిసెంబరు 24 నుంచి జనవరి 1 వరకు క్రిస్మస్ సెలవులు ఉంటాయి. పాఠశాల విద్యాశాఖ తన అకడమిక్ క్యాలెండర్‌లో ఈ మేర కు ప్రకటించింది. జూనియర్ కళాశాలలకు జనవరి 11 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని ఇంటర్ బోర్డు తన విద్యా విషయక వార్షిక ప్రణాళికలో పేర్కొంది.

## సచివాలయ సంఘ అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ సచివాలయ సంఘం అధ్యక్షుడిగా కాకర్ల వెంకటరామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు(పురుష), ఉపాధ్యక్షులు(మహిళ), కార్యదర్శి, అదనపు కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ(ఆర్గనైజేషన్), జాయింట్ సెక్రటరీ(మహిళ), జాయింట్ సెక్రటరీ(స్పోర్ట్స్), ట్రెజరర్ పదవులకు ఈ నెల 20న ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 9 మంది సభ్యులతో ప్యానల్ ఏర్పాటవుతుంది.

## రివర్స్‌గేర్‌లో విద్యుత్తు ఉద్యోగుల విభజన!

- నేడు, రేపు ధర్మాధికారి సమావేశం

హైదరాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఐదున్నరేళ్లుగా నలుగుతున్న విద్యుత్తు ఉద్యోగుల విభజన ఓ కొలిక్కివచ్చేలా కనిపించడం లేదు. ఏపీ స్థానికత కలిగిన 1,157 మంది ఉద్యోగుల్లో 613 మందిని ఏపీ తీసుకుంటే.. మిగతా వారిని తెలంగాణలో సర్దుబాటు చేసుకోవడానికి అభ్యంతరాల్లేవని తెలంగాణ విద్యుత్తు సంస్థలు స్పష్టం చేశాయి. అయితే.. ఆ 613 మందిని తీసుకోవడం పక్కనపెడితే.. అదనంగా 265 మందిని ఏపీ ఉద్యోగులను తెలంగాణకు కేటాయిస్తూ ఆ రాష్ట్ర విద్యుత్తు సంస్థలు తీసుకున్న నిర్ణయం వివాదాన్ని మలుపుతిప్పింది. దాంతో పరిష్కారం జస్టిస్ డీఎం ధర్మాధికారి చేతుల్లో కూడా లేకుండా పోయింది. ఈ వివాదాల నేపథ్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో జస్టిస్ డీఎం ధర్మాధికారి కమిటీ సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో.. రెండు రాష్ట్రాలను ఒప్పించి.. విభజన జరుగుతుందా? లేక ధర్మాధికారి తుది నిర్ణయం తీసుకుంటారా? అనేది తేలాల్సి ఉంది.

## ఏపీలో ఉద్యానవనాలకు 243 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఉద్యానవనాల పెంపకానికి 2016-17 నుంచి మూడేళ్లలో కేంద్రం వాటా కింద రూ.243.65 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజ్యసభలో బీజేపీ సభ్యుడు సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక జవాబిచ్చారు.

## వైసీపీ దాడులను అడ్డుకోండి: బీజేపీ

న్యూఢిల్లీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీలో బీజేపీ కార్యకర్తలపై వైసీపీ నేతలు చేస్తున్న దాడులను అడ్డుకోవాలని రాష్ట్ర బీజేపీ నేత దిలీప్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు.

## 'తెలుగు'పై ఏపీకి లేఖ రాస్తా: కేంద్ర మంత్రి పోఖ్రియాల్

న్యూఢిల్లీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మాతృభాష, తెలుగు మాధ్యమానికి ప్రాధాన్యం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ వెల్లడించారు. ఏపీలో తెలుగు మాధ్యమాన్ని తొలగిస్తూ ఇంగ్లీషుకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ విషయంలో కలుగ జేసుకోవాలని కోరుతూ ఏపీ బీజేపీ నేత దిలీప్ మంత్రి రమేశ్ పోఖ్రియాల్‌ను కలిసి విన్నవించారు.

## 'ఆర్‌సీఈపీ'లో భారత్ చేరలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ప్రాంతీయ ఆర్థిక భాగస్వామ్యం(ఆర్‌సీఈపీ) రూపుదిద్దుకోలేదని, దీనికి సరైన విధానం కూడా లేదని, తాము లేవనెత్తిన పలు అంశాలకు పరిష్కారం చూపలేదని, అందుకే భాగస్వామ్య ఒప్పందంలో భారత్ చేరలేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. రాజ్యసభలో వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక జవాబిచ్చారు.

## చంద్రబాబు క్షమాపణ చెప్పాలి: ఏపీ ఎన్జీవో

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ మార్షల్స్ పట్ల మాజీ సీఎం చంద్రబాబు అనుసరించిన వైఖరి బాధాకరం. ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరికాదు. ఉద్యోగ వర్గాలకు ఆయన క్షమాపణలు చెప్పాలి" అని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీఎన్జీవో కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగ సంఘాలు ఈ విషయంలో తలదూర్చవద్దని ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రకటించడాన్ని ఖండించారు.

## అన్ని స్కూళ్లలో తెలుగు తప్పనిసరి: ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొంది.

## ఆర్‌ఎంఎస్‌ఏ టీచర్లకు జీతాలు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంఎస్‌ఏ పోస్టుల్లో పనిచేస్తున్న సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాల చెల్లింపునకు ట్రెజరీ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తెలిపారు. టీచర్లకు 010 హెడ్ ద్వారా చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు.

## పీఆర్‌సీ గడువు పెంపు సరికాదు: ఆపస్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీత భత్యాల పెంపుపై ఏర్పాటైన 11వ పీఆర్‌సీకి మరో రెండు నెలలు గడువు పొడిగించడం సరికాదని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నేత రవి ప్రసాద్ అన్నారు. పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించుకుని 60% ఫిట్మెంట్‌తో వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కరువు భత్యాన్ని వెంటనే మంజూరు చేయాలన్నారు.

## హైదరాబాద్‌లో 23 నుంచి పుస్తక మహోత్సవం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పుస్తక ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే పుస్తక మహోత్సవం మరో పది రోజుల్లో మొదలవనుంది. దేశంలోనే నాలుగో అతిపెద్ద పుస్తక ప్రదర్శనగా ఖ్యాతికెక్కిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఈ నెల 23 నుంచి పది రోజుల పాటూ అలరించనుందని సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు.

## 'టిడ్కో' రివర్స్.. 46 కోట్లు ఆదా: మంత్రి బొత్స

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి ఏపీ టిడ్కో శుక్రవారం నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా రూ.46.03 కోట్లు ఆదా అయిందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇటీవల టిడ్కో తొలిసారి చేపట్టిన రివర్స్ టెండరింగ్‌లో రూ.106 కోట్లు ఆదా అయిందని, తాజా టెండరింగ్‌తో కలిపి ఈ సంస్థ ఇప్పటికి రూ.152.03 కోట్లు ఆదా చేసిందని బొత్స పేర్కొన్నారు. అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 6,496 పట్టణ పేదల ఇళ్లకు సంబంధించి మొత్తం రూ.317.45 కోట్ల అంచనా వ్యయంతో రివర్స్ టెండర్లు పిలవగా, 14.50% తక్కువకు(రూ.271.42 కోట్లు) కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేశారని తెలిపారు.

### కృష్ణకిశోర్‌పై వేటు

# కక్ష సాధింపే!



**తన కేసుల దర్యాప్తు అధికారులను సీఎం జగన్ వేధిస్తున్నారు**

- ఇది బెయిల్ నిబంధనల ఉల్లంఘనే
- వేధించే ప్రమాదం ఉందని సీబీఐ ముందే చెప్పింది
- సభలో లేవనెత్తుతామనే.. అబద్ధం పుట్టించి మాపై పడ్డారు
- చంద్రబాబు ధ్వజం

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తనపై అవినీతి కేసులను దర్యాప్తు చేసిన అధికారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కక్షగట్టారని టీడీపీ అధినేత విరుచుకుపడ్డారు. కక్ష సాధింపులో భాగంగానే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ) మాజీ సీఈవో జాస్తి కృష్ణకిశోర్‌ను సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్ కంపెనీ ఆదాయ వ్యవహారాలపై తొమ్మిదేళ్ల కింద దర్యాప్తు చేసిన ఆదాయపు పన్ను అధికారుల బృందంలో కృష్ణకిశోర్ ఒక సభ్యుడని.. అప్పట్లో ఆ బృందం అక్రమాలను నిర్ధారించడమే ఇప్పుడు జగన్ కక్షగట్టడానికి కారణమని చెప్పారు. 'రూ.10 ముఖ విలువ కలిగిన జగతి పబ్లికేషన్స్ షేర్లను రూ.360 ప్రీమియం విలువతో విక్రయించారు. ఈ లావాదేవీ ఎంతవరకూ వాస్తవమో తెలపాలని ఐటీ హైదరాబాద్ విభాగం అధికారులను 2010లో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కోరింది. ఆదాయం, ఆస్తులు లేని జగతి పబ్లికేషన్స్ షేర్‌కు ఏ విలువా లేదని, ఇంకా దాని నికర విలువ మైనస్ 18 రూపాయలని ఐటీ శాఖ తన దర్యాప్తులో తేల్చింది. ఈ లావాదేవీల కింద రూ.122 కోట్లు పన్ను చెల్లించాలని ఆ శాఖ తేల్చింది. దీనిపై జగతి అప్పీలుకు వెళ్లినప్పుడు షేర్ల విలువను కృత్రిమంగా పెంచి.. తమ (వైఎస్) ప్రభుత్వం వద్ద లాభం పొందిన వారికి వాటిని అంటగట్టి ఆదాయం గడించారని న్యాయమూర్తి తీర్పు కూడా ఇచ్చారు. తనకు వ్యతిరేక నివేదిక ఇచ్చారని కృష్ణకిశోర్‌పై జగన్ కక్ష పెంచుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ అయిన ఐఆర్‌ఎస్‌లో కృష్ణకిశోర్ అధికారి. ఆయన డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చి ఈడీబీ సీఈవోగా పనిచేశారు. ఈడీబీకి భూములిచ్చే అధికారం గానీ.. కంపెనీలకు రాయితీలిచ్చే అధికారం గానీ లేవు. కేవలం రాష్ట్రం తరపున ప్రచారం చేసి పరిశ్రమలతో సంప్రదింపులకే పరిమితం. ఏ అధికారం లేని చోట ఏం అక్రమాలు జరిగాయని ఆయన్ను సస్పెండ్ చేశారు? ఇది కక్ష సాధింపు కాదా' అని ప్రశ్నించారు.

### ఎంపీగా ఉన్నప్పుడే తారుమారు చేశారు..

జగన్ తన కేసుల్లో సహ నిందితులకు మంచి పోస్టింగులు, పదవులు ఇస్తున్నారని, ఒక నిందితురాలైన శ్రీలక్ష్మిని ఢిల్లీలో ప్రతిచోటకూ తిప్పుతున్నారని చంద్రబాబు అన్నారు. 'ఎంపీగా ఉన్నప్పుడే ఆయన సాక్ష్యాలను తారుమారు చేశారని, సీఎంగా ఉంటే ఆ అవకాశం మరింత ఉంటుందని సీబీఐ తన పిటిషన్లో ముందే చెప్పింది. ఈ పరిణామాలు దాన్ని రుజువు చేస్తున్నాయి. కేంద్ర అధికారిపై రాష్ట్ర ప్రభుత్వం నేరుగా చర్య తీసుకునే అధికారం లేకపోయినా తీసుకున్నారు. దీనిని కేంద్రం కూడా పట్టించుకోవాలి. ఈ చర్యలు జగన్ బెయిల్ తీసుకునేటప్పుడు అంగీకరించిన నిబంధనలకు కచ్చితంగా ఉల్లంఘనే. సాక్షులను బెదిరించబోమని, దర్యాప్తుకు ఆటంకం కలిగించబోమని కోర్టుకు హామీ ఇచ్చారు. తనకేసులు దర్యాప్తు చేసిన అధికారులను వేధింపులకు గురిచేయడం ఉల్లంఘన కిందకే వస్తుంది' అని స్పష్టంచేశారు. ఎక్కడ ఏ అవినీతి జరిగినా నోరు మూసుకుని ఉండాలని అధికారులకు ఈ చర్య ద్వారా సంకేతం పంపిస్తున్నారన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతామనే ఏదోఒక అబద్ధం పుట్టించి తమపై పడ్డారని, ఇది చర్చకు రాకుండా చూసుకోవాలన్న ఆరాటమే అధికార పక్షంలో కనిపించిందని చంద్రబాబు తెలిపారు.

## ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛను

**కుటుంబ పెద్ద చనిపోతే భార్యకు...**
**డయాలసిస్ చేసుకొని కిడ్నీ పేషంట్లకూ...**
**వైఎస్ఆర్ పింఛను కానుకకు కొత్త మార్గదర్శకాలు**

అమరావతి, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ పింఛను కానుక మంజూరుకు మార్గదర్శకాలు సవరిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల స్థానంలో కొత్త జీఓ అమల్లోకి వస్తుందని పేర్కొంది. దీనిప్రకారం.. అన్ని రకాల సామాజిక పెన్షన్లు పొందడానికి.. గ్రామీణప్రాంతాల వారైతే నెలకు రూ.10వేలలోపు, పట్టణాల్లోనివారు రూ.12వేల లోపు ఆదాయం ఉండాలి. ఆధార్ కార్డులో వయసును పరిగణనలోకి తీసుకుంటారు. మూడెకరాల లోపు మాగాణి లేదా 10ఎకరాల లోపు మెట్ట లేదా, మెట్ట, మాగాణి మొత్తం కలిపి 10ఎకరాల లోపు ఉన్నవారు అర్హులు. నాలుగు చక్రాల వాహనాలున్నవారికి పెన్షన్‌కు అర్హత లేదు. టాక్సీ, ట్రాక్టర్, ఆటోలు ఉన్న కుటుంబాలను మినహాయించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు సామాజిక పెన్షన్ పొందే అర్హత ఉండదు. నెలకు 300 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లు చెల్లించేవారికే పెన్షన్లు అందిస్తారు. పట్టణాల్లోని 750చ.అ.లోపు నిర్మాణాలు ఉన్నవారికి పెన్షన్ పొందే అర్హత ఉంటుంది. ఆదాయపు పన్ను చెల్లించే వారికి అర్హత ఉండదు. ప్రతి కుటుంబంలో ఒక్కరికే పెన్షన్ పొందే అర్హత ఉంటుంది. 80 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు, డయాలసిస్ పేషంట్లకు మినహాయింపునిచ్చారు. వృద్ధాప్య పెన్షనకు 60ఏళ్లు, ఎస్టీ కేటగిరికి 50ఏళ్లు ఉంటే పెన్షన్లుకు అర్హత కలిగిఉంటారు. వికలాంగులకు వయోపరిమితి లేదు. 40శాతం అంత కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు సదరం సర్టిఫికెట్ పొందాలి. చేనేతలు, కల్లుగీత కార్మికులకు 50ఏళ్ల వయోపరిమితి విధించారు. డయాలసిస్ పేషంట్లకు వయసుతో సంబంధం లేదు. 18ఏళ్ల పైబడిన ట్రాన్స్‌జెండర్లందరికీ పెన్షన్లు ఇస్తారు. మత్స్యకారులకు 50ఏళ్ల వయోపరిమితి పెట్టారు. పెళ్లై విడిగాఉన్న మహిళలు, 35ఏళ్లు దాటి భర్తతో విడిపోయి ఏడాది అయినవారికి, గ్రామాల్లో పెళ్లికాని 30 ఏళ్ల పైబడిన, పట్టణాల్లో 35ఏళ్ల పైబడిన మహిళలకు పెన్షన్లు ఇస్తారు. 50ఏళ్ల పైబడిన డప్పు కళాకారులకు, చెప్పులు కుట్టే వృత్తిలో ఉన్న 40ఏళ్లవారిని అర్హులుగా పేర్కొన్నారు. తలసేమియా, పక్షవాత వ్యాధిగ్రస్థులకు వయోపరిమితితో సంబంధంలేదు. డయాలసిస్ లేకున్నా స్టేజ్ 3, 4, 5లో కిడ్నీ పేషంట్లకు పెన్షన్లు ఇస్తారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద అర్హులను గ్రామ, వార్డు వలంటీర్లు గుర్తిస్తారు. పెన్షన్లను వారే డోర్ డెలివరీ చేస్తారు.

## ఇది బాలల హక్కుల్ని హరించడమే!

- ఇంగ్లీషు మీడియం జీవోను రద్దు చేయండి: హైకోర్టులో పిల్

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లోనూ ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో.85ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. బాలల హక్కుల్ని హరించేలా ఉన్న ఈ జీవోను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ తూర్పుగోదావరి జిల్లా రావిపాడుకు చెందిన రాంబొట్ల శ్రీనివాస సుధీష్ హైకోర్టును ఆశ్రయించారు. 'తెలుగు రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని బడుల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జీవో ఇచ్చింది. రాజ్యాంగ విరుద్ధమైన ఈ జీవో ఉచిత, నిర్బంధ విద్యాహక్కుకు తూట్లు పొడిచేలా, బాలల హక్కుల్ని హరించేలా ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఏ ప్రకారం రాష్ట్రానికి ఈ జీవో ఇచ్చే అధికారం లేదు. ఈ జీవోను రద్దు చేసి, రాష్ట్ర విద్యార్థులకు మాతృభాషలో చదువుకునే అవకాశం కల్పించండి' అని పిటిషనర్ అభ్యర్థించారు.

## ఏపీఏటీ వ్యవహారంపై తేల్చండి: హైకోర్టు

ఆంధ్రప్రదేశ్ పరిపాలన ట్రైబ్యునల్ (ఏపీఏటీ) కొనసాగింపుపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని, దీనిపై నెల రోజుల్లో తేల్చేయాలని హైకోర్టు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశించింది. లేనిపక్షంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ కార్యదర్శి నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఏటీ నిర్వహణ కోసం కేంద్రప్రభుత్వం ఇద్దరు సభ్యులను నియమించగా, రాష్ట్ర ప్రభుత్వం వారికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ వైఖరిని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైన విషయం తెలిసిందే.

## గిరిజన, దళితులపై వైసీపీ వివక్ష: ఆదివాసి సమాఖ్య



చింతపల్లి/విశాఖపట్నం, డిసెంబరు 13: గిరిజనులు, దళితులపై వైసీపీ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని భారతీయ ఆదివాసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడుతూరి రామ్‌గోపాల్ శుక్రవారం ఆరోపించారు. విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న లోతేటి శివశంకర్‌ను డీగ్రేడ్ చేస్తూ జేసీ-2గా నియమించడం అన్యాయమని ఆయన అన్నారు. రెడ్డి సామాజికవర్గం అధికారిని అందలమెక్కించేందుకు దళితుడైన డైరెక్ట్ ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను బదిలీ చేయడం వైసీపీ చూపుతున్న కుల వివక్షకు అద్దం పడుతోందన్నారు.

### బదిలీ వెనుక అధికార పార్టీ నేతల హస్తం: సీపీఎం

నిజాయితీగా పనిచేసే విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ శివశంకర్‌ను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయడం వెనుక జిల్లాలోని అధికార పార్టీ నేతల హస్తం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆరోపించారు. జేసీ బదిలీ వ్యవహారంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. భూముల విషయంలో ఆయన కచ్చితంగా వ్యవహరించడం అధికార పార్టీ నేతలకు మింగుడు పడలేదని తెలిసిందన్నారు.

## 25 వరకు 'అక్రిడేషన్' గడువు పెంచండి

- సమాచార కమిషనర్‌కు ఏపీయూడబ్ల్యూజే వినతి

అమరావతి/ఒంగోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడేషన్ నిబంధనలు సడలించి, దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సమాచారశాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డిని కలిసిన యూనియన్ నేత చందు జనార్దన్, ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేశ్‌కుమార్‌లు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుత విధానంలో జనవరి 1వ తేదీకి పూర్తిస్థాయిలో అక్రిడేషన్‌లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఆన్‌లైన్‌తో పాటు జర్నలిస్టులు నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. చిన్న పత్రికలకు జీఎస్టీ సర్టిఫికెట్ దాఖలు విధానం అమలుకు కనీసం ఏడాది గడువు ఇవ్వాలన్నారు. తిరుపతిలోని తమిళనాడు ఎడిషన్‌లకు సంబంధించిన డెస్క్ జర్నలిస్టులకు అదనంగా అక్రిడేషన్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ, అక్రిడేషన్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామన్నారు. తొలివిడతగా ఈ నెల 20 వరకు తీసుకుని అవసరమైతే మళ్లీ వారం రోజుల్లో దరఖాస్తు ప్రక్రియను పునఃప్రారంభిస్తామన్నారు. చిన్న పత్రికల వారు ఆరు నెలల జీఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలని చెప్పారు. కాగా, అవసరమైతే ఆందోళనకు సిద్ధంగా ఉండాలని జర్నలిస్టులకు ఏపీయూడబ్ల్యూజే నేతలు పిలుపునిచ్చారు.

# 'రివర్స్'లో రాజకీయం!

- అధికార పార్టీ నేతల జోక్యం
- గ్యారెంటీలు ఇవ్వకుండా అడ్డుకట్ట
- రివర్స్ టెండర్‌లో తగ్గుతున్న పోటీ
- ఖజానాకు నామమాత్రంగానే ఆదా
- నెల్లూరు పనుల్లో జరిగింది ఇదే
- మలిదేవి, డీఆర్‌డీఎం పనుల్లో స్వల్పం...
- మరో రెండు పనుల్లో భారీగా లెస్
- 'ఆంధ్రజ్యోతి' కథనాలపై స్పందన
- బీజీల సమర్పణకు మరిన్ని ఆఫీసులు

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

'రివర్స్'లో డబ్బులు ఆదా అవుతాయన్నారు! ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందన్నారు. అక్రమాలకు తావే ఉండదన్నారు. కానీ... అధికార పార్టీ నేతలు తలచుకుంటే రివర్స్‌లోనూ టెండ'రింగ్'లూ, అక్రమాలూ సాధ్యమేనని స్పష్టమైపోయింది. రాజకీయ ప్రమేయంలేని పనుల రివర్స్ టెండర్లలో సొమ్ములు ఆదా అవుతుండగా... నేతల జోక్యమున్న టెండర్లు మాత్రం యథాతథంగా సాగుతున్నాయి. నెల్లూరు జిల్లాలో పది రోజుల వ్యవధిలో నాలుగు పనుల టెండర్లను పరిశీలిస్తే... ప్రభుత్వ లక్ష్యానికి అధికార పార్టీ నాయకులు ఎలా తూట్లు పొడుస్తున్నారో అర్థమవుతుంది. రూ.73 కోట్ల అంచనాతో మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణకు శుక్రవారం రివర్స్ టెండర్లు జరిగాయి. ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసిన రోజు నుంచే ఈ పనులను దొడ్డిదారిన దక్కించుకోవడం కోసం ప్రయత్నించారు. రివర్స్ టెండరింగ్‌లో పోటీ లేకుండా చూసుకున్నారు. బ్యాంకు గ్యారెంటీలు (బీజీ)లు ఇవ్వకుండా ఇతర కాంట్రాక్టర్లను అడ్డుకున్నారు. బీజీలు సమర్పించే వీల్లేకుండా... ఇరిగేషన్ అధికారులు అందుబాటులో లేకుండా చేశారు. వెరసి... ఆన్‌లైన్‌లో ఆరుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేయగా, ఇద్దరు మాత్రమే బీజీలు ఇచ్చి, రివర్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. బిడ్‌లో 3.69 శాతం లెస్‌తో వేసిన టెండర్ ఎల్-1గా నిలిచింది. రివర్స్ టెండర్ అక్కడి నుంచి మొదలయ్యింది. రివర్స్ టెండర్ పూర్తయ్యే సరికి 4.19 శాతం లెస్‌తో వేసిన సంస్థ ఈ పనిని దక్కించుకుంది. అంటే, రివర్స్ టెండర్లలో కేవలం 0.50 శాతం మాత్రమే తగ్గిందన్నమాట. ఇందులో ఆరుమంది కాంట్రాక్టర్లు పాల్గొని ఉంటే మరింత తక్కువకు టెండర్లు దాఖలయ్యేవని అధికారులు చెబుతున్నారు. ఇందుకు పలు ఉదాహరణలు చూపుతున్నారు.

### ఇక్కడ ఇలా తగ్గాయి...

ఈ నెల 11వ తేదీన రూ.253.77 కోట్ల అంచనాతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణానికి రివర్స్ టెండర్లు జరిగాయి. 14.06 శాతం లెస్‌తో రివర్స్ టెండర్ ప్రారంభంకాగా, 26.72 శాతం లెస్‌తో టెండర్ ముగిసింది. అంటే ఈ పనిలో ప్రభుత్వ ఖజానాకు రూ.67.81 కోట్లు ఆదా అయ్యింది. వారం రోజుల క్రితం రూ.30 కోట్ల అంచనా వ్యయంతో జరిగిన చినక్రాక కాలువ నిర్మాణ టెండర్లలో సైతం 4.12 శాతం లెస్‌తో మొదలైన రివర్స్ టెండర్ 23.5 శాతం లెస్‌తో ముగిసింది. ఈ పనిలో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.7 కోట్లు ఆదా అయ్యింది. ఈ రెండు పనుల్లో అధికార పార్టీ నాయకులెవరూ జోక్యం చేసుకోలేదు. ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లందరూ రివర్స్ టెండరింగ్‌లో పాల్గొన్నారు. దీంతో... మంచి పోటీ ఏర్పడి, భారీ మొత్తంలో ఖజానాకు ఆదా అయ్యింది. శుక్రవారం జరిగిన మలిదేవి కాలువ ఆధునికీకరణ విషయంలో మాత్రం సీన్ 'రివర్స్' అయ్యింది. నామమాత్రపు మిగులుతో సర్దుకోవాల్సి వచ్చింది. అలాగే... డీఆర్‌డీఎం చానల్ రివర్స్ టెండరింగ్‌లోనూ కాంట్రాక్టర్లు పాల్గొనకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పని అంచనా వ్యయం రూ.24 కోట్లు. రూ.23.79 కోట్ల నుంచి రివర్స్ టెండర్లు ప్రారంభంకాగా, రూ.23.19 కోట్లతో ముగిసింది. ఆన్‌లైన్‌లో పాల్గొన్న కాంట్రాక్టర్లందరూ రివర్స్ టెండర్లలో పాల్గొనకపోవడంతో పెద్దగా మిగులు కనిపించలేదు. ఈ నాలుగు పనుల్లో కాంక్రీట్ శాతం ఎక్కువ ఉన్న ఆల్తూరుపాడు రిజర్వాయర్, చినక్రాక కెనాల్ పనులకు రివర్స్‌లో భారీగా ఆదాకాగా... మట్టి పని ఎక్కువగా ఉన్న డీఆర్‌డీఎం చానల్, మలిదేవి డ్రెయిన్ పనుల్లో నామమాత్రంగా తగ్గడం గమనార్హం.

### బీజీలే ఆయుధాలుగా..

రివర్స్ టెండర్లలో రింగ్ అయినట్లు ఆరోపణలున్న రెండు పనుల్లో బ్యాంక్ గ్యారెంటీలను ఆయుధాలుగా చేసుకొని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు పావులు కదిపారనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు... రివర్స్ టెండర్లలో పాల్గొనాలంటే బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వాలి. అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకులు దీనినే ఆయుధంగా మలుచుకున్నారు. కాంట్రాక్టర్లు బీజీలు ఇవ్వకుండా అడ్డుకోవడం, వారు ఇచ్చేందుకు వచ్చినా సంబంధిత అధికారి అందుబాటులో లేకుండా చూడటం ద్వారా తాము అనుకున్న వారికే పనులు దక్కేలా చూసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. బీజీలతో రివర్స్‌కు తూట్లు పొడుస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇది వరకే వెలుగులోకి తెచ్చింది. దీంతో ప్రభుత్వం స్పందించి... వాటి సమర్పణ విధానంలో మార్పులు తెచ్చింది. టెండర్లు జరిగే శాఖ కార్యాలయంలోని ఉన్నతాధికారితోపాటు... ఆయన తర్వాతి స్థానంలో ఉన్న అధికారులకు కూడా బీజీలు సమర్పించవచ్చునని తెలిపింది. దీంతోపాటు కలెక్టర్ కార్యాలయం, ఈఎన్‌సీ కార్యాలయాల్లో బ్యాంక్ గ్యారెంటీలను సమర్పించుకునేలా ఉత్తర్వులు జారీ చేసింది.

## రాష్ట్రంలో టెర్రరిస్టు పాలన: కళా



శ్రీకాకుళం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో టెర్రరిస్ట్ పాలన సాగుతోంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడం చీకటి రోజును తలపిస్తోంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాబోతోందని తెలిసి గతంలో ముంబాయికి చెందిన ఒక ఎనలిస్ట్ రాష్ట్రంలో టెర్రరిస్టు పాలన రాబోతుందని అన్నారు. జగన్ పాలనతో ఇది రుజువవుతోంది" అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు ఎద్దేవా చేశారు. వైసీపీకి ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే మేక వన్నె పులి మాదిరిగా సీఎం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు ప్రయత్నాలు చేస్తుండడం దురదృష్టకరమన్నారు.

## తమ్మినేని తనయుడు ఇసుక అమ్ముకున్నాడు: కూన



శ్రీకాకుళం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): "శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుడు 25 వేల టన్ను ల ఇసుకను అమ్ముకున్నాడు. భేతాళుడికి మనుషుల శరీరం ఎంతిష్టమో.. తమ్మినేనికి ఇసుక అంటే అంత ఇష్టం. తమ్మినేని, ఆయన కుమారుడు కలిసి విశాఖకు ప్రతిరోజు 200 లారీలను తరలించేస్తున్నారు" అని మాజీ విప్ కూన రవికుమార్ ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆమదాలవలసలోని యరగాం, పురుషోత్తపురం, పెద్దసవళాపురం నుంచి ఇసుక భారీగా తరలిస్తున్నారన్నారు. అవకాశమిస్తే సీఎం, మైనింగ్ మం త్రికి ఆధారాలతో సహా చూపిస్తానని కూన స్పష్టం చేశారు.

## అసెంబ్లీకి గంటా



అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరం టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం అసెంబ్లీకి వచ్చారు. ఈ సమావేశాల్లో ఆయన సభకు రావడం ఇదే తొలిసారి. అసెంబ్లీ చీఫ్ మార్షల్‌ను టీడీపీ పక్ష నేత చంద్రబాబు నిందించారని ఆరోపిస్తూ అధికార పక్షం చర్చ లేవనెత్తడంతో ఆ సమయంలో గంటా సభలో చంద్రబాబుతో పాటే ఉన్నారు. ఆయనతో పాటే బయటకు వచ్చిన గంటా టీడీఎల్పీలో కొంతసేపు చంద్రబాబు వద్ద గడిపారు.

## జనవరిలో జాతీయ మహిళా సదస్సు

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పద్మ

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జనవరి మొదటి వారంలో జాతీయ స్థాయి మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా కమిష న్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. రాష్ట్రంలో నిర్వహించే ఈ సదస్సులో 'ఏపీ దిశ-2019' తరహా చట్టాలు దేశవ్యాప్తంగా వచ్చేలా ఒక డిక్లరేషన్‌ను తీసుకొస్తామని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మహిళా మంత్రులతో కలిసి ఆమె మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టం దేశానికే మార్గదర్శకమని అన్నారు.

# ఇది పైశాచికానందం

**చిన్న కాంట్రాక్టర్లపై కక్ష సాధింపు**
**ఉపాధి బిల్లులు చెల్లించకుండా వేధింపు**

- అయిన వారికే సొమ్ములిస్తున్నారు
- కేంద్రం నిధులూ పక్కదారి
- జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు ఫైర్

అమరావతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద చిన్న చిన్న పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం పైశాచికానందం పొందుతోందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మండిపడ్డారు. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయం ఫైర్ స్టేషన్ వద్ద టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి శుక్రవారం ఆయన ధర్నా చేశారు. అనంతరం బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీగా శాసనసభ ప్రాంగణానికి వెళ్లారు. అంతకుముందు మాట్లాడుతూ.. గతంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించకుండా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంని ఆయన మండిపడ్డారు. తన వారికి, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఉన్న శ్రద్ధ చిన్న కాంట్రాక్టర్లపై లేదని, దీనిని ఉన్మాద పాలన గాక ఏమంటారని నిలదీశారు. 'ఈ ప్రభుత్వం చాలా దుర్మార్గంగా ప్రవర్తిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద పంచాయతీ, స్పెషల్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో మెటీరియల్ కాంపొనెంట్ కోసం గ్రామాల్లో చిన్న చిన్న కాంట్రాక్టర్లు సొంతడబ్బుతో పనులు చేశారు. కానీ బిల్లులు చెల్లించకుండా జగన్ సర్కారు కక్షసాధింపునకు పాల్పడుతుండడంతో వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి. ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కేంద్రం 90 శాతం నిధులు ఇస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల రూ.1,850 కోట్లు విడుదల చేసింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టించింది. దీంతో ఉపాధి పనులు చేసిన కుటుంబాలు రోడ్డుపాలయ్యారు. ఎవరికీ నిధులివ్వని ప్రభుత్వం.. సీఎం నియోజకవర్గం పులివెందులలో పనులు చేసిన తమ వారికి మంజూరు చేసింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూరుతో పాటు తన సొంత తమ్ముడు ఉండే తంబళ్లపల్లెకు నిధులు ఇచ్చుకున్నారు. ముందు పనులు చేసిన వారికే ప్రాధాన్య పరంగా నిధులివ్వాలని కేంద్ర ప్రభుత్వం చాలా స్పష్టంగా చెప్పింది. రాష్ట్రప్రభుత్వం ఇష్టానుసారం చేస్తోంది. కేంద్ర ఆదేశాలను బేఖాతరు చేస్తూ, వితండవాదంతో రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెట్టి చిన్న చిన్న కాంట్రాక ర్లపై రాష్ట్రప్రభుత్వం కక్ష తీర్చుకుంటోంది. ఉపాధి నిధులు మళ్లించడానికి అవకాశం లేకున్నా ఇష్టానుసారం దారిమళ్లిస్తోంది. ఇది దుర్మార్గం. గత ఏడాది కేంద్రం రాష్ట్రానికి రూ.9,500 కోట్ల పనులు మంజూరుచేస్తే.. జగన్ ప్రభుత్వ తీరు కారణంగా ఈ ఏడాది డబ్బులు తీసుకోవడానికి రాష్ట్రానికి అర్హత లేకుండా చేసే పరిస్థితి వచ్చింది. మేఘా, గాయత్రి లాంటి పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు, మంత్రి పెద్దిరెడ్డి చేసిన ఇరిగేషన్ పనులకో, ఇంకో పనులకో డబ్బులిస్తారు.. చిన్న కాంట్రాక్టర్లకు మాత్రం నిధుల్లేవంటూ మొండిచేయిచూపుతున్నారు. ఇది పైశాచికానందం. దీన్ని ఉన్మాద పాలన గాక ఏమంటారు' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు.

ఆస్ట్రేలియా x న్యూజిలాండ్
తొలి టెస్ట్ - మూడో రోజు
ఉ.10.30 నుంచి
సోనీ సిక్స్‌లో

పాకిస్థాన్ x శ్రీలంక
తొలి టెస్ట్ - నాలుగో రోజు
ఉ.10.15 నుంచి
సోనీ-ఈఎస్‌పీఎన్



ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియం

మూడు నెలల్లో సిద్ధం

## రూ. 700 కోట్లు.. లక్ష కెపాసిటీ

**అహ్మదాబాద్:** ప్రస్తుతం ప్రపంచంలో అతి పెద్ద క్రికెట్ స్టేడియంగా.. మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియం (ఎంసీజీ) అలరారుతోంది. ఈ స్టేడియం సామర్థ్యం లక్ష. కానీ ఇప్పుడు అంతకుమించి పెద్ద స్టేడియం నిర్మితమవుతోంది. లక్షా పదివేలమంది కూర్చునే కెపాసిటీ కలిగిన ప్రపంచంలోని అతి పెద్ద స్టేడియం అహ్మదాబాద్‌లో మరి కొద్దినెలల్లో సిద్ధమవుతోంది. రూ. 700 కోట్లకుపైగా వ్యయంతో అత్యంత అధునాతనంగా రూపుదిద్దుకుంటున్న ఈ సర్దార్ పటేల్ స్టేడియంలో మొట్టమొదటి మ్యాచ్ 2020 మార్చిలో జరగనుంది. ఆసియా లెవెన్, వరల్డ్ లెవెన్ జట్లు ఈ పోరులో తలపడనున్నాయి. స్టేడియంలో 70 కార్పొరేట్ బాక్సులు, నాలుగు డ్రెస్సింగ్ రూంలు, ఓ క్లబ్‌హౌస్, ఒలింపిక్ స్థాయి స్విమ్మింగ్ పూల్ ఉన్నాయి. స్టేడియం నిర్మాణం 2017లో ప్రారంభమైంది. ప్రస్తుతం దేశంలో పెద్ద స్టేడియంగా ఉన్న ఈడెన్ గార్డెన్స్ (66 వేల సామర్థ్యం) రికార్డును సర్దార్ పటేల్ స్టేడియం అధిగమించనుంది.



విండీస్‌తో సిరీస్‌కు డౌట్

## భువనేశ్వర్‌కు గాయం

**చెన్నై:** భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ మరోసారి గాయం బారిన పడ్డాడు. దీంతో వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు అతడు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భువీ స్థానంలో శార్దూల్ ఠాకూర్ ఎంపికయ్యే చాన్సుంది. మరోవైపు భువీ గాయంపై బోర్డు నుంచి అధికారిక ప్రకటన రాలేదు. విండీస్‌తో జరిగిన ఆఖరి టీ20లో తనకు అసౌకర్యంగా ఉందని టీమ్ మేనేజ్‌మెంట్‌కు భువీ సమాచారమిచ్చాడు. అయితే శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ఈ విషయమై ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. టీమ్ ఫిజియోథెరపిస్ట్‌ను సంప్రదించాకే భువీ గాయం తీవ్రతపై స్పష్టత రానుంది. ఆతర్వాతే సెలెక్టర్లు కూడా మరో ఆటగాడిని ఎంపిక చేయాలనుకుంటున్నారు. శార్దూల్‌తో పాటు నవ్‌దీప్ సైనీ, ఖలీల్ అహ్మద్ ఈ బెర్త్ కోసం పోటీలో ఉన్నారు. ఇప్పటికే ధవన్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. రెండేళ్లుగా భువీకి గాయాల బెడద తప్పడం లేదు. ఇటీవలే కోలుకుని టీ20 సిరీస్ ఆడిన అతడు ఇప్పుడు మరోసారి జట్టుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

## ఊరట విజయం

**వరల్డ్ టూర్ ఫైనల్స్ నుంచి నిష్క్రమించిన సింధు**



**గ్వాంగ్జౌ (చైనా):** వరల్డ్ టూర్ ఫైనల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించిన భారత స్టార్ పీవీ సింధుకు కాస్త ఊరట. గ్రూప్-ఏలో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన ఈ డిఫెండింగ్ చాంపియన్ ఆఖరి పోరును విజయంతో ముగించి ఇంటిబాట పట్టింది. శుక్రవారం జరిగిన తన గ్రూప్‌లోని నామమాత్రమైన చివరి, మూడో మ్యాచ్‌లో సింధు 21-19, 21-19తో చైనా క్రీడాకారిణి హి బిన్‌గ్జియావోపై విజయం సాధించింది. బిన్‌గ్జియావోపై వరుసగా నాలుగు ఓటముల తర్వాత సింధుకు ఇది తొలి గెలుపు కావడం గమనార్హం. ఈ సీజన్‌లో అంతగా రాణించలేకపోయిన సింధు.. తదుపరి ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో ఆడనుంది.

## నీవు లేక నేను లేను

భార్యకు రోహిత్ ప్రేమ సందేశం



**న్యూఢిల్లీ:** భార్య రితికా సజ్దెను ఉద్దేశించి స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఇలాగే పాడుకుంటున్నాడు. శుక్రవారం రోహిత్-రితికల పెళ్లి రోజు. ఈ జంట పెళ్లిపీట లెక్కి నేటితో సరిగ్గా నాలుగేళ్లు. ఈ సందర్భంగా సతీమణికి రోహిత్ ట్విటర్ ద్వారా వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు. 'నీవు లేకుండా నా జీవితం ముందుకు సాగుతుందని అనుకోలేను. ఇంతకంటే ఆనందం మరోటి ఉండదు. ఐ లవ్ యూ..' అని ప్రేమతో కూడిన సందేశాన్ని రోహిత్ ట్వీట్ చేశాడు. అలాగే, తమ పెళ్లినాటి ఫొటోను పోస్ట్ చేశాడు. వైరల్‌గా మారిన ఈ ఫొటోకు నెటిజన్లు తెగ లైక్‌లు కొడుతున్నారు.

### పాక్ టెస్ట్‌ను వీడని వరుణుడు

**రావల్పిండి:** దశాబ్దం తర్వాత పాకిస్థాన్‌లో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌ను వరుణుడు వదలడం లేదు. శుక్రవారం, మూడో రోజు ఆటనూ అడ్డుకున్నాడు. తొలి సెషన్ పూర్తిగా రద్దుకాగా.. రెండో సెషన్‌లో కేవలం 5.2 ఓవర్ల (27 నిమిషాలు) ఆటే సాధ్యమైంది. ఓవర్‌నైట్ 263/6 స్కోరుతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక మరో 19 పరుగులు జోడించింది. ఆట నిలిపివేసే సమయానికి 282/6తో నిలిచింది. ధనంజయ డిసిల్వా (87) పెరీరా (6) క్రీజులో ఉన్నారు.



చెపాక్ స్టేడియంలో శుక్రవారం ప్రాక్టీస్ సెషన్‌లో మయాంక్ అగర్వాల్

ఈ ఏడాది ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ గుర్తుందా..? చెన్నైతో తలపడిన బెంగళూరు జట్టు ఆ మ్యాచ్‌లో కేవలం 70 పరుగులకే కుప్పకూలింది. ఈపాటి లక్ష్యం కోసం అటు చెన్నై కూడా 17.4 ఓవర్లు ఆడాల్సి వచ్చింది. దీంతో మ్యాచ్ ముగిశాక ఆర్‌సీబీ కెప్టెన్ కోహ్లీ పిచ్ స్పందించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయగా, అటు ఈ నాసిరకం వికెట్‌పై ధోనీ కూడా పెదవి విరిచాడు. ఇప్పుడు భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య తొలి వన్డేకు చెపాక్ వేదిక కావడంతో మరోసారి పిచ్ చర్చనీయాంశమైంది.

# ఈసారి ఓకేనా?

చర్చనీయాంశంగా మారిన చెపాక్ పిచ్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

**అ**టు ధోనీ.. ఇటు కోహ్లీ సేనలు బరిలోకి దిగడంతో ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో అభిమానులు ధనాధన్ ఆటతీరును ఆశించారు. కానీ బరిలోకి దిగాక ఒక్కో బంతిని ఆడేందుకు బ్యాట్స్‌మెన్ తెగ కష్టపడడంతో ఉసూరుమన్నారు. పిచ్ చాలా మందకొడిగా ఉండడంతో భారీ హిట్టర్లు షాట్లు ఎలా ఆడతారంటూ కెప్టెన్ కోహ్లీ అప్పట్లో ప్రశ్నించాడు. మంచు ప్రభావం ఉన్నా కూడా బంతి ఎక్కువగా టర్న్ అయిందని, ఇలాంటి పిచ్‌ను తానెప్పుడూ ఊహించలేదని బదులిచ్చాడు. దీంతో దిద్దుబాటుకు దిగిన తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) పిచ్‌ను సమూలంగా మార్చేందుకు నిర్ణయించింది. ఈ ఏడాది మేలో ఈ పనులు చేపట్టగా జూలైలో ముగిశాయి. ఇప్పుడు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ఆదివారం జరగబోయే తొలి వన్డే కోసం నాలుగు, ఐదో నెంబర్ పిచ్‌లను సిద్ధంగా ఉంచింది. ఇందులో ఒకదాన్ని కొత్తగా రూపొందించగా, మరో పిచ్‌కు అవసరమైన మార్పులు చేశారు. అయితే ఈ రెండింట్లో జట్లు ఏది కావాలనుకుంటే దాన్ని మ్యాచ్ కోసం వినియోగించనున్నారు. ఈ మధ్య కాలంలో వీటిపై ఎక్కువగా మ్యాచ్‌లు నిర్వహించని కారణంగా పిచ్ స్పందించే తీరుపై ఇప్పుడే ఓ అంచనాకు రావడం కష్టమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వన్డే మ్యాచ్ కావడంతో సమయం గడుస్తున్నకొద్దీ ఆటగాళ్లు ఓ అవగాహనకు వచ్చే అవకాశముంది.

### జాగ్రత్తగా ఆడాల్సిందే..



ఎంఏ చిదంబరం స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ రెండు పిచ్‌లపై ఆడేటప్పుడు జాగ్రత్త అవసరమని మాజీ ఆఫ్ స్పిన్నర్ ఎం. వెంకటరమణ అభిప్రాయపడ్డాడు. 'కొత్తగా ఏర్పాటు చేసిన ఈ పిచ్‌లు రెండు రకాలుగా స్పందించవచ్చు. ఒకటి చక్కటి బౌన్స్‌తో పాటు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. మరోటి సాధారణంగా మందకొడిగా ఉంటుంది. ఒకవేళ వికెట్ స్లోగా ఉంటే మాత్రం బంతి బ్యాట్‌పైకి రావడం కష్టమవుతుంది. ఈ సమయంలో బ్యాట్స్‌మెన్ ఆచితూచి ఆడాల్సిందే. అయితే ఇలాంటి ట్రాక్‌లు భారత బ్యాట్స్‌మెన్‌కు కొత్తేమీ కాదు. వీటిపై ఆడడం అలవాటే కాబట్టి త్వరగానే వారు అర్థం చేసుకోగలరు. కానీ విండీస్ ఆటగాళ్ల స్టయిల్‌కు ఇలాంటి పిచ్‌లు సరిపోవు. ఎందుకంటే వారు మూడు ఫార్మాట్లలోనూ టీ20 తరహాలో దూకుడుగా ఆడతారు. దీనికి తోడు తొలి వన్డే డే/నైట్ మ్యాచ్ కాబట్టి మంచు కూడా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయడం కష్టమవుతుంది' అని వెంకటరమణ తెలిపాడు.

## వామ్మో.. ఇదేం నోబాల్ ఇదేం వైడ్



**ఢాకా:** క్రికెట్‌లో మరీ ముఖ్యంగా టీ20ల్లో ఫిక్సింగ్ ఆరోపణలు వెల్లువెత్తుతుండగా.. బుధవారం ఆరంభమైన బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో ఓ బౌలర్ బౌలింగ్ చేసిన తీరు అనుమానాలు రేకెత్తించింది. వెస్టిండీస్‌కు చెందిన 34 ఏళ్ల ఎడమ చేతి మీడియం పేసర్ క్రిష్‌మర్ సంతోకి బీపీఎల్‌లో సిలెట్ థండర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. శుక్రవారం రాజ్‌షాహీ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంతోకి వేసిన బంతులు క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాయి. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్‌కు అతడు ఓవర్ ద వికెట్ బౌలింగ్ చేస్తూ.. లెగ్‌సైడ్‌కు అత్యంత దూరంగా ఫుల్‌టాస్ వేయడం గమనార్హం. ఆ బంతి వికెట్‌కు ఎంత దూరంగా వెళ్లిదంటే టెస్ట్‌ల్లోనూ ఆ బంతిని నిస్సందేహంగా వైడ్‌గా ప్రకటించేంతగా. ఆ బంతిని అందుకొనేందుకు కీపర్ మహ్మద్ మిథున్ ఎడమవైపు ఎంతో దూరం డైవ్ చేయాల్సి వచ్చింది. ఇక.. క్రిష్‌మర్ వేసిన నోబ్‌ను చూసి 'క్రికెట్‌లో ఇలాంటి నోబాల్ కూడా వేస్తారా?' అనిపించింది. అతడి కుడికాలు క్రీజ్‌కు చాలా దూరంగా పడింది. దాంతో సంతోకి బౌలింగ్‌పై నెటిజన్లు అనుమానాలు వ్యక్తంజేశారు. సంతోకి అనుమానాస్పద బౌలింగ్‌పై విచారణ చేయాలని బంగ్లా క్రికెట్ బోర్డును కోరామని సిలెట్ థండర్ జట్టు డైరెక్టర్ తంజిల్ చౌధురి వెల్లడించాడు.

### 'కోహ్లీలా కష్టపడండి'

**చెన్నై:** అంతర్జాతీయ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ అసాధారణ ఆటతీరును ప్రేరణగా తీసుకోవాలని తమ ఆటగాళ్లకు వెస్టిండీస్ అసిస్టెంట్ కోచ్ రాడీ ఎస్ట్‌విక్ సూచించాడు. అతడిలా కష్టపడడం నేర్చుకుంటేనే లక్ష్యాలను అందుకోగలరని తేల్చాడు. 'హెట్‌మయెర్, పూరన్, హోప్‌లాంటి ఆటగాళ్లతో విండీస్ పటిష్ఠంగా ఉందని భావిస్తున్నాను. అలాగే యువ ఆటగాళ్లు కూడా సత్తా చూపాలనుకుంటున్నారు. అయితే ఇందుకోసం ఎంత కష్టపడుతున్నారనేది కీలకం. ఈ విషయంలో అందరూ విరాట్ కోహ్లీని ఆదర్శంగా తీసుకోవాలి. ఫిట్‌నెస్ మెరుగుపర్చుకునేందుకు జిమ్‌లో అతడు తీవ్రంగా శ్రమిస్తాడు. కష్టపడనిదే విజయం రాదు. క్రికెట్‌లో విశ్రాంతికి తావులేదు' అని రాడిక్ స్పష్టం చేశాడు.

### శ్రేయాస్.. నెంబర్4లోనే ఆడాలి



**న్యూఢిల్లీ:** శ్రేయాస్ అయ్యర్ బ్యాటింగ్ ఆర్డర్‌ను పదేపదే మార్చడం సరికాదని మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. ఇటీవలి విండీస్‌తో టీ20 సిరీస్‌లో అతడిని ఐదు, ఆరు స్థానాల్లో ఆడించగా పూర్తిగా విఫలమయ్యాడు. అలాగే రాబోయే వన్డే సిరీస్ భారత బౌలర్లకు కఠినంగా ఉండనుందని చెప్పాడు. 'ధవన్ లేకపోవడంతో మరోసారి రాహుల్ ఓపెనింగ్ చేయడం ఖాయం. అలాగే శ్రేయాస్ అయ్యర్ సామర్థ్యం గురించి అందరికీ తెలుసు. నిలకడైన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. అయితే ఈ సిరీస్‌లో అతడిని నాలుగో నెంబర్‌లో ఆడిస్తేనే బావుంటుంది. ఇక విండీస్ జట్టులో పవర్ హిట్టర్లకు కొదువలేదు. దీంతో వారిని కట్టడి చేయడం భారత బౌలర్లకు సవాల్‌గా మారుతుంది' అని కుంబ్లే తెలిపాడు.

## ఆనంద్.. 'మైండ్ మాస్టర్'




**చెన్నై:** చెస్ దిగ్గజం, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ ఆత్మకథ 'మైండ్ మాస్టర్' పుస్తకాన్ని శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించారు. హిందూ ప్రచురణ సంస్థల ఛైర్మన్ ఎన్. రామ్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. 'మీకు చెస్ పట్ల అనురక్తి ఉంటే, ఆ ఆటలోని మజాను ఆస్వాదించాలంటే.. ఈ కంప్యూటర్ యుగంలో ఆడడానికి మించిన మజా ఉండదు. ఎందుకంటే.. కంప్యూటర్లు మీకు అపార అవకాశాలు కల్పిస్తాయి' అని ఈ సందర్భంగా ఆనంద్ పేర్కొన్నాడు. స్పోర్ట్స్ రైటర్ సుశాన్ నినన్ కార్యక్రమంలో పాల్గొన్నాడు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

**కాకినాడ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి):** జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ కాకినాడలోని ఏపీఎస్పీ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైంది. ఏపీఎస్పీ కమాండెంట్ ప్రవీణ్ అనూకర్ పోటీలను ప్రారంభించారు. లీగ్ కమ్ నాకౌట్ దశలో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పోటీపడుతున్నారు.

## మెస్సీ విజృంభణ

కేరళ-జంషెడ్‌పూర్ మ్యాచ్ డ్రా



**కోచి:** ఐఎస్ఎల్‌లో భాగంగా శుక్రవారం జంషెడ్‌పూర్‌తో మ్యాచ్‌ను 2-2తో కేరళ బ్లాస్టర్స్ డ్రా చేసుకుంది. పిటి (38వ.ని), వినీత్ (71వ.ని) చేసిన గోల్స్‌తో జంషెడ్‌పూర్ మ్యాచ్‌ను సొంతం చేసుకొనేలా కనిపించింది. కానీ రాఫెల్ మెస్సీ మౌలీ విజృంభించి 15 నిమిషాల (75, 87 ని.) వ్యవధిలో రెండు గోల్స్ చేయడంతో కేరళ ఊపిరిపీల్చుకుంది.

### ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నా



**న్యూఢిల్లీ:** ఆరు నెలలో, ఏడాదో కాదని.. గత నాలుగైదు సంవత్సరాలుగా తాను తీవ్ర మానసిక, శారీరక సమస్యలతో ఇబ్బందిపడుతున్నట్టు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వెల్లడించాడు. అవి మరీ భరించలేని స్థాయికి చేరడంతో క్రికెట్‌నుంచి విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింద న్నాడు. శ్రీలంకతో జరిగిన తొలి రెండు టీ20ల్లో ఆడిన మ్యాక్స్‌వెల్ ఆ తర్వాత హఠాత్తుగా జట్టునుంచి వైదొలగడం సంచలనమైంది. 'రెండునెలల క్రితం నేను ఆ నిర్ణయం తీసుకోవడం అప్పటికప్పుడు జరిగింది కాదు. సుదీర్ఘకాలంగా నేను మానసిక, శారీరక సమస్యలతో విసిగిపోయా. విశ్రాంతి తీసుకుంటే తప్ప వాటినుంచి బయటపడే పరిస్థితి లేకపోయింది' అని మ్యాక్స్ పేర్కొన్నాడు.

## దెబ్బతీసిన స్టార్క్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 109/5

**పెర్త్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న డే/నైట్ టెస్టులో న్యూజిలాండ్ జట్టు తడబడుతోంది. పేసర్ మిచెల్ స్టార్క్ (4/31) ధాటికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 32 ఓవర్లలో ఐదు వికెట్లకు 109 పరుగులు చేసింది. క్రీజులో సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ (66), వాట్లింగ్ (0) ఉన్నారు. రెండో రోజైన శుక్రవారం ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో విలియమ్సన్ (34)తో కలిసి టేలర్ మూడో వికెట్‌కు 76 పరుగులు జోడించాడు. అంతకుముందు ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 146.2 ఓవర్లలో 416 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (143), హెడ్ (56) రాణించారు. సౌతీ, వాగ్నర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.



మిచెల్ స్టార్క్ (4/31)



## డబ్ల్యూఈఎఫ్ క్రిస్టల్ అవార్డుకు దీపిక ఎంపిక

న్యూఢిల్లీ, డిసెంబరు 13: ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) క్రిస్టల్ అవార్డుకు నటి దీపికా పడుకోన్, మరో ముగ్గురు ఎంపికయ్యారు. సమాజంలో మార్పులకు ప్రేరణగా నిలిచిన కళాకారులను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. చైనాకు చెందిన జిన్ జింగ్‌తో పాటు థెస్టర్ గేట్స్(షికాగో), లినెట్టె వాల్‌వర్త్(ఆస్ట్రేలియా)ను ఈ అవార్డు వరించింది. మానసిక ఆరోగ్యంపై ప్రజలను చైతన్యం చేసినందుకు దీపికకు ఈ అవార్డు ఇవ్వనున్నారు.



## శబరిమలకు వెళ్లే మహిళలకు భద్రతపై ఆదేశాలు ఇవ్వలేం

▸▸ సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 13: శబరిమల అయ్యప్ప ఆలయానికి వెళ్లే మహిళలకు పోలీసు భద్రత కల్పించేలా కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న ఇద్దరు మహిళా కార్యకర్తల విజ్ఞప్తులను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ అంశం భావోద్వేగాలతో ముడిపడినదని, ఈ విషయంలో పరిస్థితి విస్ఫోటకంగా మారాలని కోరుకోవడం లేదని వ్యాఖ్యానించింది. ఈ అంశాన్ని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం పరిశీలించాలని ఇప్పటికే నిర్ణయించినందున తాజా పిటిషన్లపై ఎటువంటి ఆదేశాలు ఇవ్వబోమని పేర్కొంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలో జస్టిస్ బీఆర్ గవయీ, జస్టిస్ సూర్యకాంత్ కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ గత ఏడాది సెప్టెంబరు 28న ఇచ్చిన తీర్పుపై స్టే లేదని స్పష్టం చేసింది.

## అమెరికాలో మట్లివారిపల్లె యువకుడి ఆత్మహత్య



కురబలకోట, డిసెంబరు 13: చిత్తూరు జిల్లా కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన ఓ యువకుడు అమెరికాలో ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం కుటుంబీకులకు సమాచారం అందింది. మృతుడి బంధువుల వివరాల మేరకు.. మట్లివారిపల్లెకు చెందిన జయచంద్రారెడ్డి, రమణమ్మ దంపతుల చిన్న కుమారుడు ద్వారకనాథ రెడ్డి(39) మదనపల్లెలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం బెంగళూరు, హైదరాబాదులోని పలు కంపెనీల్లో పనిచేశారు. పదేళ్ల కిందట నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన కల్యాణిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరికి ధృవన్, యవన్ అనే ఇద్దరు కుమారులున్నారు. వివాహం తర్వాత ఏడాది పాటు హైదరాబాదులోని అమెజాన్ కంపెనీలో పనిచేసిన ద్వారకనాథ్ కంపెనీ ఆదేశాలతో కొంతకాలంగా అమెరికాలోని న్యూజెర్సీలో నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ద్వారకనాథరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందింది.

# 'రేప్ ఇన్ ఇండియా'పై రభస

## జార్ఖండ్ ఎన్నికల సభలో రాహుల్ హేళన.. మండిపడ్డ బీజేపీ - దద్దరిల్లిన లోక్‌సభ

శీతాకాల సమావేశాల చివర్రోజున లోకసభలో వేడి...! కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన 'రేప్ ఇన్ ఇండియా' వ్యాఖ్య తీవ్ర వివాదం రేపి.. సభను హోరెత్తించింది. 'ప్రధాని మోదీ మేకిన్ ఇండియా పథకం గురించి పదేపదే చెబుతారు. అది గొప్ప పథకం అనుకుంటాం. కానీ ఇపుడు పేపరు తిరగేస్తే చాలు.. అత్యాచారాలకు సంబంధించిన వార్తలే! బీజేపీ-పాలిత రాష్ట్రాల్లోనూ ఇదే తీరు. ఇపుడు మేకిన్ ఇండియా కాదు.. రేప్ ఇన్ ఇండియా అన్నది కనిపిస్తోంది' అని జార్ఖండ్‌లో ఓ ఎన్నికల సభలో ఆయన పేర్కొన్నారు. దీనిపై బీజేపీ మండిపడింది. రేప్‌ను రాజకీయం చేస్తారా.. అని గళమెత్తింది. అంతేకాక.. బీజేపీ ఆయన కామెంట్‌ను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసికెళ్లింది. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసినా రాహుల్ అందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గతంలో మోదీ ఢిల్లీని 'రేప్‌ల రాజధాని' అనలేదా అని ఎదురుదాడికి దిగారు. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్ పెట్టారు..



### మహిళ పడే బాధను రాజకీయం చేస్తారా?

రాహుల్‌పై స్మృతి దాడి

న్యూఢిల్లీ, డిసెంబరు 13: జార్ఖండ్ ఎన్నికల సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యను బీజేపీ సానుకూలంగా మల్చుకుంది. శుక్రవారం లోక్‌సభ సమావేశమై 2001 పార్లమెంట్ దాడి ఘటనలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటించాక పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఈ అంశాన్ని ప్రస్తావించి- అనేకమంది మహిళా ఎంపీలు దీనిపై వాయిదా తీర్మానం ఇచ్చారన్నారు. ఆ తరువాత స్మృతీ ఇరానీ లేచి- 'రాహుల్ మహిళలను అవమాన పరిచారు. దేశంలోని మహిళలందరిపైనా అత్యాచారం జరగాలని పిలుపిచ్చారు. ఇది ఘోరం. స్వతంత్ర భారత చరిత్రలో ఇలా పిలుపిచ్చిన కాంగ్రెస్ నేత ఎవ్వరూ లేరు. రేప్ అంటే ఓ మహిళ పడే బాధ. తట్టుకోలేని పరిస్థితి. దీనిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటారా? ఆయన క్షమాపణ చెప్పాల్సిందే' అని డిమాండ్ చేశారు. 'మేకిన్ ఇండియా అనేది యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రారంభించిన ఓ గొప్ప పథకం. దీన్ని రాహుల్ అలా అభివర్ణించారంటే... ఆయన పార్లమెంట్ సభ్యుడిగా ఉండే నైతిక అర్హత కోల్పోయారు' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాహుల్ మాటలు వింటూంటే రోత పుడుతోందని పలువురు బీజేపీ, ఎన్‌డీఏ మహిళా ఎంపీలు వ్యాఖ్యానించారు. రాహుల్ క్షమాపణ చెప్పాలని కోరుతూ వారంతా సభ మధ్యలోకి దూసుకెళ్లి నిరసన కొనసాగించారు. రాహుల్ వ్యాఖ్యలపై మీరేమంటారని మంత్రి ప్రహ్లాద్ జోషి - కనిమొళి, సుప్రియా సూలేలను ప్రశ్నించారు.



### 'ఈశాన్యం' నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే!

రాహుల్ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 13: దేశంలో మహిళలపై అత్యాచారాలు పెచ్చరిల్లినా ప్రధాని నరేంద్ర మోదీ ఒక్క ముక్క కూడా మాట్లాడడం లేదని రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు. పౌరసత్వ సవరణ బిల్లు (క్యాబ్) ఆమోదం వల్ల ఈశాన్య రాష్ట్రాలు భగభగ మండిపోతున్నాయి. వాటి నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ ఈ రభస చేస్తోంది. " ఎక్కడ చూసినా రేప్‌లే. ఇది రేప్ ఇన్ ఇండియా. యూపీలో ఓ బీజేపీ మంత్రి మహిళపై అకృత్యానికి పాల్పడ్డాడు. కారులో వెళుతున్న ఆమెను, బంధువులను లారీతో ఢీకొట్టించాడు. ఎక్కడా మహిళకు భద్రత లేదు" అని జార్ఖండ్ సభలో తాను అన్నట్లు రాహుల్ వివరణ ఇచ్చారు. 'నేను కాదు, ప్రధాని మోదీయే క్షమాపణ చెప్పాలి. 1) ఈశాన్యంలో మంటలు రేపినందుకు 2) దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసినందుకు 3) ఢిల్లీని రేప్‌ల రాజధాని అన్నందుకు" అని ట్వీట్ చేశారు. తాను క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదన్నారు. 'నేను చేసిన వ్యాఖ్యను, ప్రధాని గతంలో చేసిన కామెంట్‌ను ట్విటర్‌లో పెట్టా. ఈ దేశ ప్రజలంతా చూడొచ్చు, ఎవరిది తప్పో..!' అన్నారాయన. దేశంలో మహిళలందరిపైనా అత్యాచారాలు జరపాలని తాను పిలుపిచ్చినట్లు స్మృతీ ఇరానీ పేర్కొనడం పచ్చి అబద్ధమని, తన మాటలను ఆమె వక్రీకరించారని విమర్శించారు. కాగా, రేప్ ఇన్ ఇండియా అని రాహుల్ చేసిన వ్యాఖ్య ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని బీజేపీ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదుచేసింది. స్మృతీ ఇరానీ నేతృత్వంలో శుక్రవారం సాయంత్రం ఈసీని కలిసి విజ్ఞాపన చేసింది. 'అత్యాచారాలను రాజకీయ ఆయుధంగా వాడుకోవడం కోడ్ ఉల్లంఘనే. జార్ఖండ్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచాలి' అని అందులో కోరింది.

## లోక్‌సభ ఓట్ల గణాంకాల్లో తేడాలు!

▸▸ ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 13: గత లోక్‌సభ ఎన్నికలలో పోలైన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ మధ్య ఉన్న తేడాలకు సంబంధించి దాఖలైన రెండు వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు స్పందించింది. రెండు ఎన్జీవోలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై సీజే బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి నోటీసులిచ్చింది.

## ఉభయ సభల నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 13: పార్లమెంట్ కొత్త భవనంలోనే 2022 సమావేశాలు జరుగుతాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు. అదే ఏడాది స్వతంత్ర భారతావని 75 ఏళ్ల సంబరాలు కూడా చేసుకుంటామన్నారు. ప్రతిపాదిత భవనాన్ని ఎక్కడ నిర్మిస్తున్నారన్న ప్రశ్నకు ప్రభుత్వం 2-3 ప్రాంతాలను పరిశీలిస్తోందని చెప్పారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. దీంతో లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభను చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు నిరవధికంగా వాయిదా వేశారు.








పశ్చిమబెంగాల్‌లోని బెల్డంగ రైల్వే స్టేషన్‌కు నిప్పుపెట్టిన ఆందోళనకారులు

# బలగాల గుప్పెట్లో ఈశాన్యం

### అసోంలో కొనసాగుతున్న నిషేధాజ్ఞలు

గువాహటి, డిసెంబరు 13: భద్రతాబలగాల గుప్పెట్లో ఈశాన్యం బిక్కుబిక్కుమంటోంది. పౌరసత్వ సవరణ చట్టంపై అసోం,మేఘాలయల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు కర్ఫ్యూని సడలించారు. దీంతో పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చారు. రాజ్‌భవన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. రాజ్‌భవన్ వద్ద ఉన్న పోలీసులపై రాళ్లు రువ్వారు. పోలీసులు లాఠీ చార్జీచేసి ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. మరోవైపు ఇంటర్నెట్, ఎస్సెమ్మెస్ సర్వీసులపై గురువారం విధించిన 48 గంటల నిషేధం కొనసాగుతోంది. అసోంలో కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. గువాహటి భద్రతాబలగాల గుప్పిట్లో ఉంది.స్కూళ్లు, ఆఫీసులు తెరుచుకోలేదు. శుక్రవారం కూడా సైన్యం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించింది. నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయని, అయితే నిత్యావసర వస్తువుల సరఫరాకు మినహాయిం పునిచ్చామని ఉన్నతాధికారులు వెల్లడించారు.

### జామియా వర్సిటీలో లాఠీ చార్జి

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ రణరంగంగా మారింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ వర్సిటీ విద్యార్థులు పార్లమెంట్ భవనం వరకు ర్యాలీగా వెళ్లాలని బయలు దేరారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ దశలో వీరి మధ్య తోపులాట చోటు చేసుకుంది. విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. 50 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు.

## బాలికపై సవతి తండ్రి హత్యాచారం

▸▸ మహారాష్ట్రలోని పుణెలో దారుణం

పుణె/మహోబా/జబల్‌పూర్/థానే/బాఘ్‌పట్, డిసెంబరు 13: మహారాష్ట్రలోని పుణెలో దారుణం జరిగింది. 15 ఏళ్ల బాలికపై సవతి తండ్రే అత్యాచారం జరిపి, గొంతు నులిమి చంపేశాడు. ఈ ఘటనకు గురువారం ఉదయం ఆ బాలిక తల్లి, సవతి తండ్రి మధ్య తీవ్ర వాగ్వాదమే కారణమని భావిస్తున్నారు. వాగ్వాదం క్రమంలో తీవ్ర పరిణామాలుంటాయని అతడు హెచ్చరించి వెళ్లాడు. కొన్ని గంటలకే బాలిక ఇంట్లో శవమై కనిపించింది. నిందితుడు పరారీలో ఉన్నాడు. పుణెలోనే ఓ ప్రముఖ ఆస్పత్రికి చెందిన వైద్యుడి(48)పై రేప్ కేసు నమోదైంది. ఆయన గత మూడేళ్లలో పలుమార్లు తనపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ మహిళా రోగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే తనను గుడిలో పెళ్లి కూడా చేసుకున్నారని ఆరోపించింది. ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లాలో ఇంట్లో ఒంటరిగా ఉన్న 13 ఏళ్ల బాలికపై రాహుల్ పాసవాన్(22) అనే పొరుగింటి వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో చాక్లెట్ ఆశజూపి ఐదేళ్ల బాలికను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఓ బాలుడు అత్యాచారానికి తెగబడ్డాడు. చిన్నారి అరుపులు విని జనం అక్కడికి చేరుకొని, బాలుడిని పోలీసులకు అప్పగించారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పట్‌లో సామూహిక అత్యాచార కేసు నిందితుడు సోహరన్ బరితెగించాడు. తనకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెబితే 'ఉన్నావ్' కంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ ఏకంగా బాధిత బాలిక ఇంటి గోడలపై రాశాడు. పోలీసులు సోహరన్‌ను అరెస్టు చేశారు.

## నేడే ట్రంప్‌పై అభిశంసన



వాషింగ్టన్, డిసెంబరు 13 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రతిపక్షం పెట్టిన అభిశంసన తీర్మానంపై శనివారం (భారత కాలమానం) ఓటింగ్ జరగనుంది. ఉక్రెయిన్ నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనేది డెమొక్రాట్ల ప్రధాన అభియోగం. దీనిపై గురువారం మొదలైన న్యాయకమిటీ విచారణ శుక్రవారం తెల్లవారుజాము వరకు సాగింది. అభిశంసన చట్టంలోని రెండు అధికరణాలను ట్రంప్ ఉల్లంఘించినట్టు కమిటీలోని 23మందిలో అత్యధికంగా 17 మంది నిర్ధారించారు. నిజానికి, ఈ విచారణ పూర్తికాగానే ఓటింగు చేపట్టాల్సి ఉంది. అయితే, ఏకధాటిగా 14 గంటలు విచారణ చేపట్టిన కమిటీ సభ్యులకు విరామం అవసరమని భావించి ఓటింగ్‌ను శనివారానికి వాయిదా వేశామని ప్రతినిధుల సభ చైర్మన్ జెర్రీ నడ్లర్ వెల్లడించారు. ఈ కమిటీకి ఆయనే నేతృత్వం వహించారు. కాగా, ప్రతినిధుల సభలో డెమొక్రాట్లకు తగినబలం ఉండటంతో ఈ ఓటింగ్ ప్రక్రియ లాంఛనప్రాయమే కానుంది.

### భారత్‌తో మాది అసాధారణ బంధం: జూనియర్ ట్రంప్

విశ్వాన్ని శాంతిధామం చేసేందుకు భారత్‌తో కలిసి అమెరికా పనిచేయాలని జూనియర్ ట్రంప్ ఆకాంక్షించారు. భారత్‌తో తమది 'అసాధారణ మిత్రబంధం'గా అభివర్ణించారు. భారతీయసంతతి ఎక్కువగాఉండే లాంగ్ ఐస్‌ల్యాండ్ ప్రాంతంలో శుక్రవారం ఆయన తండ్రి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ బస్సులు.. ఇప్పుడే అక్కర్లేదు

▸▸ లీజు ప్రతిపాదన సరికాదు

▸▸ ఒక్కో బస్సుపై 45 లక్షలా?

▸▸ వీటి కంటే డీజిల్ బస్సులే మేలు

▸▸ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్ స్పష్టీకరణ

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సులను లీజు ప్రాతిపదికన తీసుకోవాలన్న ప్రతిపాదన అర్థరహితమని జ్యుడీషియల్ ప్రివ్యూ కమిషన్ స్పష్టం చేసింది. లీజుపై తీసుకునే ఒక్కో బస్సుకు రూ.45 లక్షలు చెల్లించడం ఏమాత్రం సమంజసం కాదని పేర్కొంది. అసలు ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సులు నడపాల్సిన అవసరమే లేదని కమిషన్ చైర్మన్ జస్టిస్ బి.శివశంకరరావు తన నివేదికలో తేల్చిచెప్పారు. విద్యుత్ బస్సుల టెండర్లపై కమిషన్ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 'లీజు ప్రతిపాదన సరికాదు. 350ఎలక్ట్రిక్ బస్సులను లీజుకు తీసుకుని నడపడం కంటే డీజిల్ బస్సులు నడపడమే మేలు. ఎలక్ట్రిక్ బస్సుల సాంకేతికత ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. మౌలిక సదుపాయాలు ఇంకా పూర్తిస్థాయిలో లేవు. సాంకేతికత ఇంకా అభివృద్ధి చెంది ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి పెరిగితే ధరలు కూడా బాగా తగ్గుతాయి' అని అభిప్రాయపడింది. ఒక్కో ఎలక్ట్రిక్ బస్సుకు రూ.45 లక్షల రాయితీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవడం అర్థరహితమని.. రాష్ట్రం ఆర్థికంగా కుదేలై ఉన్న పరిస్థితిలో రూ.157.5 కోట్లు రాయితీగా చెల్లించడం అసంబద్ధ చర్యగా పేర్కొంది. 'ఒక్కో బస్సుకు కేంద్రం ఇచ్చే రూ.55 లక్షల సబ్సిడీ కలిపి.. ఆర్టీసీయే 100 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయడం ఉత్తమం'అని సూచించింది. అయితే అద్దెకు తీసుకునే ఒక్కో ఎలక్ట్రిక్ బస్సుకు రూ.45 లక్షల రాయితీ ఇవ్వాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మాత్రమేనని ఏపీఎస్ఆర్టీసీ పేర్కొంది. దీనివల్ల బస్సు సరఫరాదారుకు భారం తగ్గుతుందని, ఆర్టీసీపై కూడా అద్దెభారం తగ్గుతుందని చెప్పింది.

### నగరాలకు పర్యావరణ ఇబ్బందుల్లేవు..

పర్యావరణపరంగా ఇప్పటికిప్పుడు రాష్ట్రంలోని నగరాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదని కమిషన్ స్పష్టం చేసింది. విశాఖ, కాకినాడ, విజయవాడ, అమరావతి, తిరుపతిలో బీఎస్-4 తరహా బస్సులు వినియోగిస్తే పర్యావరణ సమస్య రాబోదని తెలిపింది.

## బ్రిటన్ ఎన్నికల్లో జాన్సన్ ఘనవిజయం



లండన్, డిసెంబరు 13: బ్రిటన్‌లో రాజకీయ అనిశ్చితికి తెరపడింది. ఐరోపా సమాజం (ఈయూ)నుంచి బ్రిటన్ విడిపోవడానికి అంటే బ్రెగ్జిట్‌కు దాదాపు లైన్‌క్లియర్ అయింది. హౌస్ ఆఫ్ కామన్స్(దిగువ సభ)కు జరిగిన ఎన్నికల్లో ప్రధాని బోరిస్ జాన్సన్ (55) ఘనవిజయం సాధించారు. కడపటి వార్తలు అందేసరికి 650 స్థానాల సభలో ఆయన సారథ్యంలోని కన్సర్వేటివ్ పార్టీ 364 స్థానాలు దక్కించుకుంది. 1980ల్లో ఉక్కుమహిళగా పేరొందిన నాటి ప్రధాని మార్గరెట్ థాచర్ ఆధ్వర్యంలో మాత్రమే ఈ పార్టీ సొంతగా మెజారిటీ సాధించింది. ఇన్నేళ్లకు జాన్సన్ ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తి అయ్యారు. జెరిమీ కోర్బిన్ నేతృత్వంలోని లేబర్ పార్టీ మరోసారి ప్రతిపక్ష స్థానానికే పరిమితమైంది. 203స్థానాలే సాధించి చతికిలబడింది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన 15మంది ఎన్నికయ్యారు. ఇదీ రికార్డే. వీరిలో బోరిస్ కేబినెట్‌లో హోంమంత్రి ప్రీతి పటేల్, ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అల్లుడు రిషి సునక్ కూడా ఉన్నారు.






Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.